LGTV
RNI NO. APBIL/2013/50718
LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
# లోకల్ గైడ్
ఎడిటర్: చిలకమర్రి రంరెడ్డి
ద్విభాషా దినపత్రిక
www.localguidenews.com

లోకల్ గైడ్ తెలంగాణ www.localguidenews.com
విలేకరులు కావలెను
సరికొత్త హంగులతో నూతన ఒరవడితో వెలువడుతున్న లోకల్ గైడ్ జాతీయ తెలుగు దినపత్రికలో పని చేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లా ఇన్చార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల ఆర్సీలు,మరియుమండలాల వారిగా రిపోర్టర్లు కావలెను.
ADVERTISEMENT మేనేజర్లు కావలెను అనుభవము ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును సంప్రదించండి
8977761499/9110308094

ప్రచురణ :, తెలంగాణ | సంపుటి 13, | సంచిక ,251 | పేజీలు -12 | మంగళవారం - 06 - అక్టోంబర్ - 2026 | వెల రూ.2/-



## భూమిపై భారీ ఉల్కాపాతం.. వయసు లెక్కింపులో 10 కోట్ల సంవత్సరాలు తక్కువగా నిర్ధారణ

- ఒక్లహోమాలోని ఏమ్స్ ఉల్కాపాతం క్రేటర్ వయసుపై కొత్త పరిశోధన
- గత అంచనా కంటే 10 కోట్ల సంవత్సరాలు తక్కువ వయసు అని నిర్ధారణ
- గతంలో 46.7 కోట్ల ఏళ్లు కాగా, ఇప్పుడు 37 కోట్ల ఏళ్ల క్రితం ఏర్పడినట్లు గుర్తింపు
- జిర్కాన్ డేటింగ్ పద్ధతి ద్వారా శాస్త్రవేత్తల తాజా అంచనా
- భారీ జీవరాశుల వినాశనం జరిగిన కాలానికి దగ్గరగా ఈ సంఘటన




## భారత్-అమెరికా వాణిజ్య చర్చలపై నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు

ఢిల్లీ: భారత్, అమెరికాల మధ్య కొంతకాలంగా కొనసాగుతున్న వాణిజ్య ఒప్పంద చర్చలు దాదాపుగా తుది దశకు చేరుకున్నప్పటికీ, ప్రస్తుతం అవి ప్రతిష్టంభనలో ఉన్నట్లు కనిపిస్తున్నాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య వాణిజ్యం ప్రస్తుతం భారత్‌కు అనుకూలంగా ఉండటంతో, ఆ లోటును తగ్గించుకోవడానికి అమెరికా తీవ్రంగా ప్రయత్నిస్తోందని ఆమె వెల్లడించారు. మిగతా 2 లో

- భారత్-అమెరికా వాణిజ్య చర్చల్లో స్తబ్దత ఏర్పడిందన్న నిర్మలా సీతారామన్
- ప్రస్తుతం వాణిజ్యం భారత్‌కే అనుకూలంగా ఉందని వెల్లడి
- వాణిజ్య లోటును తగ్గించుకోవాలని అమెరికా భావిస్తోందని వ్యాఖ్య
- ఈయూ ఒప్పందాన్ని విజయవంతమైన ఉదాహరణగా చూపిన ఆర్థిక మంత్రి

# కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి

## బలహీన శిలల జోన్‌ను దాటిన సొరంగ తవ్వకాలు

- ★ఎస్ఎల్‌బీసీలో క్లిష్ట దశను అధిగమించాం
- ★మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి
- ★గత ఐదారు నెలల్లో 700 మీటర్ల మేర పురోగతి సాధించామన్న ప్రాజెక్టు బృందం
- ★ఉమ్మడి నల్లగొండ జిల్లా కీలక నీటిపారుదల ప్రాజెక్టులపై సమీక్ష




హైదరాబాద్: శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్‌-ఎల్‌బీసీ) సొరంగం పనుల్లో అత్యంత క్లిష్టమైన భూగర్భ పరిస్థితులను అధిగమించి కీలక ముందడుగు వేశామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. గతంలో ప్రమాదం జరిగిన ప్రాంతంలోని బలహీన శిలల జోన్‌ను దాటి ముందుకు వెళ్లడంతో పనుల వేగం పెంచేందుకు మార్గం సుగమమైందన్నారు. మిగతా 2 లో

## సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ కవిత ఆందోళన



మరిన్ని డిమాండ్లు..

- జూనియర్ అసిస్టెంట్ ఖాళీలను భర్తీ చేయాలి
- విజిలెన్స్ పేరుతో ఆపిన డిపెండెంట్లకు ఉద్యోగాలు ఇవ్వాలి
- ప్రతి కార్మికుడికి సొంత ఇంటి పథకం కోసం 2 గుంటల భూమి ఇవ్వాలి
- సింగరేణికి కొత్త బొగ్గు బ్లాకులు కేటాయించాలి
- సింగరేణి కార్మికులకు ఇన్కమ్ టాక్స్ రద్దు చేయాలి



## కేబీఆర్ పార్క్ చుట్టూ ఇక శాశ్వతంగా వన్‌వే జీహెచ్ఎంసీ కమిషనర్

- కేబీఆర్ పార్క్ చుట్టూ వన్‌వే ట్రాఫిక్‌ను శాశ్వతం చేసిన జీహెచ్ఎంసీ
- పాత ప్రాజెక్టులో మార్పులతో ప్రభుత్వానికి రూ.400 కోట్ల ఆదా
- నాగార్జున సర్కిల్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు కొత్త స్టీల్ ఫ్లైఓవర్
- ఏడాదిలోగా నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యం
- కేబీఆర్ పార్క్ వద్ద అండర్‌పాస్ కూడా నిర్మించనున్న అధికారులు

## గత ప్రభుత్వ విధ్వంసానికి పల్లెలు కన్నీళ్లు పెట్టుకున్నాయి

### గోదావరి-కావేరి అనుసంధానమైతే రాయలసీమకు నీటి సమస్య ఉండదు

- గోదావరి పుష్కరాల కంటే ముందే పోలవరాన్ని పూర్తిచేస్తాం..ప్రధాని మోదీతో ఆ ప్రాజెక్టును ప్రారంభిస్తాం
- అంతిమ లబ్ధిదారుడు ఎవరో తెలిసిపోయింది
- కేంద్రం సహకారంతో మునుపెన్నడూ లేనివిధంగా అభివృద్ధి



ప్రొద్దుటూరు: గోదావరి, కృష్ణా నదులను అనుసంధానం చేసి జలహారతి ఇచ్చే బాధ్యత తమదని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. గోదావరి పుష్కరాల కంటే ముందే పోలవరాన్ని పూర్తిచేస్తామని.. ప్రధాని మోదీతో ఆ ప్రాజెక్టును ప్రారంభిస్తామని మిగతా 2 లో

## రామప్ప సమీపంలో ఓపెన్‌కాస్ట్.. ఆపకుంటే ఉద్యమమే

### కేటీఆర్ ప్రభుత్వానికి హెచ్చరికలు జారీ

- ఆలయం పరిసరాల్లో బొగ్గుగని ప్రతిపాదన వెంటనే వెనక్కు తీసుకోవాలి
- ఒకవేళ ప్రభుత్వం ఈ మాటలు పట్టించుకోకుండా ఆలయానికి హాని చేసే ప్రయత్నాలు చేస్తే పెద్దఎత్తున ఉద్యమం చేపడతాం
- ములుగు జిల్లా, వెంకటాపూర్ గ్రామ పరిధిలో ఓపెన్ కాస్ట్‌ఏర్పాటు చేయడానికి సింగరేణి సంస్థ ప్రణాళికలు సిద్ధం చేసింది



ములుగు: ప్రఖ్యాత దేవాలయం రామప్పకు సమీపంలో ఓపెన్ కాస్ట్ గని మిగతా 2 లో



## మహిళలపై నేరాలను అరికట్టండి.. దుండగులకు వణుకు పుట్టాలి: సుప్రీంకోర్టు

- సామాజిక వ్యతిరేక శక్తుల్లో భయం సృష్టించాలని ఢిల్లీ పోలీసులకు సుప్రీంకోర్టు సూచన
- ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో అత్యాచార ఘటనలపై సుమోటోగా విచారణ చేపట్టిన ధర్మాసనం
- నేరం జరిగాక చర్యల కన్నా నివారణే ముఖ్యమని స్పష్టం చేసిన కోర్టు
- బీట్ పెట్రోలింగ్, నిఘా పెంచాలని, చీకటి ప్రదేశాలపై దృష్టి పెట్టాలని ఆదేశం
- చట్టవిరుద్ధ తినుబండారాల కేంద్రాల వద్ద పోకిరీల ఆగడాలను అరికట్టాలని సూచన

# రాయలసీమ పౌరుషమంటే గొడ్డలి పోట్లు కాదు.. అభివృద్ధి

## ప్రొద్దుటూరులో రూ.30,156 కోట్లతో అమరజీవి జలధార పథకానికి శ్రీకారం

- గొడవలు, కొట్లాటలు, గొడ్డలి పోట్లు కాకుండా అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్లాం"
- గత ప్రభుత్వం జలజీవన్ మిషన్ నిధులను నిర్వీర్యం చేసిందని తీవ్ర విమర్శ
- పులివెందుల, అరకులోనూ వివక్ష లేకుండా అభివృద్ధి పనులు చేస్తున్నామని వెల్లడి
- ఇది కక్షసాధింపుల ప్రభుత్వం కాదు, ప్రజాభివృద్ధి ప్రభుత్వమని స్పష్టీకరణ
- 'హర్ ఘర్ జల్ - జలజీవన్ మిషన్'కు 2019-24 మధ్య అధికారంలో ఉన్న ప్రభుత్వం తూట్లు పొడిచింది



అమరావతి: "యుద్ధం వచ్చినప్పుడు, హద్దులు దాటినప్పుడు నా గొంతు ఎలా ఉంటుందో మీకు తెలుసు. కానీ ఇది శాంతి సమయం. ప్రజలకు అభివృద్ధి చేయాల్సిన సమయం. అందుకే రాయలసీమ పౌరుషానికి తగిన స్పీచ్ మాట్లాడట్లేదు. రాయలసీమ అభివృద్ధికి అవసరమైన విధంగా మాట్లాడుతున్నా. గొడవలు, కొట్లాటలు, గొడ్డలి పోట్లు కాకుండా అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్దాం" అంటూ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాయలసీమ పౌరుషాన్ని ప్రస్తావిస్తూ మిగతా 2 లో

## వివేకా హత్య, లిక్కర్ స్కామ్‌పై సమాధానం చెప్పే ధైర్యం ఉందా?



- ప్రొద్దుటూరులో రూ.30,156 కోట్లతో 'అమరజీవి జలధార' పథకం
- ప్రారంభించిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్
- 90 లక్షల కుటుంబాలకు కుళాయిల ద్వారా సురక్షిత తాగునీరు అందించడమే లక్ష్యం
- రాయలసీమను హార్టికల్చర్, ఏరోస్పేస్, గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మారుస్తామని హామీ
- వివేకా హత్య, లిక్కర్ స్కామ్, ఇసుక కుంభకోణాలపై గొడ్డలి పార్టీ అధినేత సమాధానం చెప్పాలని డిమాండ్

లోకల్ గైడ్
LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
www.localguidenews.com



# సంపాదకీయం

## పుస్తకం ‘ఉత్త’ భూషణం

‘తల్లీ నిన్ను దలంచి పుస్తకము చేతన్ బూనితిన్’ అంటూ సరస్వతీ ప్రార్థనతో ఒక చాటుపద్యం ప్రారంభమవుతుంది. ‘నువ్వు నా మనసులో నిలిచి, మంచి, అందమైన మాటల్ని ధారగా ఇప్పుడు నాతో పలికించమని ఆ పద్యకవి ఆమెను ప్రార్థిస్తాడు. ‘జగత్తునే మోహపెట్టేదిగా, విప్పారిన కన్నులూ, పూర్ణచంద్రునివంటి ముఖమూ కలిగినదిగా’ ఆమెను సంబోధిస్తాడు. మరో కోణంలో ఈ పద్యం పుస్తకమెలా ఉండాలో చెబుతోంది-- అది వాగ్రూపంతోనే కాక, ఆ వాక్కులు మంచివిగానూ, అందంగానూ ఉండాలంటోంది. సరస్వతికి ఉపయోగించిన విశేషణాలను పుస్తకానికి కూడా అన్వయిస్తే, అది పాఠకజగత్తును మోహపెట్టేలా, వారి మనస్సుల్ని వికాసపరిచేలా, పూర్ణచంద్రుడిలా ఆహ్లాదం గొలిపేలా ఉండాలి. పుస్తకమెలా ఉండాలో చెప్పడమంటే, ఎలా ఉండకూడదో చెప్పడమే. పుస్తకాన్ని దేవతతో ముడిపెట్టడమంటేనే, దానికి పవిత్రతను ఆపాదించడం!. అందం, ఆహ్లాదం, పవిత్రతా వగైరాలన్నీ ఉంటేనే, పుస్తకంపట్ల కనీసమైన భక్తి శ్రద్ధలను, బాధ్యతను చాటుకుంటున్నామా? తొలినాటి వాగ్రూపమైన దశ, లేఖనంతో మొదలైన తాళపత్రాలు, భూర్జపత్రాలదశలలోకీ కాగితం దశలోకీ అడుగుపెట్టి అక్కడి నుంచి తాజాగా ఆడియో పుస్తకాల రూపంలో మరోసారి వాగ్రూపానికి చేరుకున్న ఇన్ని వందల, వేల సంవత్సరాల వ్యవధిలో కూడా పుస్తకరచనా, ప్రచురణా ఉన్నత ప్రమాణాలు కలిగిన ఒక వ్యవస్థగా మనం పూర్తిగా అభివృద్ధి చేసుకోగలిగామా? సినిమా వంటి నిన్నమొన్నటి జనమాధ్యమాలతో పోటీపడే స్థాయిలో పుస్తకాన్ని జనసామాన్యంలోకి తీసుకెళ్లగలిగామా? కవులు, రచయితలకిచ్చే గుర్తింపును-- నటులకు, నాయకులకు ఇచ్చే గుర్తింపులో సగానికైనా పెంచగలిగామా? ఇప్పుడు మరింత ఎక్కువమందికి అందుబాటులోకి వచ్చిన పుస్తకం ద్వారా జ్ఞాన, విజ్ఞాన, సారస్వతవ్యాప్తిలో మరింత పురోగమనాన్ని సాధించే బదులు తిరోగమనాన్ని చిత్రించిన దాఖలాల సంగతేమిటి?!. సరస్వతిలానే ప్రకృతి కూడా తల్లే. ఆ తల్లి జీవపరిణామ క్రమంలో మనిషికి మెదడు నిచ్చింది; ఆ మెదడు జ్ఞాన, విజ్ఞాన, సారస్వతావిష్కారాల వైపు మనిషిని నడిపించింది; మెదడుకు సమాంతరంగా ప్రకృతి ప్రసాదించిన మాట ఆ జ్ఞాన, విజ్ఞానాదులను తోటి మనిషితో పంచుకునే సౌలభ్యమిచ్చింది. అప్పటినుంచీ జ్ఞాన, విజ్ఞానవ్యాప్తిలో మనిషి మడమ తిప్పింది లేదు. వాక్కునే జ్ఞానవాహికగా చేసుకుని మాటల్లో, వాటికి ఆటపాటలు జోడించి జనంలోకి తీసుకెళ్లి భావి కావ్యేతిహాసాలకు బీజావాపం చేసిన చరిత్ర మనిషిది. ఆదికవి నన్నయ భట్టు తన ఆంధ్రమహాభారత కృతిభర్త రాజరాజనరేంద్రుని ఆస్థానాన్ని వర్ణిస్తూ-- అపార శబ్దశాస్త్రపారగులైన వైయాకరణులు, భారతరామాయణాద్యనేక పురాణ ప్రవీణులైన పౌరాణికులు, సనాట్యచతురంచు విశారదులైన మహాకవులు, సమస్తశాస్త్ర సాగర గరీయ ప్రతిభాప్రౌఢతర్కులు మొదలైన విద్వజ్జనాలు ఆయనను పరివేష్టించి ఉన్నారంటాడు. శ్రీనాథ మహాకవి విజయనగరంలో ప్రౌఢదేవరాయల ఆస్థాన పండితుడైన గౌడడిండిమ భట్టును శాస్త్రవాదంలో ఓడించి అతని కంచుఢక్కను పగులగొట్టించడం మరో ప్రసిద్ధ ఉదాహరణ. ఏ జ్ఞానరంగంలోనైనా అవలక్షణాలు, అపరిణతులు, అతర్క్యాలు, కుతర్కాలు చోటు చేసుకోకుండా అనాటి గురువులతోపాటు, పండితపరిషత్తులు అంకుశంలా పనిచేస్తూ జ్ఞానస్వచ్ఛతను పరిరక్షించడానికి ప్రయత్నించాయి. ఇప్పటి పుస్తక ప్రచురణ భాషలో చెప్పాలంటే ‘పరిష్కర్త’ పాత్రను నిర్వహించాయి. అటువంటిది, కాగితమూ, అచ్చుయంత్రమూ అందుబాటులోకి రావడంతో పుస్తకరూపం ధరించిన జ్ఞానం పండిత పరిషత్తులనూ, రాజాస్థానాలను దాటి వందల సంవత్సరాల క్రితమే ప్రజాస్థానంలోకి అడుగు పెట్టినా, మనదేశంలో ఇప్పటికీ పుస్తకప్రచురణ ఉన్నత ప్రమాణాలు కలిగిన వ్యవస్థగా అభివృద్ధి చెందకపోవడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? పుస్తకమూ, పుస్తక రచనా ప్రజాస్వామికమవుతూ అన్ని వర్గాలకూ అందుబాటులోకి రావడం శుభపరిణామం మనుకుంటే; ‘పరిష్కర్త’ రూపంలో అంకుశం లోపించి నాణ్యత అడుగంటడాన్ని ఎలా చూడాలి? దాంతో పుస్తకాలు అనేకం అక్షరాలా ‘పుస్తకాలు’ గా చేరకుండా ఉనికినూ వంచి పెట్టే స్థాయిలోనే ఉండిపోతున్నాయి. దాని ప్రభావం మంచి పుస్తకాలపైనా పడుతోంది. ఇప్పటికైనా మేలుకుని ప్రచురణ రంగాన్ని ఉన్నత ప్రమాణాలతో తీర్చిదిద్దుకోకపోతే హస్తభూషణం కావలసిన పుస్తకం ‘ఉత్త’ భూషణంగానే ఎప్పటికీ ఉండిపోతుంది.

## కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి

హైదరాబాద్: శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ) సొరంగం పనుల్లో అత్యంత క్లిష్టమైన భూగర్భ పరిస్థితులను అధిగమించి కీలక ముందడుగు వేశామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. గతంలో ప్రమాదం జరిగిన ప్రాంతంలోని బలహీన శిలల జోన్‌ను దాటి ముందుకు వెళ్లడంతో పనుల వేగం పెంచేందుకు మార్గం సుగమమైందన్నారు. అదనపు యంత్రాలను రంగంలోకి దింపాలని, తవ్విన రాళ్లు, మట్టిని బయటకు తరలించే వ్యవస్థను మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో వేగంతో పాటు కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా కీలక నీటిపారుదల ప్రాజెక్టులపై ఆయన సమీక్షించారు. గత ఐదారు నెలల్లో 700 మీటర్ల మేర సొరంగం తవ్వకాలు జరిగాయని ప్రాజెక్టు అధికారులు మంత్రికి వివరించారు. అవుట్‌లెట్ వైపు నుంచి 450 మీటర్లు, ఇన్‌లెట్ వైపు నుంచి 250 మీటర్ల మేర తవ్వకాలు జరిగాయని చెప్పారు. మొత్తం 43.968 కిలోమీటర్ల సొరంగానికి గాను 79 శాతం పనులు పూర్తయ్యాయని, తవ్వకాలు మరో 9.1 కిలోమీటర్ల మేర మిగిలి ఉన్నాయని తెలియజేశారు. క్లిష్ట పరిస్థితుల్లో పనిచేసిన అధికారులు, కార్మికులను ఈ సందర్భంగా మంత్రి అభినందించారు.

ఇకపై సాధారణంగా పనులు

సొరంగాల నిపుణుడు కల్నల్ పరీక్షిత్ మెహ్రా ఇన్‌లెట్ వద్ద ఎదురైన పరిస్థితులను వివరించారు. బలహీనమైన మట్టి, రాళ్లు ఒక్కసారిగా విరిగిపడే రాక్ బర్స్ట్ వంటి ప్రమాదకర పరిస్థితుల్లో మరో ప్రమాదం జరగకుండా ప్రారంభంలో తవ్వకాల వేగాన్ని ఉద్దేశపూర్వకంగానే తగ్గించినట్లు తెలిపారు. టన్నెల్ బోరింగ్ మెషీన్ (టీబీఎం) చిక్కుపడిపోయిన ప్రాంతాన్ని చుట్టి వెళ్లేలా చేపట్టిన తవ్వకాల్లో మరింత బలహీనమైన శిలల మండలాన్ని సురక్షితంగా దాటేందుకు 140 మిల్లీమీటర్ల సిమెంట్ పైపులతో తవ్వకాలు జరిగే భాగానికి ముందుగా గొడుగు మాదిరి రక్షణ కవచాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బలమైన రిబ్‌లను అమర్చడం, దశలవారీగా తవ్వడం, ముందున్న శిలల పరిస్థితిని తెలుసుకునేందుకు డ్రిల్లింగ్ పరీక్షలు చేయడం, అదనపు రక్షణ ఏర్పాట్లతో ప్రమాదాలను నియంత్రిస్తూ ముందుకు సాగినట్లు చెప్పారు. ప్రస్తుతం శిలల పరిస్థితి మెరుగుపడుతుండటంతో సాధారణంగా పనులు సాగించే అవకాశం ఏర్పడుతోందని తెలిపారు.

### 2028లో ప్రధాన సొరంగం అనుసంధాన లక్ష్యం

టన్నెల్-1లో రెండు వైపుల నుంచి సాగుతున్న తవ్వకాలు 2028 మే--జూన్ నాటికి కలిసే దశకు చేరుకుంటాయని మంత్రి ఉత్తమ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధాన సొరంగం, టన్నెల్-2, బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, ఇతర అనుబంధ పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. సమీక్షలో ఎంపీలు కె. రఘువీర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మందుల సామేల్, కె. జైవీర్‌రెడ్డి, వేముల వీరేశం, అనిల్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### రోజుకు 8 మీటర్ల మేర..

ప్రస్తుతం రెండు వైపుల కలిపి రోజుకు సుమారు 8 మీటర్ల మేర సొరంగం తవ్వకాలు జరిపినట్లు ప్రాజెక్టు బృందం తెలిపింది. ఒకట్రెండు రోజులు అది పది మీటర్లకు కూడా చేరిందని వివరించారు. అవుట్‌లెట్ వద్ద మూడు డ్రిల్లింగ్ భుజాలున్న బూమర్ యంత్రం ఇప్పటికే పనిచేస్తోందని, అక్కడ పనులు అవసరమైన వేగానికి చేరువలో ఉన్నాయని తెలిపింది. ఇన్‌లెట్ వద్ద ఇదే తరహా మరో యంత్రం అక్టోబర్‌లో అందుబాటులోకి రానుందని చెప్పింది. జర్మనీ నుంచి తెప్పిస్తున్న రైలు ఇంజిన్ (లోకోమోటివ్) అక్టోబర్ నెలాఖరుకు చేరుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అక్టోబర్ చివరి లేదా నవంబర్ ప్రారంభం నుంచి పనుల వేగం మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపింది.

## 2029 నాటికి 4-స్టార్.. ప్రభుత్వ స్కూళ్లపై మంత్రి లోకేశ్ సమీక్ష.. అధికారులకు కీలక ఆదేశాలు!

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఈ విషయంలో నిర్దేశిత లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా చేరుకోవాలని రాష్ట్ర ఐటీ, విద్య, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో వసతుల కల్పన, నైపుణ్యాభివృద్ధి అంశాలపై సోమవారం ఉండవల్లిలోని తన నివాసంలో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. ఏడాదిలోగా రాష్ట్రంలోని వన్-స్టార్ పాఠశాలలన్నింటినీ టూ-స్టార్ స్థాయికి అప్‌గ్రేడ్ చేయాలని స్పష్టం చేశారు. అలాగే, ప్రస్తుత విద్యా సంవత్సరంలోగా జీరో-స్టార్ రేటింగ్ ఉన్న పాఠశాలలన్నింటికీ కనీసం వన్-స్టార్ స్థాయికి చేర్చాలని సూచించారు. 2029 నాటికి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను 4-స్టార్ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని, కనీసం పాఠశాలలను 5-స్టార్ స్థాయికి చేర్చేలా పక్కా ప్రణాళికలు రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా ఏజెన్సీ, వెనుకబడిన ప్రాంతాల్లోని పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 "లీప్ స్కూళ్లను" అభివృద్ధి చేసేందుకు అవసరమైన కార్యాచరణ సిద్ధం చేయాలని కోరారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1,685 వన్-స్టార్.. 15,618 టూ-స్టార్.. 19,099 త్రీ-స్టార్.. 7,172 ఫోర్-స్టార్ పాఠశాలలు ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పురోగతిపై డీఈవోలు, ఎంఈవోలు, సీఆర్‌పీలకు బాధ్యతలు అప్పగించాలని లోకేశ్ సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 7 వేల హైస్కూళ్లలో పూర్తిస్థాయిలో కంప్యూటర్ ల్యాబ్, అటల్ టింకరింగ్ ల్యాబ్ ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అకడమిక్ సంస్కరణలు పూర్తయినందున, ఇకపై అధికారులు, ఉపాధ్యాయులు పూర్తిగా అభ్యసన ఫలితాల మెరుగుదలపైనే దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.

### నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట

విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందించేందుకు కేంద్ర ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) ద్వారా ఈ ఏడాది 5 లక్షల మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించారు. ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్, నేషనల్ అప్రెంటిస్‌షిప్ స్కీములను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. నిరుద్యోగ యువతను "నైపుణ్యం పోర్టల్" పరిధిలోకి తీసుకువచ్చి, ఏఐ సాంకేతికత ద్వారా వారికి ఇంటర్వ్యూలు నిర్వహించాలన్నారు. సీడాప్, ఓంక్యాప్ ల ద్వారా జర్మన్, జపనీస్ వంటి విదేశీ భాషల్లో శిక్షణనిచ్చి, విదేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జీ. శ్యామలరావు, ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ రంజిత్ బాషా, రాష్ట్ర విద్యా మౌలిక సదుపాయాల సంస్థ ఎండీ దీవాన్ రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ సీఈవో నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

# రాయలసీమ పౌరుషమంటే గొడ్డలి పోట్లు కాదు.. అభివృద్ధి

అమరావతి: “యుద్ధం వచ్చినప్పుడు, హద్దులు దాటినప్పుడు నా గొంతు ఎలా ఉంటుందో మీకు తెలుసు. కానీ ఇది శాంతి సమయం. ప్రజలకు అభివృద్ధి చేయాల్సిన సమయం. అందుకే రాయలసీమ పౌరుషానికి తగిన స్పీచ్ మాట్లాడట్లేదు. రాయలసీమ అభివృద్ధికి అవసరమైన విధంగా మాట్లాడుతున్నా. గొడవలు, కొట్లాటలు, గొడ్డలి పోట్లు కాకుండా అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్దాం” అంటూ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాయలసీమ పౌరుషాన్ని ప్రస్తావిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గొడవలకు, పౌరుషానికి ప్రతీకగా నిలిచిన ఈ నేల రూపురేఖలను అభివృద్ధి పథంలో మార్చాలని ఆయన పిలుపునిచ్చారు. కడప జిల్లా ప్రొద్దుటూరులో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి రూ.30,156 కోట్ల విలువైన ‘అమరజీవి జలధార’ పథకానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పవన్ కల్యాణ్ తనదైన శైలిలో ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు పేరు మీద ఈ బృహత్తర తాగునీటి పథకాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందని పవన్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3.27 కోట్ల మంది ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించే లక్ష్యంతో 24,601 ఆవాసాల్లో 50,315 పనులను ఈ పథకం కింద చేపట్టనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. “ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన ‘హర్ ఘర్ జల్ – జలజీవన్ మిషన్’కు 2019–24 మధ్య అధికారంలో ఉన్న ప్రభుత్వం తూట్లు పొడిచింది. రూ.26,000 కోట్ల విలువైన పనులకు ప్రతిపాదనలు పంపి, ఐదేళ్లలో కేవలం రూ.2,700 కోట్లు మాత్రమే ఖర్చు చేసి ఏ ఒక్క ప్రాజెక్టునూ పూర్తి చేయలేదు. ప్రజల తాగునీటి కష్టాలను ఏమాత్రం పట్టించుకోలేదు” అని దుయ్యబట్టారు. 2024లో ఈ పథకం ముగిసిపోవాల్సిన తరుణంలో, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తాను, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలిసి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు సి.ఆర్. పాటిల్, నిర్మలా సీతారామన్‌లను కలిసి విజ్ఞప్తి చేశామని గుర్తుచేశారు. వారి సహకారంతో ఈ పథకాన్ని 2028 వరకు పొడిగించుకుని, పనులను వేగవంతం చేశామని తెలిపారు. “గత ప్రభుత్వం ఖర్చు చేయగా మిగిలిన పనులతో పాటు, ఇప్పటికే మేము రూ.4,500 కోట్ల విలువైన పనులను పూర్తి చేశాం. మీరు మాపై ఉంచిన నమ్మకమే మాకు శ్రీరామరక్ష” అని పవన్ పేర్కొన్నారు. తమది కక్షసాధింపుల ప్రభుత్వం కాదని, ప్రజాభివృద్ధిని మాత్రమే లక్ష్యంగా పెట్టుకుందని పవన్ స్పష్టం చేశారు. “దశాబ్దాలుగా తాగునీటి సమస్యతో అల్లాడుతున్న పులివెందుల నియోజకవర్గంలో అసంపూర్తిగా నిలిచిపోయిన పథకాలకు రూ.280 కోట్లు కేటాయించి 7 మండలాల్లోని 299 గ్రామాలకు నీరందిస్తున్నాం. అలాగే, వైసీపీ ఎంపీ ఉన్నప్పటికీ అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకు, పాడేరు నియోజకవర్గాల్లో రూ.2,500 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం. మాకు పార్టీలు కాదు, ప్రజల సమస్యలే ముఖ్యం” అని ఉద్ఘాటించారు. గత ప్రభుత్వ హయాంలో తమ పార్టీకి మద్దతిచ్చారనే కారణంతో ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని తాళ్లమాపురం గ్రామ ప్రజలను నాటి శాసనసభ్యుడు తీవ్రంగా అవమానించారని, వారి వినతిపత్రాన్ని కళ్లెదుటే నలిపి పడేశారని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ గ్రామాల అభివృద్ధి కోసం తక్షణమే రూ.3.5 కోట్లతో సీసీ రోడ్లు, తాగునీటి పథకాలను మంజూరు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి సమక్షంలో ప్రకటించారు. రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా మౌలిక వసతులను కల్పిస్తున్నామని గణాంకాలతో వివరించారు. “రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి 2024 వరకు నిర్మించిన వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్లు, రిజర్వాయర్ల సామర్థ్యానికి అదనంగా 50 శాతం నుంచి 175 శాతం వరకు కేవలం ఈ ఐదేళ్లలోనే నిర్మించబోతున్నాం” అని తెలిపారు. నీటిని అందించడం ప్రభుత్వ బాధ్యత అయితే, దాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, మంత్రులు, ఎమ్మెల్యేలు, పాల్గొన్నారు.

## కేబీఆర్ పార్క్ చుట్టూ ఇక శాశ్వతంగా వన్‌వే

హైదరాబాద్: హైదరాబాద్ నగరంలోని కేబీఆర్ పార్క్ చుట్టూ ప్రస్తుతం ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న వన్-వే ట్రాఫిక్ విధానాన్ని శాశ్వతం చేయనున్నట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ సోమవారం ప్రకటించారు. దీనితో పాటు, ఈ ప్రాంతంలో గతంలో ప్రతిపాదించిన హెచ్-సిటీ ఇన్‌ఫ్రా పనుల్లో కొన్నింటిని రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ నిర్ణయం ద్వారా సుమారు రూ. 400 కోట్ల మేర ప్రజాధనం ఆదా కానుంది. సోమవారం కేబీఆర్ పార్క్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ మార్గాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించిన అనంతరం కమిషనర్ మీడియాతో మాట్లాడారు. వన్-వే విధానం, ఫ్రీ-లెఫ్ట్ టర్న్‌ల ఏర్పాటు వల్ల ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గి, వాహనాల రాకపోకలు మెరుగుపడ్డాయని ఆయన తెలిపారు. సవరించిన ప్రణాళిక ప్రకారం, నాగార్జున సర్కిల్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు ఆరు వరుసల స్టీల్ బ్రిడ్జి (ఫ్లైఓవర్) నిర్మిస్తామని, దీనిని ఏడాది కాలంలోనే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. అలాగే కేబీఆర్ పార్క్ సమీపంలో ఒక అండర్‌పాస్?ను కూడా నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. గతంలో హెచ్-సిటీ ప్రాజెక్టు కింద రూ. 1,090 కోట్ల అంచనా వ్యయంతో కేబీఆర్ పార్క్ చుట్టూ పలు ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మాణాన్ని ప్రతిపాదించారు. అయితే, ప్రస్తుతం అమలు చేస్తున్న వన్-వే విధానం విజయవంతం కావడం, కోర్టు కేసుల వంటి పరిణామాల నేపథ్యంలో అధికారులు ఈ ప్రణాళికలను పునఃసమీక్షించారు. ట్రాఫిక్ సమస్యను నివారించేందుకు అత్యవసరమైన చోట మాత్రమే ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మించాలని నిర్ణయించారు. ఈ మార్పుల ద్వారా నగరంలోని అత్యంత రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం లభించడమే కాకుండా, పెద్ద ఎత్తున ప్రజాధనం ఆదా అవుతుందని అధికారులు భావిస్తున్నారు.

## భారత్-అమెరికా వాణిజ్య చర్చలపై నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు

ఢిల్లీ: భారత్, అమెరికాల మధ్య కొంతకాలంగా కొనసాగుతున్న వాణిజ్య ఒప్పంద చర్చలు దాదాపుగా తుది దశకు చేరుకున్నప్పటికీ, ప్రస్తుతం అవి ప్రతిష్టంభనలో ఉన్నట్లు కనిపిస్తున్నాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య వాణిజ్యం ప్రస్తుతం భారత్‌కు అనుకూలంగా ఉండటంతో, ఆ లోటును తగ్గించుకోవడానికి అమెరికా తీవ్రంగా ప్రయత్నిస్తోందని ఆమె వెల్లడించారు. సోమవారం ఢిల్లీలో నిర్వహించిన ‘మ్యూనిచ్ లీడర్స్ మీటింగ్ 2026’లో ఆమె మాట్లాడారు. “వాణిజ్య ఒప్పందం కోసం ఇరు దేశాలు పట్టుదలగా చర్చలు జరిపాయి. ప్రస్తుతం ఇచ్చిపుచ్చుకునే ధోరణికి అతీతంగా చర్చలను ముందుకు తీసుకెళ్లడం కష్టతరంగా మారింది” అని ఆమె అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ, ఈ చర్చలను మరింత ముందుకు తీసుకెళ్లే అవకాశాలను ఇరుపక్షాలు అన్వేషించవచ్చని సూచించారు. భారత్‌తో వాణిజ్యం వల్ల తమకు ఏళ్లుగా నష్టం జరుగుతోందన్న అమెరికా ఆందోళన ఈ చర్చల్లో స్పష్టంగా ప్రతిబింబిస్తోందని ఆమె తెలిపారు. ఫిబ్రవరి 2026లో ప్రకటించిన మధ్యంతర వాణిజ్య ఒప్పంద ముసాయిదా ప్రాతిపదికన ఈ చర్చలు కొనసాగుతున్నాయి. ఇదే క్రమంలో భారత్-యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందాన్ని ఆమె ఒక విజయవంతమైన ఉదాహరణగా పేర్కొన్నారు. యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ అభివర్ణించినట్లుగా ఇది ‘తల్లి లాంటి ఒప్పందం’ అని ఆమె కొనియాడారు. ఈ ఒప్పందంలో భాగంగా భారత్ 92.5 శాతం టారిఫ్ లైన్లను, 97 శాతం వాణిజ్య విలువను అందుబాటులోకి తెస్తే, ఈయూ తన వైపు నుంచి 97 శాతం టారిఫ్ లైన్లను, 99 శాతం వాణిజ్య విలువను విముక్తం చేసిందని ఆమె వివరించారు.

## భూమిపై భారీ ఉల్కాపాతం.. వయసు లెక్కింపులో 10 కోట్ల సంవత్సరాలు తక్కువగా నిర్ధారణ

ఢిల్లీ: అమెరికాలోని ఓక్లహోమాలో ఉన్న ఏమ్స్ ఉల్కాపాతం క్రేటర్ (బిలం) వయసును శాస్త్రవేత్తలు సవరించారు. గతంలో భావించినట్లుగా ఇది 46.7 కోట్ల ఏళ్ల క్రితం కాకుండా, సుమారు 37 కోట్ల ఏళ్ల క్రితం ఏర్పడిందని టెక్సాస్ విశ్వవిద్యాలయం పరిశోధకులు తేల్చారు. అంటే, ఇప్పటివరకు ఉన్న అంచనా కంటే దీని వయసు దాదాపు 10 కోట్ల సంవత్సరాలు తక్కువ. ఈ కొత్త ఆవిష్కరణతో, భూమిపై భారీస్థాయిలో జీవరాశులు అంతరించిన కాలానికి ఈ ఉల్కాపాత సంఘటన దగ్గరగా జరిగినట్లు తెలుస్తోంది. ఓక్లహోమాలోని ఏమ్స్ పట్టణం కింద కొన్ని మైళ్ల వెడల్పున ఈ బిలం విస్తరించి ఉంది. దశాబ్దాలుగా ఈ బిలం ‘ఆర్డోవిషియన్ ఉల్కాపాత ఘటన’కు సంబంధించిందని భావిస్తూ వచ్చారు. ఆ బిలంలో లభించిన పురాతన జీవుల దంతాల అవశేషాల (కానోడాంట్ శిలాజాలు) ఆధారంగా గతంలో వయసును లెక్కించారు. అయితే, ఎలిజబెత్ క్యాట్లాస్ నేతృత్వంలోని పరిశోధక బృందం, ఉల్కాపాతం వల్ల కరిగిన రాళ్లలోని జిర్కాన్ స్ఫటికాలపై యురేనియం-లెడ్ డేటింగ్ పద్ధతిని ఉపయోగించి కొత్త వయసును కనుగొంది. తాజా పరిశోధన ప్రకారం, ఈ బిలం వయసు 36.97 కోట్ల సంవత్సరాలుగా నిర్ధారణ అయింది. ఉల్కాపాతం జరిగినప్పుడు, అంతకుముందే అక్కడ ఉన్న శిలల్లోని పాత శిలాజాలు బిలంలో కలిసిపోయాయని, అందుకే పాత అంచనాలు తప్పుగా వచ్చాయని శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు. ఈ కొత్త కాలక్రమం ప్రకారం, ఈ ఉల్కాపాతం సుమారు 37.2 కోట్ల ఏళ్ల క్రితం సముద్ర జీవరాశిని నాశనం చేసిన భారీ వినాశనానికి దగ్గరగా జరిగింది. ఈ ఉల్కాపాతమే ఆ జీవరాశుల వినాశనానికి కారణమని కచ్చితంగా చెప్పలేనప్పటికీ, ఆ విపత్కర కాలంలోనే ఇది జరగడం కీలక పరిణామమని పరిశోధకులు అంటున్నారు. నమూనాలు పరిమితంగా ఉన్నందున, మరిన్ని పరిశోధనలు చేస్తే ఈ అంచనాలు మరింత బలపడతాయని వారు పేర్కొన్నారు. ఈ కొత్త ఆవిష్కరణ ఉత్తర అమెరికాలో పురాతన ఉల్కాపాతాల విస్తరణపై అవగాహనను కూడా మార్చనుంది.

## గత ప్రభుత్వ విధ్వంసానికి పల్లెలు కన్నీళ్లు పెట్టుకున్నాయి.. సీఎం చంద్రబాబు

ప్రొద్దుటూరు: గోదావరి, కృష్ణా నదులను అనుసంధానం చేసి జలహారతి ఇచ్చే బాధ్యత తమదని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. గోదావరి పుష్కరాల కంటే ముందే పోలవరాన్ని పూర్తిచేస్తామని.. ప్రధాని మోదీతో ఆ ప్రాజెక్టును ప్రారంభిస్తామని చెప్పారు. వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరులో ‘జల జీవన్ మిషన్ 2.0- అమరజీవి జలధార’ పథకానికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తో కలిసి సీఎం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా పైలాన్‌ను ఆవిష్కరించారు. అనంతరం చంద్రబాబు, పవన్‌కల్యాణ్ మాట్లాడారు.

గోదావరి-కావేరి అనుసంధానమైతే రాయలసీమకు నీటి సమస్య ఉండదు

“గోదావరి-కావేరి నదుల అనుసంధానం నా కోరిక. కరవు పరిస్థితుల్లో 200 టీఎంసీలు సముద్రంలోకి పోయాయి. గోదావరి-కావేరి అనుసంధానమైతే రాయలసీమకు నీటి సమస్య ఉండదు. రానున్న రెండేళ్లలో రూ.30వేల కోట్లు ఖర్చు చేసి 90 లక్షల కుటుంబాలకు తాగునీరు ఇస్తాం. గత ప్రభుత్వ విధ్వంసానికి పల్లెలు కన్నీళ్లు పెట్టుకున్నాయి. వైకాపా హయాంలో రోడ్లు గుంతలమయం అయ్యాయి. పాలనలో పవన్‌కల్యాణ్ తనదైన ముద్ర వేస్తున్నారు. కరవు పరిస్థితులు వచ్చినా ఎదుర్కొనేందుకు ప్రణాళికలు రచించాం. రాయలసీమ దశ, దిశ మార్చిన ప్రభుత్వం ఎన్డీయే. ఈ ప్రాంతానికి రెండేళ్లలో రూ.24వేల కోట్లు ఖర్చు చేశాం. వైకాపా హయాంలో రాయలసీమకు కేవలం రూ.2,500 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు.

### అంతిమ లబ్ధిదారుడు ఎవరో తెలిసిపోయింది

వివేకా హత్య కేసులో వాస్తవాలు బయటకు వచ్చాయి. అంతిమ లబ్ధిదారుడు ఎవరో తెలిసిపోయింది. వివేకా హత్యపై జగన్ సమాధానం చెప్పాలి. మద్యం కుంభకోణంలోనూ అన్ని వేళ్లూ ఆయన వైపే చూపిస్తున్నాయి. వైకాపా హయాంలో జరిగిన గ్రూప్-1 అక్రమాలపై జగన్ సమాధానం చెప్పాలి. ఉచిత ఇసుక ప్రజల హక్కు.. అక్రమాలు జరిగితే ఎవరినీ వదిలిపెట్టం” అని చంద్రబాబు హెచ్చరించారు.

కేంద్రం సహకారంతో మునుపెన్నడూ లేనివిధంగా అభివృద్ధి: పవన్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జల్ జీవన్ మిషన్ (జేజేఎం) పథకాన్ని మళ్లీ పొడిగించుకున్నామని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తెలిపారు. ఆగిపోయిన కార్యక్రమాన్ని కేంద్ర పెద్దలను సంప్రదించి మళ్లీ పనులు చేసుకుంటున్నామని చెప్పారు. వైకాపా హయాంలో రూ.2700 కోట్లే ఖర్చు చేసి ఏ ప్రాజెక్టూ పూర్తిచేయలేదని ఆయన విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో మునుపెన్నడూ లేనివిధంగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. నీటి కొరత లేని ఉమ్మడి గోదావరిలోనూ రూ.6వేలకోట్లతో జేజేఎం పనులు చేపడతున్నామని వివరించారు. తాగునీటి పథకాల్లో ఫిల్టర్ బెడ్ నిర్వహణ చాలా కీలకమన్నారు. వైకాపా హయాంలో నీటి నిర్వహణ సక్రమంగా జరగక చాలా ఫిల్టర్ బెడ్‌లు దెబ్బతిన్నాయని పవన్ చెప్పారు.

## మహిళలపై నేరాలను అరికట్టండి.. దుండగులకు వణుకు పుట్టాలి: సుప్రీంకోర్టు

ఢిల్లీ: మహిళలపై నేరాలకు పాల్పడే సామాజిక వ్యతిరేక శక్తుల మనసుల్లో భయాన్ని సృష్టించాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నేరం జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే, నేరాలు జరగకుండా నివారించడమే అత్యంత ముఖ్యమని ఢిల్లీ పోలీసులకు హితవు పలికింది. ఇటీవల ఢిల్లీ-జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్)లో వరుసగా చోటుచేసుకున్న అత్యాచార ఘటనలపై సుమోటోగా విచారణ చేపట్టిన ధర్మాసనం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా పోలీసుల పనితీరుపై పలు సూచనలు చేసింది. విచారణ సందర్భంగా జస్టిస్ పార్థీవాలా మాట్లాడుతూ.. “మహిళలపై దాడులకు పాల్పడాలనుకునే దుండగులకు తాము పట్టుబడితే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందనే భయం ఉండాలి. అలాంటి వాతావరణాన్ని మీరు కల్పించాలి” అని పోలీసులను ఆదేశించారు. నేరాలను అరికట్టేందుకు నివారణ చర్యలను మరింత బలోపేతం చేయాలని ఈ సందర్భంగా న్యాయస్థానం నొక్కి చెప్పింది. ఢిల్లీలో మహిళల భద్రతకు సంబంధించి పలు నిర్దిష్ట ఆదేశాలను ధర్మాసనం జారీ చేసింది. సమస్యాత్మక ప్రాంతాల్లో బీట్ పెట్రోలింగ్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని, వెలుతురు సరిగా లేని ప్రదేశాలను గుర్తించి వెంటనే లైటింగ్ సౌకర్యం మెరుగుపరచాలని సూచించింది. అలాగే, నిఘా వ్యవస్థలను పటిష్ఠం చేయాలని తెలిపింది. దుండగులు, పోకిరీలు ఎక్కువగా గుమికూడే అక్రమ తినుబండారాల కేంద్రాలు, మద్యం దుకాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ముఖ్యంగా విద్యాసంస్థల సమీపంలో అమ్మాయిలను వేధించే వారిపై ఉక్కుపాదం మోపాలని స్పష్టం చేసింది. దేశ రాజధాని పరిధిలో మైనర్లపై జరిగిన లైంగిక దాడులతో సహా వరుస అత్యాచార ఘటనల నేపథ్యంలో సుప్రీంకోర్టు ఈ కేసును సుమోటోగా విచారణకు స్వీకరించింది. గతంలో కూడా కోర్టు మహిళల భద్రతపై ఆడిట్ నిర్వహించాలని, ఇతర తాత్కాలిక చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. తాజా విచారణలో తీసుకున్న చర్యలపై పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని ఢిల్లీ పోలీసులను ధర్మాసనం ఆదేశించింది.

## రామప్ప సమీపంలో ఓపెన్‌కాస్ట్.. ఆపకుంటే ఉద్యమమే

ములుగు: ప్రఖ్యాత దేవాలయం రామప్పకు సమీపంలో ఓపెన్ కాస్ట్ గని ఏర్పాటు చేయడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయం పరిసరాల్లో బొగ్గుగని ప్రతిపాదన వెంటనే వెనక్కు తీసుకోవాలన్నారు. లేకపోతే రామప్ప వారసత్వ సంపదకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందన్నారు. ఒకవేళ ప్రభుత్వం ఈ మాటలు పట్టించుకోకుండా ఆలయానికి హాని చేసే ప్రయత్నాలు చేస్తే పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని కేటీఆర్ ప్రభుత్వానికి హెచ్చరికలు జారీ చేశారు. కాగా ములుగు జిల్లా, వెంకటాపూర్ గ్రామ పరిధిలో ఓపెన్ కాస్ట్‌ఏర్పాటు చేయడానికి సింగరేణి సంస్థ ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ గని ద్వారా దాదాపు 300 మీటర్ల లోతు వరకు తవ్వకాలు జరపాలని నిర్ణయించారు. దీనివల్ల రామప్ప దేవాలయం ప్రత్యేకమైన ‘శాండ్‌బాక్స్’ (ఇసుక) ఫౌండేషన్‌కు, రామప్ప చెరువు నీటి నిల్వలకు తీవ్ర ముప్పు వాటిల్లుతుందని నిపుణులు, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. సుమారు 5 కిలోమీటర్ల దిగువన ఉండే ఈ మైనింగ్ కారణంగా భూగర్భ జలాల ప్రవాహం మారి, చెరువు నుంచి నీరు కారే ప్రమాదం ఉందని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నివేదికలు హెచ్చరించాయి. ఈ ప్రాజెక్ట్‌ను నిలిపివేయాలని కోరుతూ కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ సభ్యులు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే స్థానిక గ్రామాల ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో దీనిపై కేటీఆర్ స్పందించారు.

## వివేకా హత్య, లిక్కర్ స్కామ్‌పై సమాధానం చెప్పే ధైర్యం ఉందా?: చంద్రబాబు

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి, ముఖ్యంగా రాయలసీమ దశ, దిశ మార్చడమే లక్ష్యంగా ఎన్డీఏ ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. ప్రొద్దుటూరులో జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర గ్రామీణాభివృద్ధికి ఇక్కడి నుంచే పొద్దుపొడుపు అవుతుందని అన్నారు. ఈ సభ వేదికగా రూ.30,156 కోట్ల భారీ బడ్జెట్‌తో ప్రతిష్ఠాత్మక ‘అమరజీవి జలధార’ (జల్ జీవన్ మిషన్ 2.0) పథకానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి శ్రీకారం చుట్టారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని 90 లక్షల కుటుంబాలకు ఇంటింటికీ కుళాయి ద్వారా సురక్షితమైన తాగునీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తూ, పలు కీలక అంశాలపై ప్రతిపక్ష నేతకు సవాల్ విసిరారు.

### గొడ్డలి పార్టీకి సూటి ప్రశ్నలు.. ధైర్యం ఉంటే సమాధానం చెప్పాలి

ఈ క్రమంలో గత ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్వరంతో విరుచుకుపడ్డారు. “ఈ కడప గడ్డ, ప్రొద్దుటూరు నుంచే సవాల్ విసురుతున్నా. వివేకానంద రెడ్డి హత్య కేసులో వాస్తవాలు బయటకు వచ్చాయి. అంతిమ లబ్ధిదారు ఎవరో తేలిపోయింది. రూ.40 కోట్ల సుపారీ గుట్టు విప్పింది. దీనిపై సమాధానం చెప్పే ధైర్యం ఉందా? లిక్కర్ స్కామ్‌లో వేల కోట్లు దోచిన అంతిమ లబ్ధిదారు కూడా నువ్వేనని అన్ని వేళ్లూ నీ వైపే చూపిస్తున్నాయి. సమాధానం చెప్పగలవా?” అని నిలదీశారు. “ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షల్లో అక్రమాలు చేసి యువత జీవితాలతో ఆడుకున్నారు. ఇసుకను దోచుకున్నారు. మేము అధికారంలోకి వచ్చాక ఉచిత ఇసుక విధానం తెచ్చాం. మద్యం ధరల విషయంలోనూ పారదర్శకంగా ఉన్నాం. కానీ, వాళ్లు నేరాలు చేసి, ఆ నెపాన్ని ఎదుటివారిపై రుద్దడమే పనిగా పెట్టుకున్నారు. అదే వారి డీఎన్ఏ. వారికి అభివృద్ధి సిద్ధాంతం కాదు, కుట్రలు, హింసా రాజకీయాలే వారి సిద్ధాంతం” అని దుయ్యబట్టారు.

రాయలసీమ దశ మార్చేస్తాం.. రత్నాల సీమగా తీర్చిదిద్దుతాం

రాయలసీమ అభివృద్ధిపై తనకున్న దార్శనికతను వివరిస్తూ, “ఒకప్పుడు కరువు సీమ, రాళ్ల సీమగా పిలిచిన ఈ ప్రాంతాన్ని రత్నాల సీమగా, దేశంలోనే అగ్రగామిగా నిలబెడతాం. మదనపల్లెలో లక్ష కోట్ల రూపాయలతో ప్రపంచానికి ఒక హార్టికల్చర్ హబ్‌గా తయారు చేసే కార్యక్రమానికి ఇప్పటికే శ్రీకారం చుట్టాం. రెండేళ్లలో రూ.24,000 కోట్లు ఖర్చు చేశాం. గొడ్డలి పార్టీ ఐదేళ్లలో ఖర్చు చేసింది కేవలం రూ.2,500 కోట్లు మాత్రమే. తేడా మీరే గమనించండి” అని అన్నారు.

“రాయలసీమలో కేవలం హార్టికల్చర్ మాత్రమే కాదు, రాబోయే రెండేళ్లలో నెలకు రెండు శాటిలైట్లను ఇక్కడి నుంచే ప్రయోగించేలా స్పేస్ టెక్నాలజీ, పుట్టపర్తి నుంచి శత్రుదేశాల గుండెల్లో వణుకు పుట్టించే ఐదో తరం ఫైటర్ జెట్‌లను తయారు చేసే ఏరోస్పేస్, డ్రోన్ సిటీ, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, స్టీల్, సిమెంట్, గ్రీన్ ఎనర్జీ వంటి ఎన్నో పరిశ్రమలు రానున్నాయి. ఒకప్పుడు స్వర్ణగిరిగా పిలిపించుకున్న జొన్నగిరిలో మళ్లీ బంగారు గనులు వచ్చాయి. రాయలసీమ సత్తా ఇది. కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక కేంద్రాలుగా అభివృద్ధి చెందుతాయి. బుల్లెట్ రైళ్లు, రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ తయారీ పరిశ్రమ కూడా ఇక్కడికే వస్తుంది. ఈ ప్రాంత యువత బుల్లెట్‌లా దూసుకుపోవాలి” అని చంద్రబాబు పిలుపునిచ్చారు.

పవన్ కల్యాణ్ నాయకత్వంలో పల్లెల ప్రగతి

కూటమి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పనితీరును చంద్రబాబు ప్రశంసించారు. “నా మిత్రుడు పవన్ కల్యాణ్ గ్రామీణాభివృద్ధికి కొత్త రూటు వేశారు. మరెక్కడా లేని విధంగా పవన్ కల్యాణ్ రికార్డు స్థాయిలో ఒకేరోజు 13,326 గ్రామాల్లో గ్రామసభలు పెట్టించారు. ఆయన నాయకత్వంలో రెండున్నర దశాబ్దాల తర్వాత 10 వేల మందికి పైగా ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాం. పంచాయతీలకు రూ.4,136 కోట్ల నిధులు విడుదల చేయించాం. లక్షకు పైగా పంట కుంటలు, గోకులాలు ఏర్పాటు చేశారు. ఆయన నేతృత్వంలో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కోసం ఐదేళ్లలో రూ.1.30 లక్షల కోట్లు ఖర్చు చేయబోతున్నాం” అని ప్రకటించారు.

## సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ కవిత ఆందోళన

హైదరాబాద్, అక్టోబర్ 5: సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ తెలంగాణ రక్షణ సేన ఆందోళనకు దిగింది. ఈరోజు(సోమవారం) పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో.. నగరంలోని సింగరేణి భవన్ ముట్టడికి యత్నించారు. సింగరేణి లాభాల్లో కార్మికులకు 35% వాటా చెల్లించాలని, మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న కార్మికులందరినీ అన్ ఫిట్ చేయాలని కవిత డిమాండ్ చేశారు. నెలకు 2 సార్లు మెడికల్ బోర్డు నిర్వహించాలని, మారుపేర్లు (అలియాస్ నేమ్స్) కార్మికుల సమస్య పరిష్కరించాలని పట్టుబట్టారు.

RNI NO. APBIL/2013/50718

LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy

లోకల్ గైడ్

ద్విభాషా దినపత్రిక

ఎడిటర్: అలకమర్రి రాంరెడ్డి



## ఇమ్మడి పోరాటానికి ఫలితం.. శివాలయానికి భూమి

పదేళ్లుగా శివాలయ భూమి కోసం ప్రయత్నం..

ఇరువర్గాల అంగీకారంతో వివాదానికి తెర



**కారేపల్లి, అక్టోబర్ 5 (లోకల్ గైడ్ న్యూస్):** కారేపల్లి గ్రామంలోని కాకతీయుల కాలం నాటి పాత శివాలయ భూమి విషయంలో గత పదేళ్లుగా కొనసాగుతున్న వివాదం ఇమ్మడి తిరుపతిరావు ఆధ్వర్యంలో పరిష్కారమైంది. భూ యజమానులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి శివాలయానికి భూమిని అప్పగించడంతో వివాదానికి తెరపడింది. శివాలయానికి సంబంధించిన భూమి ఆలయానికే ఉండాలన్న లక్ష్యంతో ఇమ్మడి తిరుపతిరావు గత పదేళ్లుగా నిరంతరం ప్రయత్నాలు చేస్తూ వచ్చారు. ఈ క్రమంలో ఆయనతో పాటు మరికొందరిపై ప్రైవేటు వ్యక్తులు కేసులు కూడా పెట్టారు. అయినప్పటికీ శివాలయ భూమి కోసం ఇమ్మడి తిరుపతిరావు తన ప్రయత్నాలను కొనసాగించారు. తాజాగా భూ యజమానులు దేవుడిపై తమకూ భక్తి ఉందని, శివాలయ అభివృద్ధికి సహకరిస్తామని స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. ఇమ్మడి తిరుపతిరావు ఆధ్వర్యంలో భూమిని శివాలయానికి అప్పగించారు. దీంతో పదేళ్లుగా కొనసాగుతున్న వివాదానికి పరిష్కారం లభించింది. భూమి అప్పగించిన యజమానులకు ఇమ్మడి తిరుపతిరావుతో పాటు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఇమ్మడి తిరుపతిరావు మాట్లాడుతూ కాకతీయుల కాలం నాటి ఈ పురాతన శివాలయాన్ని పునర్నిర్మించి, గుడికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని తెలిపారు.

## నాయకపోడ్ సేవా సంఘం జిల్లా కమిటీ ఏకగ్రీవ ఎన్నిక




**పాల్వంచ, లోకల్ గైడ్ న్యూస్ :** నాయకపోడ్ సేవా సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో జిల్లా కమిటీ ఎన్నికలను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కమిటీ అధ్యక్షులు మేసినేని రాజయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ గాండ్ల రామచందర్, ప్రధాన కార్యదర్శి పోతిల్లా శంకర్, ఉపాధ్యక్షులు తంబళ్ల రవి, ముఖ్య సలహాదారు జగ్గ పుల్లయ్య, సంయుక్త కార్యదర్శి పున్నం రామకృష్ణ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షులుగా పాశం వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా పిట్టల లక్ష్మణరావు, ఉపాధ్యక్షులుగా పాలెం సత్యనారాయణ, కాపుల నాగరాజు, సహాయ కార్యదర్శిగా ముప్పిడి రమేష్, కార్యవర్గ సభ్యుడిగా కుర్ల రాము ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన జిల్లా కమిటీ సభ్యులకు రాష్ట్ర నాయకులు, సంఘ ప్రతినిధులు, సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. నాయకపోడ్ సమాజ అభివృద్ధి, సంక్షేమం కోసం నూతన కమిటీ సమిష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చర్ల మండల కమిటీ సభ్యులు, నాయకపోడ్ సేవా సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ రఘునందన్‌రావుకు ఎస్ఎల్ఎన్ గ్రూప్ అవార్డు



**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 04 (లోకల్ గైడ్ ప్రతినిధి) :** తూప్రాన్‌లోని ఎస్ఎల్ఎన్ ఊర్జా ఇండస్ట్రియల్ పార్క్లో అమూల్ మిల్క్ కంపెనీ భూమిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శ్రీ కిషన్‌రెడ్డి, ఎంపీ శ్రీ రఘునందన్‌రావును ఎస్ఎల్ఎన్ గ్రూప్ తరపున ప్రత్యేక అవార్డులతో సత్కరించారు. పరిశ్రమల స్థాపన, పారిశ్రామిక అభివృద్ధికి సంబంధించిన కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన భూమిపూజ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఎల్ఎన్ గ్రూప్ ప్రతినిధులు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ రఘునందన్‌రావుకు అవార్డులు అందజేశారు. తూప్రాన్ ప్రాంతంలో పారిశ్రామిక కార్యకలాపాలకు ఊతమిచ్చే విధంగా ఎస్ఎల్ఎన్ ఊర్జా ఇండస్ట్రియల్ పార్క్ అభివృద్ధి చెందుతోందని ఎస్ఎల్ఎన్ గ్రూప్ ఆఫ్ చైర్మన్ కిరణ్ మై, మేనేజింగ్ డైరెక్టర్ జాలిగం రాకేష్ తెలిపారు. పారిశ్రామిక సంస్థల ఏర్పాటుతో స్థానికంగా ఉపాధి అవకాశాలు, ఆర్థిక కార్యకలాపాలు పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీమ్ ఎస్ఎల్ఎన్ గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

## రాజోలులో 30 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై 1995-96 పదవ తరగతి పూర్వ విద్యార్థులు - ఘనంగా ఆత్మీయ సమ్మేళనం





**లోకల్ గైడ్ అక్టోబర్ 05 మహబూబాబాద్ ప్రతినిధి దిలీప్ యాదవ్ :** మహబూబాబాద్ జిల్లా కురవి మండలం రాజోలు గ్రామంలో మూడు దశాబ్దాల నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్న పూర్వ విద్యార్థులు - కుటుంబ సమేతంగా హాజరు కురుమ ఉమాదేవి వెంకటేశ్వర్లు విద్యార్థి విద్యార్థులకు తన తోటి సహోదరులకు విద్యార్థి విద్యార్థులకు మేము షీల్డ్ బహుమతిగా ఒక జ్ఞాపకంగా పదవ తరగతి విద్యార్థులు అందరం ఎప్పటికీ గుర్తుండేలా షీల్డ్ అందించిన కురుమ ఉమాదేవి వెంకటేశ్వర్లు తర్వాత పూర్వ విద్యార్థులు అందరూ కలిసి మొక్కను నాటి స్కూల్లో నాటడం జరిగింది రాజోలు జిల్లా పరిషత్ హైస్కూల్లో 1995-96 బ్యాచ్ ఆత్మీయ కలయిక. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం రాజోలు గ్రామంలో రాజోలు గ్రామ జిల్లా పరిషత్ హైస్కూల్లో 1995-1996 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 30 సంవత్సరాల తర్వాత మళ్లీ ఒకే వేదికపై కలుసుకున్నారు. కుటుంబ సమేతంగా, ఫ్యామిలీతో కలిసి ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం రాజోలు జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో ఏర్పాటు చేశారు. 30 ఏళ్ల క్రితం ఒకే బెంచీపై చదువుకున్న స్నేహితులు ఇప్పుడు తమ భార్యా పిల్లలతో కలిసి హాజరై సందడి చేశారు. ఒకరినొకరు పలకరించుకుంటూ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. చదువుకున్న రోజుల్లో జరిగిన సరదా సంఘటనలు, ఉపాధ్యాయులతో అనుభవాలు, బాల్య స్మృతులను గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తెలిపారు.అనంతరం పూర్వ విద్యార్థులంతా కలిసి గ్రూప్ ఫోటో దిగారు.రాజోలు జిల్లా పరిషత్ హైస్కూల్లో 1995-96 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు 30 సంవత్సరాల తర్వాత కుటుంబ సమేతంగా ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు.30 ఏళ్ల తర్వాత కలిసిన రాజోలు పూర్వ విద్యార్థులురాజోలు జిల్లా పరిషత్ హైస్కూల్లో 1995-96 లో టెన్త్ చదివిన విద్యార్థులు 30 సంవత్సరాల తర్వాత కుటుంబ సమేతంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ, గురువులను సన్మానించి ఆనందంగా గడిపారు.

## పల్లె దవాఖానాల ఏర్పాటుకు ప్రజా వానిలో పిర్యాదు.. ..

పేదల అనారోగ్యం దృష్టా మండలములో 4 మినీ దవాఖానాల కోసం పోరు..

తెలంగాణ రాజ్యాధికార పార్టీ మండల అధ్యక్షులు దర్గా వెంకటేష్....



**లోకల్ గైడ్ న్యూస్ 05 కొందుర్గ్. :** కొందుర్గు మండలంలోని పేద ప్రజల ఆరోగ్యం ,సంక్షేమం కోసం ఎనబై వేల పై చిలుకు గ్రామీణ ప్రాంత ఉమ్మడి మండల జనాభాకు అనుకూలంగా పల్లె ప్రజా ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయాలని కొందుర్గ్ ప్రజా వాణి మండల ఉన్నతాధికారులకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షులు దర్గా వెంకటేష్ విజ్ఞప్తి చేశారు ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.మండలంలోని అధిక జనాభా గల గ్రామాలైన పర్వతాపూర్,ముట్పూర్ తంగెళ్ళపల్లి,,చిన్నఉమెంత్యాల గ్రాములలో పల్లె దవాఖానలను వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. కొందుర్గు మండలంలోని ప్రజలు వివిధ కంపెనీల వలన వాయు కాలుష్యం,నీటి కాలుష్యం కారణంగా వ్యాధుల బారిన పడి తీవ్ర ఇబ్బందులకుగురవుతున్నారు. పిల్లలు మహిళలు,వృద్ధులు కొందుర్గు మండలకేంద్రానికి రాలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజల ఆరోగ్యాలను మెరుగు పరిచే విధంగా కృషిచేయాలని, రాత్రి వేళల్లో వచ్చే అత్యవసర చికిత్సలకు పట్టణాలకు వెళ్ళేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్న న్నచున్న ప్రభుత్వం వెంటనే స్పందించి పల్లే ప్రజా ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆయన మీడియాకు తెలిపారు..

## అంటారని తనాన్ని అదుపు చెయ్యండి, స్వేచ్ఛా,స్వాతంత్ర్యాల వైపు దళితులను సాగనీయండి....

బడిలో,సౌకర్యాలు ,,వారి భాగుకు ఉపాధిఅవకాశాలు చూపండి...

గ్రామపంచాయితీ వార్షిక

బడ్జెట్‌లో షెడ్యూల్డ్ కాస్ట్ దళితుల కుటుంబాలకు. ..

అంటరానితనం నిర్మూలన--ఆర్థిక అభివృద్ధి కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి..

యం, ఉదయ్ కృష్ణ...బిసి,ఎస్సీ ఎస్టీ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు కొందుర్గ్ .




**లోకల్ గైడ్ న్యూస్ 05 కొందుర్గ్ :** స్వతంత్రం వచ్చినప్పటి నుండి నేటి వరకు ఇంకా గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న అనేక మంది షెడ్యూల్డ్ కాస్ట్ దళిత కుటుంబాలు అంటరానితనం, అసమాన సమాజ్యంలో, ఆర్థికంగావెనుకబడి, విద్యా ,వైద్యం, ఉపాధి సదుపాయాలు లేకపోవడం వల్ల అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు.ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, గ్రామపంచాయతీ వార్షిక బడ్జెట్ రూపొందించే సమయంలో ఎస్సీ ఎస్టీ ,దళిత కుటుంబాల అభివృద్ధికి ప్రత్యక్షంగా ఉపయోగపడే పనులు కార్యక్రమాల కోసం ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయింపు చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కొందుర్గ్ మండల ప్రజా వాణి ఉన్నతాధికారులకు ఎస్సీ ఎస్టీ జాయింట్ యాక్షన్ కమిటీ సబ్యులు ఉదయ్ కృష్ణ ,ప్రత్యేక మెమొరాండం, అందజేశామని మీడియాకు తెలిపారు

## 2026 ఆల్ ఇండియా స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్‌లో గీతాంజలి విద్యార్థుల సత్తా







**లోకల్ గైడ్ హైదరాబాద్ :** ఆధ్వర్యంలో నిర్వహించిన 2026 ఆల్ ఇండియా స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్‌లో గీతాంజలి ది గ్లోబల్ స్కూల్, కొండాపూర్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి పాఠశాలకు, తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారు.ఈ ప్రతిష్ఠాత్మక జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో తెలంగాణ జట్లు ఖో-ఖో మరియు క్రికెట్‌లో ప్రథమ స్థానాన్ని, అలాగే బ్యాడ్మింటన్‌లో ద్వితీయ స్థానాన్ని సాధించాయి.ఈ పోటీల్లో గీతాంజలి ది గ్లోబల్ స్కూల్‌కు చెందిన జగదీశ్వర్, హేమంత్, జతిన్, రిత్విక్, శౌర్య, సాత్విక్, అనిరుధ్, రుషికేష్, అక్షర, అరుషి మరియు యోకల్య తెలంగాణ జట్లకు ప్రాతినిధ్యం వహించి జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించారు.విద్యార్థుల ఈ ఘన విజయాలు గీతాంజలి ది గ్లోబల్ స్కూల్‌కు ఎంతో గర్వకారణంగా నిలిచాయి. విద్యార్థులకు నిరంతరం శిక్షణ, మార్గదర్శకత్వం అందిస్తూ వారి ప్రతిభను జాతీయ స్థాయికి తీసుకెళ్లడంలో కోచ్‌లు మురళి మరియు శ్రీనివాస్ చేసిన కృషి అభినందనీయం.2026 సంవత్సరంలో జాతీయ స్థాయిలో విద్యార్థులు సాధించిన ఈ విజయాలు పాఠశాల క్రీడా రంగంలో మరో మైలురాయిగా నిలిచాయి. విద్యార్థులు, కోచ్‌లను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్ ద్వారా ఎస్సై, పోలీస్ కానిస్టేబుల్ ప్రిలిమ్స్ కొరకు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ.. ఉప సంచాలకులు, కార్యదర్శి తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్ జ్యోతి

**ఖమ్మం, అక్టోబర్ 05, 2026: లోకల్ గైడ్ :** రాష్ట్ర షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ నిరుద్యోగ అభ్యర్థుల నుంచి ఎస్సై, పోలీస్ కానిస్టేబుల్ ప్రిలిమ్స్ పరీక్షల కొరకు ఉచిత భోజనం, రెసిడెన్షియల్ శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ సంక్షేమ శాఖ ఉప సంచాలకులు, ఎస్సీ స్టడీ సర్కిల్ కార్యదర్శి జి. జ్యోతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్ స్టేట్ డైరెక్టర్ ఏ. నరసింహ రెడ్డి ఆదేశాల మేరకు ఈ ఉచిత శిక్షణ ఖమ్మం ఎస్సీ స్టడీ సర్కిల్ కేంద్రంలో నిర్వహించబడుతుందని అన్నారు.ఈ శిక్షణా కాలపరిమితి ఈ నెల 12 నుండి డిసెంబర్ 20 వరకు (రెండు నెలలు) కొనసాగుతుందని ఉప సంచాలకులు అన్నారు. ఎస్సై, పోలీస్ కానిస్టేబుల్ ఉచిత శిక్షణ కొరకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఎస్సై, పోలీస్ కానిస్టేబుల్ పోస్ట్ లకి దరఖాస్తు చేసిన అక్నాలెడ్జ్‌మెంట్ జిరాక్స్ తోపాటు డిగ్రీ విద్యార్హత ఒరిజినల్ సర్టిఫికేట్, అన్ని విద్యార్హతల సర్టిఫికేట్ల జిరాక్స్ ప్రతులు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, ఆధార్ కార్డు జిరాక్స్ లతో ఈ నెల 5 వ తేదీ నుంచి ఈ నెల 9 వ తేదీ సాయంత్రం 5.00 గంటల వరకు రిపోర్ట్ చేయాలన్నారు. ఇతర పూర్తి వివరాల కోసం అభ్యర్థులు 9866726277, 9032077276 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని ఉప సంచాలకులు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## హెర్నియా ఆపరేషన్ అనంతరం కోలుకుంటున్న వారిని పరామర్శించిన.ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి



**లోకల్ గైడ్ జడ్చర్ల అక్టోబర్ 5 :** జడ్చర్ల నియోజకవర్గం బాలనగర్ మండల పరిధిలోని గౌతాపూర్ గ్రామానికి చెందిన గుడి పూజారి హరి బాల నందదాసు మరియు మల్లారెడ్డి ఇటీవల హెర్నియా ఆపరేషన్ చేయించుకున్న విషయం తెలుసుకున్న జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుద్ రెడ్డి సోమవారం రోజు వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా పూజారి మరియు మల్లారెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆరోగ్యం ఎలా ఉందని, వైద్యులు సూచించిన చికిత్స మందులు సక్రమంగా తీసుకుంటున్నారా అని ఆరా తీశారు. త్వరగా పూర్తిస్థాయిలో కోలుకొని ఆరోగ్యంగా ఉండాలని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి ఆకాంక్షించారు.

## పెదగొల్లగూడెం ఏ జి హెచ్ ఎస్ విద్యార్థినులు జాతీయ అథ్లెటిక్స్ కు ఎంపిక..



**వాజేడు,లోకల్ గైడ్ ప్రతినిధి :-** ములుగు జిల్లా వాజేడు మండలం పెద్ద గొల్లగూడెం ఏ జి హెచ్ ఎస్ విద్యార్థులు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీన బండారిపల్లిలో నిర్వహించిన జిల్లా స్థాయి జూనియర్స్ అథ్లెటిక్స్ పోటీలలో విద్యార్థినులు అద్భుత ప్రతిభ కనబరిచి పలు విభాగాల్లో బహుమతులు సాధించారు. అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నవంబర్ నెలలో సంగారెడ్డిలో నిర్వహించనున్న జాతీయస్థాయి ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ పోటీలకు పాఠశాల విద్యార్థినులు అర్హత సాధించడం విశేషం. తూర్స అక్షర -- 8వ తరగతి విద్యార్థిని - ట్రయథ్లాన్ విభాగంలో ప్రథమ బహుమతి - లాంగ్ జంప్‌లో ప్రథమ బహుమతి - 400 మీటర్ల పరుగులో ప్రథమ బహుమతి బడే హర్షిని -- 9వ తరగతి విద్యార్థిని - ట్రయథ్లాన్ విభాగంలో ప్రథమ బహుమతి - లాంగ్ జంప్‌లో ద్వితీయ బహుమతిబడే హర్షిత -- 9వ తరగతి విద్యార్థిని - ట్రయథ్లాన్ విభాగంలో ద్వితీయ బహుమతి - లాంగ్ జంప్‌లో తృతీయ బహుమతి - కిడ్స్ జావెలిన్ త్రో విభాగంలో ద్వితీయ బహుమతి ఈ విజయాలతో విద్యార్థినులు నవంబర్‌లో సంగారెడ్డిలో జరిగే అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయస్థాయి ఇంటర్ డిస్ట్రిక్ట్ మీట్‌కు అర్హత సాధించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఇర్ప కేశవరావు మాట్లాడుతూ, "క్రమశిక్షణ, నిరంతర సాధన, పట్టుదలతో విద్యార్థినులు జిల్లా స్థాయిలో ప్రతిభ చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణం. రాబోయే పోటీల్లో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు.విద్యార్థినుల ఈ విజయానికి కృషి చేసిన ఫిజికల్ డైరెక్టర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు పూనెం రోజారాణి , పాయం తిరుపతమ్మ , పెండకట్ల బుచ్చిబాబు, తోలేం కృష్ణయ్య, అట్టం రామారావు, కోడె భారతి, యాలం ఉమాదేవి, అరేం సౌజన్య, మైపతి రావు సృజన,గొంది కవిత, యాలం ధనలక్ష్మి,ఇర్ప గౌతమి అలాగే ఫిజికల్ డైరెక్టర్ గుండ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ భృతి చెల్లించాలని సంతకాల సేకరణ.



**లోకల్ గైడ్ జడ్చర్ల అక్టోబర్ 5 :** జడ్చర్ల మండల కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జడ్చర్ల మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాలలో 1. ఉపాధి పనులు ప్రారంభించాలని,2. భూమిలేని నిరుపేదలకు సంవత్సరాన్ని 12.500 రూపాయలు ఇవ్వాలని,3. దళిత నిరుద్యోగులకు అంబేద్కర్ యోజన స్కీం క్రింద 12 లక్షల రూపాయలు ఇవ్వాలని, నిరుద్యోగ భృతి చెల్లించాలని అక్టోబర్ 9న జడ్చర్ల మున్సిపల్ కార్యాలయం ముందు జరగబోయే ధర్నా లో పట్టణ పేదలు అధిక సంఖ్యలో పాల్గొనాలని, సర్వే నిర్వహించడంతోపాటు సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పి జగన్, మండల కార్యదర్శి ఇ.యాదయ్య,ఉపాధ్యక్షులు బి. జయరములు,కర్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి సమక్షంలో మాజీ సర్పంచ్ లింగారెడ్డి సహా 20 మంది కాంగ్రెస్ పార్టీలో చేరిక.

పెద్ద రేవల్లిలో కాంగ్రెస్ జోరు. వివిధ పార్టీల నుంచి 20 మంది హస్తం గూటికి.



**లోకల్ గైడ్ జడ్చర్ల అక్టోబర్ 5 :** జడ్చర్ల నియోజకవర్గం బాలానగర్ మండల పరిధిలోని పెద్ద రేవల్లి గ్రామంలో రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. బిజెపికి చెందిన మాజీ సర్పంచ్ లింగారెడ్డి తో పాటు వివిధ పార్టీలకు చెందిన సుమారు 20 మంది కార్యకర్తలు సోమవారం రోజు జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుద్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాధారంగా పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి పేర్కొన్నారు. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీ సమోచిత గౌరవం కల్పిస్తుందని, రాబోయే రోజుల్లో గ్రామీణ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## పండుగ సాయన్న విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి



**లోకల్ గైడ్ జడ్చర్ల అక్టోబర్ 5 :** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని సిగ్నల్ గడ్డ వద్ద నూతనంగా ఏర్పాటు చేయనున్న వీరుడు పండుగ సాయన్న విగ్రహ ఏర్పాటుకు జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుద్ రెడ్డి సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పండుగ సాయన్న తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిపిన ధైర్య సలహాసాలకు ప్రతీక అని అన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాల కోసం పోరాడిన పండుగ సాయన్న స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. జడ్చర్ల పట్టణంలో పండుగ సాయన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ద్వారా ఆయన చరిత్ర, పోరాట స్ఫూర్తిని భావితరాలకు పరిచయం చేయడానికి అవకాశం కలుగుతుందని ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి తెలిపారు. విగ్రహ ఏర్పాటు పనులను నాణ్యతతో, సరిత గతిన పూర్తి చేయాలని సంబంధిత వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మరియు కార్యకర్తలు, పండుగ సాయన్న అభిమానులు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఘనంగా అమ్మ హాస్పిటల్ ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు శ్రీ షబ్బీర్ అలీ గారు.




**లోకల్ గైడ్ కామారెడ్డి 5ప్రతినిధి :** కామారెడ్డి జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన అమ్మ హాస్పిటల్ ని ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు శ్రీ షబ్బీర్ అలీ గారు. జిల్లా కేంద్రంలో నూతన హాస్పిటల్ ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మరియు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్, మున్సిపల్ చైర్మన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, జిల్లా గ్రంధాలయ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు సందీప్, మాజీ డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, సొసైటీ చైర్మన్లు గూడెం శ్రీనివాస్, భీంరెడ్డి, నౌసిలాల్, అనంత్ రెడ్డి, సుతారి రమేష్, అనంత్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు నౌసిలాల్, కృష్ణారావు, శ్రీనివాస్, నరేందర్ రెడ్డి, రాజగౌడ్, రాజు, ౹ాజ సెల్ జిల్లా అధ్యక్షులు బాలరాజు, ౹ా సెల్ జిల్లా అధ్యక్షులు రెడ్డి నాయక్, డీసీసీ ఉపాధ్యక్షులు గంప ప్రసాద్, కౌన్సిలర్లు షేరు, సత్యం, అంజాద్, జావీద్, లడ్డు, సిద్దిక్, చిట్టిబాబు, గణేష్, గంగాధర్, మజీద్, కో ఆప్షన్ సభ్యులు ముబషీర్, అలీ బిన్ అబ్దుల్లా, సీనియర్ నాయకులు పండ్ల రాజు, వెంకట్ రావు, సుదర్శన్, వెంకటేష్, సలీం, భాస్కర్, నవీన్, ఘాజి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy

లోకల్ గైడ్ ద్విభాషా దినపత్రిక

ఎడిటర్: చిలకమర్రి రాంరెడ్డి




## చింతల్‌మెట్ వీరభద్ర స్వామి ఆలయంలో అక్రమ నిర్మాణాలను పరిశీలించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్.

**దేవాలయ భూములను కబ్జాలు చేస్తే ఎంతటి వారైనా సరే ఉపేక్షించేది లేదు – ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్.**





**రాజేంద్రనగర్ (లోకల్ గైడ్ ):** చింతల్‌మెట్‌లోని ఆస్థాన వీరభద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను రాజేంద్రనగర్ శాసనసభ్యులు టి. ప్రకాష్ గౌడ్ పోలీసుల సమక్షంలో అధికరణతో కలిసి పరిశీలించారు. ఆలయ పరిధిలో అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో ఆయన సంబంధిత అధికారులతో (రెవెన్యూ, మున్సిపల్) కలిసి క్షేత్రస్థాయిలో పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..దేవాలయ భూములను, ఆస్తులను ఆక్రమిస్తూ అక్రమ నిర్మాణాలు చేపడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఆలయ పరిధిలో జరిగిన ఈ అక్రమ కట్టడాలపై తక్షణమే సమగ్ర విచారణ జరిపి, వాటిని నిలువరించడంతో పాటు బాధ్యులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆలయ పవిత్రతను, దేవాదాయ ఆస్తులను కాపాడటం మనందరి బాధ్యత అని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. చింతల్ మెట్ లో చారిత్రాత్మకమైనటువంటి ఈ దేవాలయ భూములను కబ్జాలు చేయడం సరైనది కాదన్నారు. అధికారులు ఈ కబ్జాలపై పూర్తి విచారణ జరిపి కబ్జాజులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. దేవాలయాల భూములను కబ్జాలు జరగకుండా కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గారితో పాటు ఆర్డీవో వెంకటరెడ్డి, జిహెచ్ఎంసి, ఇతర రెవెన్యూ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు గారు సంబంధిత ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## ఏకలవ్య పాఠశాలను రాష్ట్రస్థాయిలో నంబర్ వన్‌గా నిలపాలి

**పాఠశాల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్.**



( లోకల్ గైడ్ 5అక్టోబర్ ) : కామారెడ్డి: గాంధారి ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలను రాష్ట్రస్థాయిలో నంబర్ వన్‌గా నిలిపేందుకు సమష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో నిర్వహించిన ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల జిల్లా స్థాయి పాలక మండలి సమావేశంలో పాఠశాల ప్రగతిపై కలెక్టర్ సమీక్షించారు. పాఠశాలలోని సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.జిల్లా స్థాయి పాలక మండలి సభ్యులు వారానికి ఒకరు చొప్పున పాఠశాలను సందర్శించి, అక్కడి పరిస్థితులపై నివేదిక సమర్పించాలని సూచించారు. పాఠశాలలో చేపడుతున్న ఇంజినీరింగ్ పనులను ఈ నెలలోనే పూర్తి చేస్తామని డీఈఈ సంపత్ కుమార్ కలెక్టర్‌కు వివరించారు.తదుపరి పాలక మండలి సమావేశాన్ని జనవరిలో నిర్వహించాలని నిర్ణయించారు.ఈ సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి చందర్ నాయక్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి పి. చంద్రశేఖర్, ప్రాంతీయ సమన్వయ అధికారి గంగారాం నాయక్, జిల్లా సంక్షేమ అధికారి సౌజన్య, ప్రధానాచార్యులు శ్యామలదేవి, అమర్ సింగ్, మాధవరావు, రవీంద్ర కుమార్, సంతోష్ శుక్లా తదితరులు పాల్గొన్నారు.

## కోల్లంపల్లి లో టీబీ ఏసీఎఫ్ క్యాంపు



**నారాయణపేట అక్టోబర్ 5:** నారాయణపేట మండలం కొల్లంపల్లి గ్రామంలో సోమవారం టీబీ యాక్టివ్ కేస్ ఫైండింగ్ క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీ లక్షణాలు ఉన్న వారిని గుర్తించి, పరీక్షలు చేయించుకోవడం, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ సిద్ధప్ప వ్యాధి నివారణ చికిత్సపై ప్రజలకు అవగాహన కల్పించారు.అనంతరం ప్రోగ్రాం అధికారి డాక్టర్ సత్య ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ టీబీ మందు లను క్రమం తప్పకుండా తీసుకోవడం, పౌష్టికాహారం తీసుకోవడం చికిత్సను పూర్తిగా కొనసాగించడం వల్ల వ్యాధిని పూర్తిగా నయం చేసుకోవచ్చని అవగాహన కల్పించారు. తర్వాత టీబీ బాధితులకు ఫుడ్ బాస్కెట్ కిట్ లను పంపిణీ చేశారు.ఈ కార్య క్రమంలో సర్పంచ్ మన్నెమ్మ , ఉప సర్పంచ్ గోమాలి బజరంగ్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సత్య ప్రకాష్ రెడ్డి, డాక్టర్ లక్ష్మీకాంత్, డాక్టర్ సాయిరాం, డాక్టర్ నరసింహారావు, ఎన్సిడి కోఆర్డినేటర్ విజయ్ కుమార్,టీవీ సూపర్వైజర్లు శ్రీధర్ మరియు ప్రసాద్, దశరథ్ ల్యాబ్ టెక్నీషియన్ ఏఎన్ఎం మరియు ఆశలు వైద్య సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## కొనసాగిన లయన్స్ క్లబ్ ‘అన్న దానం’



**నారాయణపేట అక్టోబర్ 5:** మానవ సేవే మాధవ సేవ అనే లక్ష్యంతో లయ న్స్ క్లబ్ ఆఫ్ నారాయ ణపేట్ట ఆధ్వర్యంలో ఏడాది పాటు నిర్వహిస్తున్న విల్స్ అండ్ మిల్స్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న అన్నదానము కార్యక్రమ ము సోమవారం నాటికి 96 వ రోజు కు చేరుకుంది. లైన్స్ క్లబ్ అధ్యక్షులు రవి కుమార్ గౌడ్ ఆధ్వర్యం లో కొనసాగింతోంది.లయన్ వినోద్ పాటిల్ అన్నదానం స్పాన్సర్ చేశారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని స్థానిక సత్యనారాయణ చౌరస్తా లో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంబించారు.ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ అధ్యక్షుడు రవికుమార్ గౌడ్ మాట్లాడుతూ సమా జంలో అవసర మైన వారికి అండగా నిలవడం, సామా జిక బాధ్యత గా భావి స్తూ,లయన్స్ క్లబ్ ద్వారా సేవా కార్య క్రమాలు కొన సాగిస్తున్నామని తెలి పారు.ఈ కార్యక్ర మంలో లయన్స్ క్లబ్ శ్రీనివాస్ లాహోటి,కన్నా జగదీష్, పుత్పాక్ రమేష్, డాక్టర్ సచిన్ , కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఎ బి వి పి కార్యవర్గంలో పేట జిల్లాకు పెద్దపీట







**నారాయణపేట అక్టోబర్ 5:** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ పాలమూరు విభాగ్ ఆధ్వర్యంలో 3,4 తేదీల్లో వనపర్తి జిల్లాలో నిర్వహించిన విభాగ్ అభ్యాస వర్గలో నూతనంగా వివిధ జిల్లాల వారికి బాధ్యతలు ఇచ్చా రు. నేపథ్యంలో నారాయ ణపేట జిల్లాకు పెద్దపీట వేశారు.ఎస్ ఎఫ్ డి జిల్లా ఇన్చార్జి గాసందీప్ కుమార్ ,సోషల్ మీడియా జిల్లా ఇన్చార్జి గా తరుణ్ నామాజీ,ఖేలో భారత్ ఇంఛార్జి గా శరణ్ లనుపాలమూరు విభాగ్ ప్రముఖ కర్నే రామచందర్ వీరిని నియమించారు.ఈ విభాగ అభ్యాస వర్గలో రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు, విభాగ ప్రముఖ కర్ణ రామచంద్ర , విభాగ సంఘటన మంత్రి కాయం నరేంద్ర, పాలమూరు విభాగ్ కన్వీనర్ అర్జున్, పాలమూరు నగర సంఘ టన మంత్రి పృథ్వి, నారా యణపేట పూర్వ జిల్లా కన్వీనర్ నరేష్ , నారా యణపేట జిల్లా కన్వీనర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# రూ. 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల

**ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు**

**రెండున్నర ఏళ్లలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి**

**రూ.70 కోట్లు ఖర్చు చేశాం**

**గత ప్రభుత్వంలో 10 ఏళ్ళ పాఠశాలల**

**అభివృద్ధికి నోచుకోలేదు**

**రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట**

**విజయరమణ రావు**





**పెద్దపల్లి జిల్లా అక్టోబర్ 05 (లోకల్ గైడ్) :** ఎలిగేడు మండలం రాములపల్లి వద్ద రూ. 200 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులను సంబంధిత అధికారులు మరియు స్థానిక నాయకులతో కలిసి పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ కుల మత బేధాలు లేకుండా అన్ని కులాలు, అన్ని మతాలు ఒకే వేదికపై పెద్ద ఎత్తున విద్యాభ్యాసం చేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి నియోజకవర్గానికి రూ. 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలను మంజూరు చేయడం జరిగిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాను శాసనసభ్యుడిగా ఎన్నికైన తర్వాత రెండున్నర సంవత్సరాలలో పెద్దపల్లి నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి 70 కోట్లు నిధులు మంజూరు చేసి పాఠశాల భవనాలు, మరుగుదొడ్లు ప్రహరీ గోడలు నిర్మించడం జరిగిందని, గత ప్రభుత్వంలో 10 ఏళ్లు పరిపాలన చేసిన అప్పటి ఎమ్మెల్యే ప్రభుత్వ స్కూళ్లను ఏ మాత్రం పట్టించుకోకుండా తన ప్రైవేటు పాఠశాలలపైనే దృష్టి పెట్టారని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు విమర్శించారు. ఈ సందర్భంగా ఎలిగేడు మండలంలోని రామునిపల్లెలో రూ.200 కోట్లతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాలను సోమవారం రోజున స్థానిక నాయకులతో కలిసి పరిశీలించడం జరిగిందని అన్నారు. మన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేలాది కోట్ల రూపాయలు ఖర్చు చేసి ప్రభుత్వ పాఠశాలల అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్నారు. అని అన్నారు. అందులో భాగంగా రామునిపల్లెలో ఇంటర్నేషనల్ స్కూల్కు దీటుగా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం జరుగుతుందని 2560 మంది పిల్లలకు విద్య అందించడంతోపాటు హాస్టల్, ప్లే గ్రౌండ్, డైనింగ్ హాల్ నిర్మించడం జరుగుతుంది అన్నారు. ముఖ్యమంత్రి ఆలోచన మేరకు పేద పిల్లలు, మధ్యతరగతి పిల్లలు కార్పొరేటు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే వారికి టీపీఎఫ్, తెలంగాణ పబ్లిక్ స్కూల్ లలో దేశంలోని 29 రాష్ట్రాలలో ఎక్కడ లేని విధంగా సీఎం రేవంత్ రెడ్డి మన రాష్ట్రంలోనే మిడ్ డే మీల్స్ తో పాటు అల్పాహారం కూడా గత రెండు మాసాల క్రితం ప్రారంభించడం జరిగింది అన్నారు. టిఫిన్ తో పాటు మూడు రోజులు పాలు మూడు రోజులు రాగి జావా కూడా ఇవ్వడం జరుగుతుంది అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ విద్యార్థులకు హరే రామ హరే కృష్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనం కూడా ప్రారంభించడం జరిగింది అన్నారు. స్వాతంత్రం వచ్చి 80 సంవత్సరాలు అయిన ఇప్పటివరకు ఏ రాష్ట్రంలో ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు కాలేదని మన రాష్ట్రంలోనే ప్రారంభించుకోవడం జరిగింది అన్నారు. ఈ రాష్ట్రంలోని విద్యార్థులకు మంచి విద్యతో పాటు పౌష్టికారమైన ఆహారం అందించేందుకు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి వేలాది కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు అన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో నర్సరీ ఎల్ కేజీ చదివే పిల్లలకు 30 వేల నుంచి 40 వేలు సంవత్సరానికి ఖర్చు చేస్తున్నారని, ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్యను అందిస్తున్నారని ఉపాధ్యాయులు కూడా నిష్ణాతులై బీఈడీ పట్టాలు పొంది ఉంటారని, పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని పిల్లల తల్లిదండ్రులకు సూచించారు. పిల్లల తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలని, సీఎం రేవంత్ రెడ్డి పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ఉన్న పాఠశాలల అభివృద్ధికి కోట్లాది రూపాయలు నిధులు ఖర్చు చేస్తూ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నారు అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలకు విద్యా విధానంతో పాటు అన్ని సౌకర్యాలు కల్పన ధ్యేయంగా సీఎం అహర్నిశలు కృషి చేస్తున్నారు అన్నారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, వ్యవసాయ మార్కెట్ చైర్మన్, సింగిల్ విండో చైర్మన్లు, డైరెక్టర్లు, మండల పార్టీ అధ్యక్షులు, పలు గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నాడు ఉపాధిని కల్పిస్తే.. నేడు ఉపాధిని మర్చిపోయారు

**కేసీఆర్ పాలనలో పోలీస్, పంచాయతీ రాజ్, రెవెన్యూ**

**శాఖలో ఎన్నో ఉద్యోగాలు భర్తీ చేశారు**

**నిరుద్యోగులను పట్టించుకునే దిక్కులేదు**

**యువత ఆలోచించాలి,**

**పట్టభద్రులు కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరును గ్రహించాలి**

**పట్టుదలతో పార్టీ శ్రేణులు పనిచేసి బీఆర్ఎస్**

**పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిని**

**పెద్ద మెజార్టీతో గెలిపించాలి**

**ఓటర్ నమోదు పై అన్ని వర్గాల**

**పార్టీ శ్రేణులు దృష్టి సారించాలి**

**షాద్ నగర్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన**

**బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల**

**సమావేశంలో మాజీ ఎమ్మెల్యే**

**అంజయ్య యాదవ్**






**( లోకల్ గైడ్ షాద్ నగర్ ) :** కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారనే విషయం రాష్ట్ర ప్రజలకు అర్థమైందని మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ అన్నారు. సోమవారం షాద్ నగర్ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పట్టభద్రుల ఎన్నికల ఓటర్ నమోదుపై నిర్వహించిన పార్టీ శ్రేణుల అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ పాలనలో రెవెన్యూ, పంచాయతీ రాజ్, పోలీస్ శాఖలో వేల ఉద్యోగాలను భర్తీ చేశారని, రెండు లక్షల ఉద్యోగాల నోటిఫికేషన్ వేస్తామని, నిరుద్యోగ భృతి తక్షణమే అమలు చేస్తామని నిరుద్యోగుల సాక్షిగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం యువతకిచ్చిన మాట తప్పిందని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కేజీ టు పిజీ వరకు ఉచిత విద్యనుఅందించడంతోపాటు కార్పొరేట్ స్థాయి ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసిన ఘనత కేసిఆర్ కు దక్కితే, ఉన్న ప్రభుత్వ విద్యను నీరుగారిచే విధంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రవర్తిస్తుందని ఆరోపించారు. గత మూడు సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరును యువత గ్రహించాలని, పాలన తీరును ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు పార్టీ శ్రేణులు పూర్తిస్థాయిలో సిద్ధం కావాలని, నేటి నుంచే గెలుపు కోసం కృషి చేసేందుకు ఐక్యమత్యంగా నిలబడాలని కోరారు. పట్టభద్రుల ఓట్ల నమోదు ప్రక్రియలో ఉత్సాహంగా పాల్గొని, అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుని కలిసి నమోదు చేయించాలని కోరారు. ఆన్లైన్, ఆఫ్లైన్లలో నమోదు కోసం ఎలా దరఖాస్తు చేసుకోవాలి పూర్తి స్థాయి అవగాహన పెంచుకొని , ఓటు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి, రవీందర్ యాదవ్, మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబల్ నాయక్, మహిళా కోఆర్డినేటర్ రాజ్యలక్ష్మితో పాటు మాజీ మార్కెట్ చైర్మన్లు, మాజీ మున్సిపల్ చైర్మన్లు, మాజీ ఎంపీపీలు, మాజీ జడ్పీటీసీలు, మాజీ పీఏసీఎస్ చైర్మన్లు, మాజీ గ్రంథాలయ చైర్మన్లు, మాజీ వైస్ చైర్మన్లు, మాజీ వైస్ ఎంపీపీలు, బీఆర్ఎస్ మండల, గ్రామ, మున్సిపాలిటీ, వార్డు అధ్యక్షులు, ప్రస్తుత మరియు మాజీ సర్పంచులు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, మాజీ ఎంపీటీసీలు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ యువత, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల,తప్పిదం పేదల పాలిటశాపంగా మారిన వైనం..

**నిలువ నీడలేని నిరుపేదలకు అందని, సంక్షేమ**

**పథకాలు గృహ లక్ష్మీ,,గృహజ్యోతి,.ఆసరా లాంటివి...**

**ప్రజాపాలన పక్కా సమాచారం పరాయి**

**పంచాయతీలో పరిధిలో..**

**కొంత మంది ప్రజాపాలన దరఖాస్తులు పూర్తిగా**

**మాయం కావటం మరి విశేషం.**

**బైరంపల్లి గ్రామ పంచాయతీ లో10 మంది ప్రజా**

**పాలన దరఖాస్తులు షాద్ నగర్ మున్సిపాలిటీలో..**




**లోకల్ గైడ్ న్యూస్ 05 కొందుర్గ్ :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టమకంగా ప్రజా సమాచార సేకరణ గ్రామాల వారీగా సంక్షేమ పథకాల.గుర్తింపు ప్రక్రియ. ను రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడిన.కొత్తలో గ్రామ స్థాయి అధికారుల ద్వారా ప్రజల నుండి ప్రజా పాలన దరఖాస్తులను సేకరించింది. అందులో ప్రజలకు. ఇందిరమ్మ ఇళ్లు రేషన్ కార్డ్స్ గృహ. లక్ష్మీ గృహజ్యోతి లాంటి సంక్షేమ పథకాలను సేకరించి ,అట్టి సమాచారాన్ని డేటా ఎంట్రీ ఆపరేటర్ల ద్వారా.,మండల మండల కేంద్రాలలో నమోదుచేసింది, కానీ గ్రామాల్లో ప్రజా పాలన పక్కా సమాచారం సరిగ్గా నమోదు అవుతుందో లేదో అని మాత్రం ప్రత్యేక పర్యవేక్షణ అధికారి, సరిచుకోలేక పోయారు.. అయితే పూర్తి వివరాలకి వెళ్ళితే రంగారెడ్డి జిల్లా కొందుర్గ్ మండల లోని బైరశీపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో చింతకింది చంద్రకళ ,చింతకింది శివమ్మ,,చాకలి రాములమ్మ,,బోడ లక్ష్మమ్మ,గుడిసె జయమ్మ..,మహమ్మద్ ఆసియా బేగం.పెద్దింటి అనసూజ ఇంకా, మరింత మంది సంక్షేమ పథకాలు కోల్పోతోన్నారు.గతంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శి ,ప్రజా పాలన డేటా ఎంట్రీ రిజిస్టర్ లో. పూర్తి వివరాలు నమోదు చేశామని ఇప్పటి అధికారులకు సమాచారంఇచ్చిన రెండేళ్లుగా న్యాయం చేయని వైనం. కాగా గ్రామంలో ఇప్పటికీ ముగ్గురి పేర్లు ఎక్కడ కూడా నమోదు కాకుండా పూర్తి సమాచారం మాయమైంది వారు చాకలి సునీత,పెద్దింటి సంతోష,ఎర్ర రామకృష్ణ,డేటా ఎంట్రీలో వీరి పేర్లు ఎక్కడ కనిపించటం పోవటం గమనార్హం..ఇలా ఏకంగా 10 మంది లబ్ది దారుల ప్రజా పాలన పక్కా సమాచారం పరాయి ప్రదేశ్యశీ అయిన షాద్ నగర్ నియోజక వర్గంలో నీ మున్సిపాలిటీ వివిధ వార్డ్ లలో నమోదు చేసిసమాచారం నూటికి నూరు శాతం డేటా పూర్తి చేసామని చేతులు దులుపుకొని కుర్చునారు..నేడు పేద ప్రజలు పడుతున్న. అవస్థలు చేస్తుంటే,అధికారుల తప్పిదం పేద ప్రజలకు ఎంత పెద్ద శాపంగా మారిందో , అర్థమవుతుంది.ప్రభుత్వం,ప్రజా పాలన డేటాను కొలమానంగా తీసుకుంటున్నందున వారికి , స్థానిక.బైరంపల్లి ,గ్రామ పంచాయతీలో ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హత లేదని మీ పేర్లు , ఇక్కడ లేవని,ప్రభుత్వం ప్రతిష్ఠాతకంగా అందిస్తున్న అతి పెద్ద పథకాలైన ఇందిరమ్మ ఇళ్లు ,, పెన్షన్లు,రేషన్ కార్డులు ,ఉచ్చిత కరెంట్ పథకమైన,గృహ జ్యోతి, గృహ లక్ష్మీ లాంటి పథకాలు వాటికి అందటం లేదు,గ్రామంలో చాలా నిరుపేద కుటుంబాలు ఉన్నాయి. కనీసం నిలువ నీడ లేని ,నివాసం లేక వీధిన పడి,జీవనం సాగిస్తున్నారు..గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ,పథకమైన వాటికే వచ్చే అర్హతగల అంతటి పేదవారు,కేవలం అధికారుల తప్పిదం వల్ల నిరు పేదల పాలిట పెను శాపంగా మారింది..కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి విడత ఇందిరమ్మ ఇళ్లు మంజూరులో వారి పేర్లు ఉనత్యాధికారులకు పంపిన ,వాటికి ఇళ్లు మంజూరు కాలేదు, రెండవ విడతలో కూడా ఇళ్లు రాలేదువారు మండల అధికారుల చుట్టూ ఎంత తిరిగిన ,న్యాయం చేయలేక పోయారు అట్టు పిమ్మట మున్సిపాలిటీ అధికారుల చుట్టూ తిరిగిన వారు న్యాయం చేయలేక ఒకరిపై ఒకరు చెపుతూ లబ్ది దారులకు తీవ్ర నిరాశకు గురిచేశారు ప్రత్భుత్వం ఏర్పడి రెండున్నర ఏళ్ళైనా ,తప్పుగా నమోదైన ప్రజా సమాచారాన్ని సరిచేయలేఖ పోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే చర్యలకు చేపట్టి వారికి మరో మారు ప్రజా పాలన దరఖాస్తుకుఅవకాశం కల్పించాలని లేదా తప్పుగా నమోదైన డేటా తో సంబంధం లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందరితో సమానంగా మాకు అందించాలి అని లబ్ది దారులు కోరుతున్నారు..

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy

లోకల్ గైడ్ ద్విభాషా దినపత్రిక



# హామీలు కాదు...అమలు కావాలి

పి డి ఎస్ యు ధర్నా




**నారాయణపేట అక్టోబర్ 5:** నారాయణపేట జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల ను పడగొట్టి నూతనంగా నిర్మించాలని పి.డి.ఎస్.యు ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ఆర్డీఓ కార్యాలయం ముందు సోమవారం పి డి ఎస్ యు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా హామీలు కాదు చేతులలో నిరూపిం చాలని పి.డి.ఎస్.యు జిల్లా అధ్యక్షులు వెంకటేష్ స్పష్టం చేశారు. 2021 నుండి 2026 వరకు అనేకసార్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలను పడగొట్టి నూతనంగా నిర్మించాలని ప్రభుత్వా ధికారుల దృష్టికి తీసు కొచ్చిన ఎలాంటి చలనం లేదు అని అన్నారు. కారణాలు చెబుతున్నారు తప్ప ఒక్కసారి కూడా ఆ కళాశాలకు వచ్చి విజిట్ చేయని పరిస్థితి ఉందని అన్నారు. కనీసం ఆ కాలే జీలో పూర్తిగా టాయిలెట్స్ లేవని గర్ల్స్ కూడా ఒకే ఒక టాయిలెట్ ఉండడంతో గంటల తరబడి వెయిట్ చేయాల్సిన పరిస్థితి ఉందని వారు అన్నారు. అంతేకాకుండా ఈరోజు మా కళ్ళ ముందే పైన ఉన్న పెచ్చులూడి మా ముందు ఉన్న బెంచ్ పైన పడిన పరిస్థితి ఉందని వారు అన్నారు.అంతే కాదు దు అక్కడ ల్యాబ్,గ్రౌండ్ లాంటి ఎలాంటి సౌకర్యం లేదు అని అన్నారు.ఒక్కొక్కసారి ఆ కాలేజీ వాతావరణంలో పాములు కూడా తిర్గాడు తున్న పరిస్థితి ఉందని అన్నారు. అసలు అధికా రులు దేనికోసం వేచి చూస్తున్నారా అనే విష యం అర్థం కావట్లేదు అని అన్నారు. అందుకే హామీ లతో కాదు చేతులతో నిరిపించేంతవరకు ఈ పోరాటం ఆగదని వారు అన్నారు. కాబట్టి ఇప్పటి కైనా ఆ కాలేజీకి వెళ్లి విజిట్ చేసి వెంటనే కూల్చివేసి నూతనంగా నిర్మించాలని వారు హెచ్చరించారు. ఒకవేళ లేని పక్షంలో ఇంకా తీవ్ర ఆందోళనలు చేపడ తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి.డి. ఎస్.యు జిల్లా సహాయ కార్యదర్శి రాజు, జిల్లా కమిటీ సభ్యులు సురేష్, మాజీ జిల్లా ఉపాధ్యక్షులు గౌస్ పి.డి.ఎస్.యు కాలేజ్ అధ్యక్ష కార్యదర్శులు ప్రవీణ్, మోహన్, జ్యోతి, గాయత్రి,పి.డి.ఎస్.యు నాయకులు శ్రీకాంత్,శివ, శ్రీను, మంజునాథ్, శివకుమార్, విగ్నేష్,బాను, అంజి,మారుతీ, మోహన్, అఖిల, అంజమ్మ,అశ్విని, విక్రమ్ రాథోడ్, అశ్వినీ తో పాటు నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# తెలంగాణ పోలీస్ గేమ్స్ స్పోర్ట్స్ మీట్‌లో పేట పోలీసుల ప్రతిభ

గోల్డ్ మెడల్స్, ఒక బ్రౌంజ్ మెడల్

సాధించిన పోలీ సులనుఅభినందించినఎస్పీ డాక్టర్ వినీత్



**నారాయణపేట అక్టోబర్ 5:** హైదరాబాద్ లోని తెలంగా ణ పోలీస్ అకాడమీ లో సెప్టెంబర్ 28,29,30 వరకు జరిగిన 5వ తెలంగాణ పోలీస్ గేమ్స్, స్పోర్ట్స్ మీట్--2026 లో నారా యణపేట జిల్లా పోలీస్ అధికారులు అదనపు ఎస్పీ రియాజ్ హుల్ హక్, హెడ్ కానిస్టేబుల్ బాలరాజు లు లాన్ టెన్నిస్ విభాగంలో ప్రతిభ కనబరిచి మూడు గోల్డ్ మెడల్స్, ఒక బ్రౌంజ్ మెడల్ పతకాలు సాధించ దం పట్ల జిల్లా ఎస్పీ డాక్టర్ జి. వినీత్ అభినందనలు తెలిపారు.లాన్ టెన్నిస్ సింగిల్స్ క్రీడా పోటీలలో అదనపు ఎస్పీ ఎం.డి. రియాజ్ ఉల్ హక్ 50ం, ఓపెన్ కేటగిరీ సింగిల్స్ విభాగంలో రెండు గోల్డ్ మెడల్స్ సాధించగా, 40ం విభాగంలో ఒక బ్రాంజ్ మెడల్ సాధించారు. అదేవిధంగా ఎన్ జి ఓ కేటగిరీలో ఆర్ముడు రిజర్వ్ హెడ్ కానిస్టేబుల్ బాల రాజు అద్భుత ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించారు.ఈ సంద ర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ జి. వినీత్ అదనపు ఎస్పీ రియాజ్ ఉల్ హక్,ఎచ్ సి బాలరాజులకు మెడల్స్ అందించి ప్రత్యేకంగా అభినందించి, శుభాకాం క్షలు తెలిపారు. పోలీస్ విధులతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరచడం అభి నందనీయమని పేర్కొన్నా రు.క్రీడలు పోలీసు సిబ్బంది లో శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవి శ్వాసం, పోటీతత్వ స్ఫూర్తి ని పెంపొందిస్తాయని ఎస్పీ తెలిపారు. తెలంగాణ, జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావడంలో క్రీడాకారుల ప్రతిభ కీలక మని పేర్కొన్నారు.వచ్చే నెలలో బెంగళూరులో నిర్వహించనున్న నేషనల్ పోలీస్ స్పోర్ట్స్ గేమ్స్లో పాల్గొని ఇదే ఉత్సాహంతో మరిన్ని పథకాలు సాధించి నారాయణపేట జిల్లాకు, తెలంగాణ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురా వాలని ఎస్పి ఆకాంక్షించా రు.ఈ సందర్భంగా పతకా లు సాధించిన అధికారులు, సిబ్బందికి జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

# అభివృద్ధికి బాటలు.. సమస్యలకు సత్వర పరిష్కారాలు!

పోల్కంపల్లిలో రూ.50 లక్షల సీసీ రోడ్ల ప్రారంభం

ప్రజల సమస్యలపై ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తక్షణ స్పందన





**ఇబ్రహీంపట్నం అక్టోబర్ 5( లోకల్ గైడ్ ) :** గ్రామీణ ప్రాంతాల సమగ్ర వికాసమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి స్పష్టం చేశారు. మండల పరిధిలోని పోల్కంపల్లి గ్రామంలో రూ.50 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యేకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో మరింత అభివృద్ధికి అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు.పర్యటన సందర్భంగా స్థానిక ప్రజలు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల వినతులపై అక్కడికక్కడే స్పందించిన మల్‌రెడ్డి రంగారెడ్డి.. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి ప్రత్యేకంగా సమావేశాలు ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం లేదని, ప్రజాప్రతినిధులు నేరుగా ప్రజల మధ్యకు వచ్చినప్పుడే సమస్యల తీవ్రత తెలుస్తుందన్నారు. ప్రజల వద్దే సమస్యలను ఆలకించి, అక్కడికక్కడే పరిష్కార దిశగా చర్యలు తీసుకోవడమే ప్రజా పాలనకు నిజమైన నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు ఎలాంటి అలసత్వం వహించరాదని, విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, నాయకులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పర్వతని ఆరోదించి న విదద్యార్థి ని సన్మానిచ్చిన జిల్లా కలెక్టర్.(లోకల్ గైడ్ 5అక్టోబర్ )కామారెడ్డి ప్రతినిధి

హిమాచల్ ప్రదేశ్‌లోని తరంగ్ 2 అతి ఎత్తైన పర్వతాశీ 6,021 మీటర్ల ఎత్తైన

పర్వతాన్ని అధిరోహించిన గిరిజన విద్యార్థివి

విద్యార్థి బన్నీని సన్మానించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్




కామారెడ్డి: రాజంపేట మండలం ఎల్లాపూర్ తండాకు చెందిన తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల, కామారెడ్డిలో బీకాం తుది సంవత్సరం చదువుతున్న విశ్లావత్ బన్నీ హిమాచల్ ప్రదేశ్‌లోని 6,021 మీటర్ల ఎత్తైన పర్వతాన్ని అధిరోహించి చారిత్రాత్మక ఘట్టాన్ని నమోదు చేశారు.ఈ సందర్భంగా జిల్లా సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ విద్యార్థి విశ్లావత్ బన్నీని శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యతో పాటు సాహస క్రీడల్లోనూ ప్రతిభ కనబరుస్తూ జిల్లాకు గుర్తింపు తీసుకురావడం అభినందనీయమన్నారు. బన్నీ విజయాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఇతర విద్యార్థులు కూడా తమ ప్రతిభను వివిధ రంగాల్లో చాటాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# “కేసముద్రం లో మాదిగ సంక్షేమ సంఘం”ఏర్పాటు

- కమిటీ నాయకులకు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘన సన్మానం!

లోకల్ గైడ్ అక్టోబర్ 5 కేసముద్రం : మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలో మాదిగల ఐక్యత కోసం “మాదిగ సంక్షేమ సంఘం” ఏర్పాటు అంబేద్కర్ ఆశయాలకు నాంది - మండల పార్టీ అధ్యక్షులు సమ్మిగౌడ్

రూ.2 కోట్లతో కేసముద్రం లో అంబేద్కర్ భవన నిర్మాణం..-వేం నరేందర్ రెడ్డి,ఉమా మురళి నాయక్, బలరాం నాయక్, గంట సంజీవరెడ్డి కృతజ్ఞతలు

అంబేద్కర్ ఆశయాలే స్ఫూర్తిగా.. మాదిగల కష్టసుఖాల్లో మేమున్నామంటున్న కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సమ్మయ్యగౌడ్

నిమ్నజాతుల ప్రజలకు అండగా కాంగ్రెస్ పార్టీ - పీసీసీ సభ్యులు దస్రు నాయక్

సంఘం మనోభావాలను గుర్తించి,గౌరవించిన మండల కాంగ్రెస్ పార్టీ కి,సమ్మిగౌడ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు - అధ్యక్షులు పోలేపాక ఉప్పలయ్య



కేసముద్రం: ఒక సంఘం ఏర్పాటు చేయడం అంటే కేవలం కొంతమంది కలిసి ఒక కమిటీని ఏర్పాటు చేయడం కాదు.. ఒక సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు ఒక వేదికను నిర్మించడం.తమ కష్టాలను తామే చర్చించుకునే అవకాశం కల్పించడం.తమ హక్కులు,ఆకాంక్షలు,ఆత్మగౌరవం, అభివృద్ధి కోసం ఒకే మాటపై నిలబడేలా ఐక్యతను పెంచడం.ఇదే ఆలోచన తో కేసముద్రం మండలం లోని మాదిగ కులస్థులు మహబూబాబాద్ జిల్లాలోనే కాదు, తెలంగాణ రాష్ట్రం లోనే ఏ మండలం లో ఇప్పటివరకు లేని ఒక నూతన ఆలోచనా విధానాన్ని, గత కొన్ని నెలలుగా ఊరురా,వాడ, వాడనా తిరిగి తమ జాతి బిడ్డలను ఒక్కతాటి మీదకు తీసుకువచ్చి కేసముద్రం మండల కేంద్రంలో “మాదిగ సంక్షేమ సంఘం “ఏర్పాటు చేయడం జరిగింది.. జాతి హితం కోసం ఏర్పాటు చేసిన “ మాదిగ సంక్షేమ సంఘం” కోసం పనిచేస్తున్న సంఘం నాయకులకు కేసముద్రం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అధ్యక్షులు చిలువేరు సమ్మయ్యగౌడ్ ఘనంగా సన్మానం చేశారు.మాదిగల సంక్షేమం కోసం ప్రత్యేకంగా సంఘాన్ని ఏర్పాటు చేసి ముందుకు తీసుకెళ్తున్న నాయకుల సేవలను గుర్తించి వారిని గౌరవించడం ద్వారా సమ్మయ్యగౌడ్ తనకున్న సామాజిక బాధ్యతను మరోసారి చాటుకున్నారని సంఘం నాయకులు పేర్కొన్నారు. సన్మానం అనేది ఒక కార్యక్రమంగా ముగిసిపోయేది కాదని.. సేవ చేస్తున్న వారిని గుర్తించి మరింత ఉత్సాహంతో ముందుకు నడిపించే ప్రోత్సాహమని వారు అన్నారు.

### కేవలం సంఘం కాదు.. భవిష్యత్ తరాలకు ఒక వేదిక- పీసీసీ సభ్యులు దస్రు నాయక్

పీసీసీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దస్రు నాయక్ మాట్లాడుతూ కేసముద్రం మాదిగ సంక్షేమ సంఘం స్థాపనను,కార్యావర్గాన్ని, సంఘానికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం చెయ్యాలనే మంచి ఆలోచన చేసినటువంటి అధ్యక్షులు సమ్మిగౌడ్ ని అభినందిస్తూ...సంఘం కార్యక్రమాలకు శాశ్వత వేదికగా నిలిచేలా కేసముద్రం మండల ప్రాంతం లో కాంగ్రెస్ పార్టీ,స్థానిక శాసనసభ్యులు డా.మురళీనాయక్, యంపీ బలరాం నాయక్ చొరవతో, వేం నరేందర్ రెడ్డి బలమైన సంకల్పం తో రూ.2 కోట్లతో నిర్మిస్తున్న అంబేద్కర్ భవన్ మీకు ఒక మనిహారం అని, మాదిగల సమావేశాలు,సంక్షేమ కార్యక్రమాలు, సామాజిక కార్యక్రమాలు, యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ఈ కమిటీ హాల్ ఉపయోగపడనుందని అన్నారు..ఒక భవనం నిర్మించడం కంటే.. ఒక సమాజానికి భవిష్యత్తును నిర్మించేందుకు వేదికను కల్పించడం గొప్ప విషయమని దస్రు నాయక్ పేర్కొన్నారు. ఈ అంబేద్కర్ భవన్ రాబోయే తరాలకు కూడా ఉపయోగపడేలా, మాదిగల సామాజిక పురోగతికి కేంద్రంగా మారాలని ఆకాంక్షించారు..

### అంబేద్కర్ ఆశయాల సాధనకు ఐక్యతే బలం-కాంగ్రెస్ మండల అధ్యక్షులు సమ్మిగౌడ్

ఈ సందర్భంగా సమ్మయ్యగౌడ్ మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చూపించిన రాజ్యాంగ మార్గం ప్రతి ఒక్కరికీ సమానత్వం, ఆత్మగౌరవం, హక్కులు, అవకాశాల కోసం పోరాడే స్ఫూర్తిని ఇచ్చిందన్నారు.మాదిగ సమాజం విద్య, ఉద్యోగం, ఆర్థిక అభివృద్ధి, సామాజిక చైతన్యం వైపు మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. సమాజం అభివృద్ధి చెందాలంటే యువత చదువులో ముందుండాలని,ఆర్థికంగా బలపడే దిశగా అడుగులు వేస్తూ వ్యాపారరంగం వైపు అడుగులు వేయాలని ఆ దిశగా వెళ్లే బిడ్డలకు పెద్దలు మార్గదర్శకులుగా నిలవాలని సూచించారు.మహబూబాబాద్ జిల్లాలోనే మొట్టమొదటిసారి గా గొప్ప ఆలోచనా విధానం తో, భవిష్యత్ తరాలకు బాటలు వేసే దిశగా అన్ని మండలాల మాదిగ బిడ్డలకు ఆలోచన కలిగించేలా “కేసముద్రం మాదిగ సంక్షేమ సంఘం”ఏర్పాటు అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా అడుగులు బలపడుతున్నాయని ఆనందం వ్యక్తం చేసారు.గత కొన్ని నెలలుగా గ్రామ, గ్రామాన తిరిగి తమ కులాన్ని చైతన్యం చేసి సంఘాన్ని ఏర్పాటు చేసిన అధ్యక్షులు ఉప్పలయ్య ని,సంఘం కమిటీని సహకరించిన ప్రతీ మెంబెర్ ని అభినందించారు..కాంగ్రెస్ పార్టీ కేసముద్రం మండలం లో మాదిగ బిడ్డల భవిష్యత్ ని, వారి ఆత్మ గౌరవాన్ని దృష్టిలో పెట్టుకొని రూ.2 కోట్లతో నిర్మిస్తున్న అంబేద్కర్ భవన నిర్మాణమే మాదిగ జాతి పట్ల,వారి భవిష్యత్ పట్ల కాంగ్రెస్ పార్టీ కి ఉన్న చిత్తశుద్ధి,ప్రేమ అర్థం అవుతుంది అన్నారు.. ఈ సందర్భంగా అంబేద్కర్ భవన నిర్మాణానికి సహకరించిన రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మురళి నాయక్, ఎంపీ బలరాం నాయక్,మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవ రెడ్డి కు మాదిగ సంక్షేమ సంఘం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వారి సహకారంతో మాదిగల కోసం నిర్మితమవుతున్న ఈ వేదిక భవిష్యత్ తరాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సమ్మిగౌడ్ ఆశాబాహం వ్యక్తం చేసారు..మాదిగ సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేసి ప్రజల కోసం పనిచేస్తున్న నాయకులను సన్మానించడం తనకు ఎంతో గౌరవంగా ఉందని,వీరిని గౌరవించడం అంటే అంబేద్కర్ ఆశయాలను గౌరవించినట్టేనని,సంఘం చేపట్టే మంచి కార్యక్రమాలకు తన వంతు సహకారం తన చివరి శ్వాస వరకు ఉంటుందని సమ్మయ్యగౌడ్ తెలిపారు.

### మమ్మల్ని గుర్తించి గౌరవించిన సమ్మయ్యగౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు - అధ్యక్షులు పోలేపాక ఉప్పలయ్య

మాదిగ సంక్షేమ సంఘం అధ్యక్షులు పోలేపాక ఉప్పలయ్య మాట్లాడుతూ.. తమ సంఘాన్ని ఏర్పాటు చేసి మాదిగల సంక్షేమం కోసం పనిచేస్తున్న నాయకులను గుర్తించి సన్మానించిన సమ్మయ్యగౌడ్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.“మా సేవలను గుర్తించి మమ్మల్ని సన్మానించడం మాకు దక్కిన గౌరవం మాత్రమే కాదు.. మాదిగల కోసం ఇంకా ఎక్కువ పనిచేయాలనే బాధ్యతను పెంచింది” అని ఉప్పలయ్య అన్నారు.మాదిగల మధ్యకు వచ్చి వారి కష్టసుఖాలను తెలుసుకుంటూ, తమతో ఒక కుటుంబ సభ్యుడిలా మమేకమవుతున్న సమ్మయ్యగౌడ్ తీరు తమకు ఎంతో ధైర్యాన్నిస్తోందన్నారు. మాదిగల సంక్షేమం కోసం ఎలాంటి కార్యక్రమం చేపట్టినా ఆయన సహకారం ఉంటుందనే నమ్మకం తమకు ఉందన్నారు.మాదిగ సంక్షేమ సంఘం ఇకపై కేవలం ఒక సంస్థగా కాకుండా మాదిగల సమస్యలకు స్పందించే వేదికగా, యువతకు మార్గనిర్దేశం చేసే కేంద్రంగా, సామాజిక చైతన్యానికి చిరునామాగా ముందుకు సాగుతుందని, మావాళ్ళను సమాజం లో నిలబెడెలా ఆర్థిక, సామజిక చైతన్యం తీకురావడమే మా ప్రధాన ఎజెండా గా పనిచేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాదిగ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు మంద సాయిబాబా, ప్రధాన కార్యదర్శి బుర్ర గుండ్ల యాదగిరి, కోశాధికారి పందుల సారయ్య, ముఖ్య సలహాదారులు పోలేపాక నాగరాజు, జల్లే మాకాౖమం, మేడి శ్రీనివాస్, వల్ల దాస్ దేవాదానం, మేరకు ఉపేందర్, దండు యాకయ్య తదితరులు పాల్గొన్నారు.కాంగ్రెస్ పార్టీ నాయకులు.వల్లందాసు రవి,దామరకొండ ప్రవీణ్,సర్పంచ్ లు వీరాస్వామి, శ్రీనివాస్ నాయక్, రామచంద్రు, మాజీ సర్పంచ్ లు నాగెల్లి శ్రీను, రవీందర్,మాజీ ఎంపీటీసీ లు మేడి ఉపేందర్, రేసు శ్రీనివాస్ గౌడ్,కథ ప్రభాకర్,గ్రామ పార్టీ అధ్యక్షులు నరేటి కొమురయ్య, మిట్టగడుపుల యాకుబ్, గంధసిరి సారయ్య, కాలేరు వెంకన్న,వల్లాల రాజేందర్,మిట్టగడుపుల యాకన్న,ఏలీయా,చెడుపల్లి ఎలందర్,దండు శ్రీనివాస్, కంటిపూడి అరుణ్ కుమార్, రవి, కరుణాకర్, కుమార్, రాజు, రాజా నాయక్ తదితరులు పాల్గొన్నారు..కేసముద్రం నేలపై మాదిగల కోసం ఏర్పడిన ఈ సంక్షేమ వేదిక.. ఒక్కరోజు కార్యక్రమంతో ముగిసేది కాకుండా, ఐక్యతతో ముందుకు సాగితే రాబోయే తరాలకు ఒక బలమైన సామాజిక వారసత్వంగా నిలుస్తుందనే ఆశాభావం వ్యక్తమైంది.

# లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏఎస్ రెడ్డి స్పోకెన్ ఇంగ్లీష్ క్లాసెస్ ప్రారంభం



**నారాయణపేట అక్టోబర్ 5:** నారాయణపేట పట్టణంలో లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏఎస్ రెడ్డి స్పోకెన్ ఇంగ్లీష్ క్లాసులకు సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పట్టణ ఎస్సై వెంకటేశ్వర్లు క్లాసెస్‌ను ప్రారంభించారు.స్పోకెన్ ఇంగ్లీష్ క్లాసెస్ అన గానే ముందుగా గుర్తుకు వచ్చే పేరు ఏఎస్ రెడ్డి హైద రాబాద్‌తో పాటు మహబూ బ్‌నగర్ వివిధ ప్రాంతాల్లో బ్రాంచ్‌లను ఏర్పాటు చేసి, వేలాది మంది విద్యార్థులు, నిరుద్యోగులకు ఇంగ్లీష్ కమ్యూనికేషన్‌లో శిక్షణ అందిస్తూ విజయవంతంగా కొనసాగిస్తున్నారన్నారు.నారాయణపేట ప్రాంతంలో చాలామంది నిరుద్యోగుల కు ఇంగ్లీష్ కమ్యూనికేష న్‌లో ఇబ్బందులు ఉండ టాన్ని గుర్తించిన ఏఎస్ రెడ్డి వారికి ఉద్యోగ అవకాశాల్లో ఉపయోగపడేలా స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను అందించాలనే దృఢ సంకల్పంతో నారాయ ణపేటలో ఈ క్లాసెస్‌ను ప్రారంభించారు.

ప్రత్యేకంగా ఉచిత శిక్షణ

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు ఉచితంగా స్పోకెన్ ఇంగ్లీష్ క్లాసెస్,

వారియర్స్ డిఫెన్స్ అకా డమీ విద్యార్థిని, విద్యార్థు లకు ఉచితంగా స్పోకెన్ ఇంగ్లీష్ క్లాసెస్ను అందించ నున్నారు.అలాగే ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు, ఉచితంగా ఇంగ్లీష్ కమ్యూనికేషన్ నైపుణ్యాలను మెరుగుపరు చుకునేందుకు ఈ అవకా శాన్ని వినియోగించు కోవాలని లైన్స్ క్లబ్ అధ్యక్షుడు రవికుమార్ గౌడ్ కోరారు.ఇంగ్లీష్ నేర్చుకోవాలనే ఆసక్తి ఉన్న నారాయణపేట పట్టణ పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియో గం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఎస్ రెడ్డి , నారాయణరెడ్డి , లయన్ కన్న జగదీష్, లయన్ డాక్టర్ ఆంజనేయు లు ఆర్మీ , లయన్ శాంత గ, వారియర్స్ డిఫెన్స్ అకాడ మీ ఇన్‌చార్జ్ లయన్ ఎస్. చక్రవర్తి , వారియర్స్ డిఫెన్స్ అకాడమీ విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఫిర్యాదు దరఖాస్తును పరిశీలించి చర్యలు తీసుకోవాలి...

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ

ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన అదనపు కలెక్టర్



**ఖమ్మం, అక్టోబర్- 05: లోకల్ గైడ్:** ప్రతి ఫిర్యాదు దరఖాస్తును పరిశీలించి త్వరగా పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ జిల్లా అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ ప్రజల అర్జీలను స్వీకరించారు.తిరుమలాయపాలెం మండలం హస్నాబాద్ గ్రామ పంచాయతీకి చెందిన మాజీ సర్పంచ్ బొబ్బిలి భరత్ చంద్ర తనకు పంచాయతీ నుంచి 17 లక్షల 3 వేల 450 రూపాయల బిల్లులు పెండింగ్ ఉన్నాయని వీటిని త్వరగా చెల్లించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా పంచాయతీ అధికారికి రాస్తూ పరిశీలించి అక్టోబర్ 10 నాటికి విచారణ నివేదిక సమర్పించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ సేవా సంఘం ప్రతినిధులు ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగిస్తున్నారని వీటిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా విద్యాశాఖ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.ఖమ్మం జిల్లాకు చెందిన బోడ యమున తాను బీటెక్ పూర్తి చేశానని, కుటుంబ పరిస్థితుల కారణంగా తనకు ఖమ్మం జిల్లాలో లేదా సమీప ప్రాంతాలలో ఏదైనా ఉద్యోగం కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా ఉపాధి అధికారికి రాస్తూ అవకాశం మేరకు చర్యలు తీసుకోవాలని అన్నారు. తిరుమలాయపాలెం మండలం హస్నాబాద్ గ్రామ పంచాయతీకి చెందిన మామిడాల అనసూర్య తన కోడలు నుంచి జీవనభృతి ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా సంక్షేమ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని అన్నారు.

జి. వెంకటస్వామి (కాక) జయంతి సందర్భంగా అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ నివాళులు:

జి. వెంకటస్వామి (కాక) జయంతి సందర్భంగా సోమవారం ఖమ్మం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం ప్రారంభానికి ముందు అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జి. వెంకటస్వామి (కాక) సేవలను, పేదలు, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి చేసిన కృషిని స్మరించుకున్నారు. మంత్రిగా, వివిధ కీలక పదవుల్లో పనిచేస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి, పేదల సంక్షేమానికి జి. వెంకటస్వామి విశేష కృషి చేశారని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. కార్మికులు, పేదలు, అట్టడుగు వర్గాల సంక్షేమం కోసం వారు అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. మహనీయుల ఆశయాలు, సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఈ సందర్భంగా జిల్లా అధికారులకు అదనపు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్ ద్విభాషా దినపత్రిక



# అర్హులైన పట్టభద్రులు ఫారం -18 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవాలి

పాత జాబితాలో పేరు ఉన్నా కొత్తగా నిర్దేశిత విధానంలో దరఖాస్తు తప్పనిసరి.

ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి

జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్.



**లోకల్ గైడ్ మహబూబాబాద్, అక్టోబర్. 5.:** అర్హులైన పట్టభద్రులు ఫారం-18 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవాలి అని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అన్నారు.సోమవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరం ప్రజావాణి కార్యక్రమంలో వరంగల్- ఖమ్మం- నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో పట్టభద్రులైన ఓటర్లు ఓటరుగా నమోదు చేసుకోవడంపై జిల్లాస్థాయి అధికారులు, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.అనిల్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్- ఖమ్మం- నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటర్ల జాబితాలో ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం వెలువరించిన నియమ నిబంధనలు, దరఖాస్తు చేసే విధానం, గడువు, తదితర వివరాలను కలెక్టర్ స్నేహ శబరిష్ ప్రజావాణి లో పాల్గొన్న అధికారులకు క్షుణ్ణంగా వివరించారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై విస్తృతంగా అవగాహన కల్పించాలని, అర్హులైన పట్టభద్రులు నిర్ణీత గడువులోగా ఫారం-18 దరఖాస్తులు సమర్పించేలా సహకరించాలని తెలిపారు.01-11-2023 నాటికి కనీసం 3 సంవత్సరాల డిగ్రీ పూర్తి చేసి అర్హత కలిగిన అభ్యర్థులు ఫారం-18 దరఖాస్తును ఆఫ్‌లైన్ (లేదా) నియమిత అధికారికి సమర్పించాలన్నారు.దరఖాస్తుతో పాటు విద్యార్హతకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు, అవసరమైన ఇతర పత్రాలను జత చేయాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి అధికారిక వెబ్‌సైట్ ద్వారా సందర్శించవచ్చని తెలిపారు.పట్టభద్రుల ఓటరు జాబితాల నూతన తయారీ ప్రక్రియలో భాగంగా, ఇప్పటికే ఓటరు జాబితాలో పేర్లు ఉన్నవారు సైతం నిర్దేశిత విధానం ప్రకారం తిరిగి దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.పాత ఓటరు జాబితాలో పేరు ఉండటం ఒక్కటే ప్రస్తుత ప్రక్రియలో నమోదుకు సరిపోదని, అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు నిర్ణీత విధానంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## ప్రజావాణిలో 109 ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్.




**(లోకల్ గైడ్ 5అక్టోబర్ )కామారెడ్డి ప్రతినిధి :** కామారెడ్డి: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలకు సంబంధించి మొత్తం 109 ఫిర్యాదులు, వినతులు అందాయి.ప్రజలు సమర్పించిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులకు పంపించి, నిబంధనల ప్రకారం సమగ్రంగా పరిశీలించి అర్హత మేరకు సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేకుండా నిర్ణీత గడువులో చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా పరిశీలించి, పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రజావాణికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, వారి సమస్యలను సానుకూలంగా విని నిబంధనల పరిధిలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎస్ వై గిరి, డిప్యూటీ శిక్షణ కలెక్టర్ రవితేజ, డీఆర్ఓ పాండు, సీఈఓ చందర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బుద్వేల్‌లో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్




**రాజేంద్రనగర్, ( లోకల్ గైడ్):** నీటిని వృధా చేయకుండా సంరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ అన్నారు. సోమవారం నియోజకవర్గం పరిధిలోని బుద్వేల్ జెడ్.పి.హెచ్.ఎస్ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన 'రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్' (ఇంకుడు గుంత)ను ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ లాంఛనంగా ప్రారంభించారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్ ఆధ్వర్యంలో జల సంరక్షణలో భాగంగా ఈ హార్వెస్టింగ్ పిట్ నిర్మాణాన్ని చేపట్టారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు మండల విద్యాధికారి శంకర్ రాథోడ్, జల మండలి అధికారులు పాల్గొన్నారు. భూగర్భ జలాలను పెంపొందించే ఉద్దేశ్యంతో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయటం జరిగిందని జలమండలి అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పడమటి శ్రీధర్ రెడ్డి, సాయి మల్లిక్, శ్రవణ్ కుమార్, శ్రీరాములు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## మాదారం రామాలయంలో ఘనంగా సామూహిక సీమంతాల వేడుకలు

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం: సర్పంచ్ అజ్మీరా ఉమా నరేష్




**కారేపల్లి, అక్టోబర్ 5 (లోకల్ గైడ్ న్యూస్):** మాదారం గ్రామపంచాయతీ పరిధిలోని రామాలయంలో సోమవారం గర్భిణులకు సామూహిక సీమంత కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్వాడీ టీచర్ అనంతమ్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మాదారం సర్పంచ్ అజ్మీరా ఉమా నరేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గర్భిణులకు సీమంతం నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ అజ్మీరా ఉమా నరేష్ మాట్లాడుతూ గర్భిణులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. గర్భధారణ సమయంలో తల్లి, శిశువు ఆరోగ్యానికి అవసరమైన పోషకాహారం తీసుకోవడం ముఖ్యమని తెలిపారు. ఆకుకూరలు, పప్పులు, కూరగాయలు, పండ్లు, పాలు వంటి పోషక విలువలు ఉన్న ఆహారాన్ని రోజువారీ ఆహారంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వైద్యుల సూచనల మేరకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. రక్తహీనత, నీరసం లేదా ఇతర ఆరోగ్య సమస్యలు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. తగిన విశ్రాంతి తీసుకోవడం, పరిశుభ్రత పాటించడం, వైద్యుల సూచనల మేరకు ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అన్నారు. తల్లి, శిశువు ఆరోగ్యానికి ప్రభుత్వం అమలు చేస్తున్న సేవలను అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిపుచ్చుకోవాలని సర్పంచ్ తెలిపారు. గర్భిణుల ఆరోగ్యం విషయంలో అంగన్వాడీ సిబ్బంది, కుటుంబ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గర్భిణులకు అవసరమైన పోషకాహారం, ఆరోగ్య సూచనలు అందేలా అంగన్వాడీ కేంద్రాల సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ అంగన్వాడీ కేంద్రాల టీచర్లు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్‌ఎం పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ

దళారులను నమ్మి మోసపోవద్దు,డీఎంహెచ్ఓ డా. బి. రాజా రెడ్డి



**వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 05(లోకల్ గైడ్ న్యూస్) :** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, వరంగల్ డా. బి. రాజా రెడ్డి ఒక ప్రకటనలో మాట్లాడుతూ, కమిషనర్, వైద్య ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ, హైదరాబాద్ వారి సర్క్యులర్ మేరకు జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్ హెచ్ ఎం) పరిధిలోని వివిధ పోస్టులను కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానంలో భర్తీ చేయడానికి కలెక్టర్ జిల్లా మేజిస్ట్రేట్, వరంగల్ అప్రూవల్ తో నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు.అర్హత కలిగిన అభ్యర్థులు నోటిఫికేషన్‌లో పేర్కొన్న నిబంధనల ప్రకారం ఈ నెల 9 తేదీ సాయంత్రంలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నియామక ప్రక్రియను మెరిట్, రోస్టర్ ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు, విధానాల ప్రకారం పూర్తిగా పారదర్శకంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు.నియామకాల విషయంలో ఎలాంటి వదంతులు లేదా తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, దళారులను ఆశ్రయించి డబ్బులు చెల్లించి మోసపోవద్దని అభ్యర్థులకు సూచించారు. ఎవరైనా ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు డిమాండ్ చేయడం లేదా తప్పుడు నియామక ఉత్తర్వులు చూపించడం వంటి విషయాలు తమ దృష్టికి వస్తే, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. అటువంటి వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.అదేవిధంగా, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి సంబంధించి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం నుంచి ఎటువంటి నియామక నోటిఫికేషన్ జారీ కాలేదని, అలాగే ఈ కార్యాలయం ద్వారా ఎవరికీ నియామక ఉత్తర్వులు జారీ చేయలేదని డా. రాజా రెడ్డి స్పష్టం చేశారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి సంబంధించిన నియామకాలు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ( డి ఎం ఈ) పరిధిలో ఉంటాయని తెలిపారు.ఈ విషయానికి సంబంధించి తమ కార్యాలయంలో ఎటువంటి ఫిర్యాదు నమోదు కాలేదని కూడా ఆయన పేర్కొన్నారు.అభ్యర్థులు అధికారిక నోటిఫికేషన్లను మాత్రమే నమ్మాలని, అనధికార వ్యక్తులు, దళారుల మాటలు నమ్మి డబ్బులు చెల్లించి మోసపోవద్దని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కోరారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణ శంఖారావం

హనుమకొండలో అంబేద్కర్ సెంటర్ నుండి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ

పాల్గొన్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు,

సిపిఐ, సిపిఎం నాయకులు, కార్యకర్తలు

సీఈసీ జ్ఞానేష్ కుమార్ ను తొలగించాలని డిమాండ్




**హనుమకొండ జిల్లా ప్రతినిధి, అక్టోబర్05(లోకల్ గైడ్ న్యూస్) :** హనుమకొండ : జాతీయ స్థాయిలో ఇండియా కూటమి ఇచ్చిన పిలుపు మేరకు హనుమకొండ జిల్లా కేంద్రంలో ఇండియా కూటమి పార్టీలు శంఖారావం పూరించాయి. సోమవారం రాజ్యాంగబద్ధమైన ఎన్నికల సంఘాన్ని కేంద్ర ప్రభుత్వం తన గుప్పిట్లోకి తీసుకుని ఓట్ల అక్రమాలకు పాల్పడుతోందని ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమంలో భాగంగా అంబేద్కర్ సెంటర్ నుండి హనుమకొండ కలెక్టరేట్ వరకు ప్రజాస్వామ్య పరిరక్షణ పాదయాత్ర చేపట్టారు.అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద 'ఇండియా' కూటమి భాగస్వామ్య పక్షాల ఆధ్వర్యంలో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి,కెఆర్ నాగరాజు, రేవూరి ప్రకాష్ రెడ్డి, డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, కుడా చైర్మన్ గుండు సుధారాణి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, సిపిఎం జి. ప్రభాకర్ రెడ్డి, న్యూ డెమొక్రసీ, తెలంగాణ జన సమితి జిల్లా నాయకులు సున్నా అప్పారావు, చిల్లా రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇండియా కూటమి నాయకులు కలిసి కేంద్ర ప్రభుత్వానికి, ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్లకార్డులతో నినాదాలు చేశారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట సర్ ప్రక్రియ పేరుతో కోట్లాది మంది ఓట్లు అక్రమంగా తొలగించిన కేంద్ర ఎన్నికల ప్రధానాధికారి జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి, కె.ఆర్.నాగరాజు మాట్లాడుతూ స్వయంప్రతిపత్తి కలిగిన ఎన్నికల కమిషన్ వ్యవస్థను కేంద్రంలోని అధికార పార్టీ తన రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటోందని విమర్శించారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాలరాసేలా జరుగుతున్న అక్రమాలను అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడటంలో ఎన్నికల సంఘం విఫలమైందని మండిపడ్డారు. దేశంలో స్వేచ్ఛాయుత, పారదర్శక ఎన్నికలు జరగాలంటే ప్రస్తుత ఎన్నికల ప్రధాన అధికారి తప్పుకోవాలని స్పష్టం చేశారు.



మొదట ఈడీ, సీబీఐని ఉపయోగించి ప్రతిపక్ష నాయకులను బీజేపీలో చేర్చుకున్నారని, నేడు ఓట్ చోరీకి పాల్పడుతూ అక్రమంగా ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల్లో ఓట్ చోరీపై నోరు మెదపడం లేదని అన్నారు.సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ, అర్హులైన సామాన్యులు, పేదల ఓట్లను అక్రమంగా తొలగిస్తున్నదని మండిపడ్డారు. ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మ అయిన ఓటు హక్కును కాపాడుకోవడం అందరి బాధ్యత అన్నారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను తక్షణమే పదవి నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.గతంలో మాదిరిగా సీఈసీ ఎంపిక ప్రక్రియలో చీఫ్ జస్టిస్ ను భాగస్వామ్యం చేయాలన్నారు. తొలగించిన ప్రతి ఒక్క ఓటును వెంటనే పునరుద్ధరించాలని, అలాగే వివాదాస్పదంగా మారిన ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.సిపిఎం జిల్లా కార్యదర్శి జి. ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఇండియా కూటమి పోరాటంతో ఇప్పటికే రెండు విజయాలు సాధించామని, సీఈసీ ని తొలగించే వరకూ పోరాడి మరో విజయం సాధించాలని అన్నారు. సీఈసీ ని ఉపయోగించుకుని మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేసే వరకు ఇండియా కూటమి దేశవ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తాయని హెచ్చరించారు.అనంతరం జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీచర్స్ మేరా కో-ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ సంగ వెంకట్రాజం, కాంగ్రెస్ హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ ఒడితల ప్రణవ్, వరంగల్ పార్లమెంట్ ఇంచార్జ్ దుద్దిల్ల శ్రీను బాబు, డిసిసి మీడియా, కమ్యూనికేషన్ కమిటీ చైర్మన్ మార్క విజయ్ కుమార్, సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, నాయకులు సిరబోయిన కరుణాకర్, ఆదరి శ్రీనివాస్, తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, సిపిఎం జిల్లా నాయకులు ఎస్. వాసుదేవ రెడ్డి,గొడుగు వెంకట్, టి. ఉప్పలయ్య, చక్రపాణి, కుమారస్వామి, ఏఐసీసీ చైర్మన్ తోటం ఝాన్సీరాణి రవీందర్, వరంగల్ మార్కెట్ చైర్మన్ ఫుల ప్రియాంక, పరకాల మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజి రెడ్డి, టీడీసీసీ సభ్యులు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఈ.వి. శ్రీనివాస్ రావు, బత్తిని శ్రీనివాస్,కూచన రవళి,మాజీ ఎమ్మెల్సీ పుల్ల పద్మావతి, దొమ్మటి సాంబయ్య, శ్రీనివాస్ గౌడ్, టీటీఎఫ్ నాయకులు చుంచు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

కలెక్టర్ ప్రియాంక



**నారాయణపేట అక్టోబర్ 5:** ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి వీలైనంత త్వరగా వాటిని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని ప్రజావాణి సమావేశ మందిరం లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 19 ఫిర్యా దులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ కు విన్నవిస్తూ అర్జీ లు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ ప్రజావాణి అర్జీ ల ను పెండింగ్ లో పెట్టకుండా సత్వరం పరిష్కరించాల న్నారు. శాఖల వారీగా ఆయా అర్జీలను ఎప్పటి కప్పుడు పరిశీలించి వెంట నే పరిష్కరించాలని ఆదే శించారు.ఈ కార్యక్రమంలోఅదనపు కలెక్టర్ శ్రీను, వివి ధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## గీతంలో ఎడిటింగ్, ప్రచురణపై కార్యశాల, ఘనంగా ప్రపంచ వాస్తుశిల్ప దినోత్సవం

-ప్రచురణ మెళకువలపై విద్యార్థులకు శిక్షణ, మానవ దృక్పథంలో గృహనిర్మాణంపై ఆర్కిటెక్ట్ ప్రసంగం



**పటాన్ చెరు, అక్టోబర్ 05 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ):** హైదరాబాద్ లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ కు చెందిన ఆంగ్ల, ఇతర భాషల విభాగం ఆధ్వర్యంలో ఎడిటింగ్, ప్రచురణపై రెండు రోజుల కార్యశాల ప్రారంభమైంది. ఓరియంట్ బ్లాక్ స్వాన్, జుబాన్ బుక్స్ సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ కార్యశాలలో పాల్గొనే వారికి సమకాలీన ప్రచురణ పద్ధతులపై ఆచరణాత్మక అవగాహన కల్పిస్తున్నారు. జుబాన్ వారి 'పోస్టర్ ఉమెన్' కలెక్షన్ ప్రదర్శనను కూడా ఏర్పాటు చేశారు. ఈ కార్యశాలలో స్త్రీవాద రచయిత్రి, ప్రచురణకర్త ఊర్వశి బుటాలియా, ది ఇండియా ఫోరమ్ ఎడిటర్-ఇన్-చీఫ్ సి.రామ్మోహన్ రెడ్డి, ఓరియంట్ బ్లాక్ స్వాన్ హ్యుమానిటీస్ అసిస్టెంట్ పబ్లిషర్ శ్రీనాథ్ శ్రీధరన్ పాల్గొంటున్నారు. తొలిరోజు ఎస్.శ్రీనాథ్ ప్రచురణ వ్యవస్థ, కాపీరైట్, కంటెంట్, కాపీ ఎడిటింగ్ పై తరగతులు నిర్వహించారు. రెండో రోజు ఊర్వశి బుటాలియా స్త్రీవాద ప్రచురణ రాజకీయాలపై, డాక్టర్ రెడ్డి డిజిటల్ వార్తా ప్రచురణపై ప్రసంగిస్తారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ దేబ్రతి చక్రవర్తి, డాక్టర్ ప్రతీక్ దాస్ నిర్వహిస్తున్నారు. అదేవిధంగా గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ లో ప్రపంచ వాస్తుశిల్ప దినోత్సవం 2026 ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రఖ్యాత వాస్తుశిల్పి సమర్ రామచంద్ర అసోసియేట్స్ ప్రిన్సిపల్ ఆర్కిటెక్ట్ సమరేంద్ర ఎం. రామచంద్ర 'గృహనిర్మాణం: ఒక మానవ దృక్పథం' అంశంపై ప్రసంగించారు. వాస్తుశిల్పాన్ని మానవ-కేంద్రీకృత దృక్పథంలో చూడాలని ఆయన సూచించారు. విద్యార్థుల సృజనాత్మక కార్యక్రమాల్లో విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు.

## సంస్కార భారతి ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకల పోస్టర్ ఆవిష్కరణ



**నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. లోకల్ గైడ్ :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని సంస్కార భారతి తెలంగాణ ఆధ్వర్యంలో అక్టోబర్ 9న నల్లగొండ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మరియు ప్రభుత్వ విద్యా శిక్షణ సంస్థ (డైట్ కళాశాల) లో నిర్వహించనున్న బతుకమ్మ వేడుకల పోస్టర్‌ను ఈరోజు ఆయా కళాశాలల ప్రాంగణంలో ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో సంస్కార భారతి ఉమ్మడి నల్లగొండ జిల్లా కన్వీనర్ కన్వెనోయిని శ్రీధర్ సామాజిక కార్యకర్త పొట్టిపాక నాగరాజు,కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు,సంస్కార భారతి ప్రతినిధులు పాల్గొన్నారు.తెలంగాణ ఆడపడుచుల సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించే బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అక్టోబర్ 9న ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న బతుకమ్మ వేడుకల్లో మహిళలు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంస్కార భారతి ప్రతినిధులు పిలుపునిచ్చారు.శ్రీధర్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, మన సంస్కృతిని భావితరాలకు అందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని వారు పేర్కొన్నారు.

## తమిళనాడు రాష్ట్ర బిజెపి సమా వేశంలో పాల్గొన్న

డి కే అరుణ



**నారాయణపేట అక్టోబర్ 5 :** తమిళనాడు బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం జరిగిన బిజెపి పదాధికారుల కీలక సమావేశంలో పాలమూరు ఎంపీ,తమిళనాడు సహ ప్రభారి డి కె అరుణ పాల్గొన్నారు. ఈ సమావేశంలో తమిళనాడు బీజేపీ ఇన్చార్జ్ రామ్ మాధవ్, సహ ఇంచార్జ్‌లు ఎంపీ డీకే అరుణ,నిర్మల్ కుమార్ సురాన పాల్గొన్నారు.తొలిసారి తమిళ నాడుకు విచ్చేసిన ప్రభా రి,సహ ప్రభారులకు తమిళ నాడు బీజేపీ అధ్యక్షులు నైనార్ నాగేంద్రన్ స్వాగతం పలికారు, అవంతి శ్రీనివాసం సన్మానించారు. సమావేశంలో తాజా రాజ కీయ పరిణామాలు, పార్టీ బలోపేతంపై తమిళనాడు రాష్ట్ర బీజేపీ నేతలకు డీకే అరుణ దిశానిర్దేశం చేశారు.పార్టీ బలోపేతం కోసం నేతలంతా సమిష్టి కృషితో పని చేయాలని, ప్రజా సమస్యల పై పోరాటం చేస్తూ ప్రజలకు చేరువ కావాలని సూచించారు. రానున్న ఉప ఎన్నికల్లో విజయమే లక్ష్యం గా కార్యాచరణ రూపొందించి ముందుకు వెళ్లాలని సూచించారు.

RNI NO. APBIL/2013/50718
LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్
ద్విభాషా దినపత్రిక
ఎడిటర్: బింకమల్ల రాంరెడ్డి



## నూతన డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం



**మునుగోడు లోకల్ గైడ్ ప్రతినిధి :** మునుగోడు మండలం కొరటికల్ గ్రామంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను గ్రామ సర్పంచి అద్దంకి రామలింగయ్య గ్రామంలో ఉన్న అర్హులైన ప్రజలకు స్మార్ట్ కార్డు లను పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మందుల అంజయ్య వార్డు మెంబర్లు దండు లింగస్వామి పోలేపల్లి సుజాత బోడిశా మల్లేష్ అద్దంకి వెంకన్న బెల్లం యాదయ్య మదిరెడ్డి దేవకమ్మ చింతపల్లి సుశీల జిపిఓ వెంకట్ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## వివో ఏలు కోల్పోయిన వేతనాలు వెంటనే చెల్లించాలి

మాధవి కులం పేరుతో దూషించి దాడి చేసిన అమర్నాథ్ అరెస్టు చేయాలి.

లేకపోతే ఉద్యమాన్ని ఉద్రుతం చేస్తాం.

కలెక్టరేట్ ధర్నాలో ఎండి సలీం హెచ్చరిక.



**నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. లోకల్ గైడ్ :** గుర్రంపొడ్ మండలంలో ఏపిఎం సీసీల నిర్లక్ష్యంతో వివో ఏలు కోల్పోయిన నాలుగు లక్షల 35 వేల వేతనాలను వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి సలీం, యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు చిన్నపాక లక్ష్మీనారాయణ లు డిమాండ్ చేశారు.సోమవారం తెలంగాణ ఐకెపి వివో ఏ ఉద్యోగుల సంఘం (సిఐటియు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ గుర్రంపోడు మండలం లో 2025 సెప్టెంబర్ నుండి 2026 సెప్టెంబర్ వరకు ఏపీఎం సీసీల నిర్లక్ష్యంతో గ్రేడింగ్ కొట్టకపోవడం వల్ల 87 సార్లు నాలుగు లక్షల 35 వేల వేతనాలు కోల్పోయారని వాటిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.వేతనాలు చెల్లించాలని ఎన్నిసార్లు అధికారులకు విన్నవించిన ఫలితం లేకనే 26 రోజులుగా సమ్మె చేస్తున్నారని అన్నారు. ఈ సమ్మెను ఇలానే నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో మరింత పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.చింతపల్లి మండలం పీకే మల్లేపల్లి గ్రామంలో వివోఏ గా పనిచేసిన గనిపెల్లి మాధవి పైన అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ భర్త కుప్పల అమర్నాథ్ కులం పేరుతో దూషించి దాడి చేయడం ఏమైనా చర్యని అతను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. వివో ఎల కు పని భారాన్ని పెంచి ఏపిఎం సీసీలు వేధిస్తున్నారని వేధింపులు ఆపకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించకపోతే జిల్లా వ్యాప్తంగా నిరవధిక సమ్మెకు సిద్ధమవుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చిలుముల దుర్గయ్య, పొడిచేటి సులోచన, సిఐటియు జిల్లా నాయకులు పోలే సత్యనారాయణ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ వెంకన్న, కోశాధికారి చంద్రకళ జిల్లా నాయకులు రేణుక మంత్రాల మంగమ్మ, ఎడవెల్లి పాపయ్య, రమావత్ దశరథ లక్ష్మి సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

## దానం నాగేందర్ ఎన్నిక రద్దు నేపథ్యంలో ఖైరతాబాద్ లో హీటెక్కిన రాజకీయం

-పల్లపు గోవర్ధన్ భారీ ఆత్మీయ సమ్మేళనం

-35 ఏళ్లు మోసి అలసిపోయాం..ఇక మా పల్లకి మేమే మోసుకుంటాం

-పల్లపు గోవర్ధన్ సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్, అక్టోబర్ 05 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ):** ఖైరతాబాద్ నియోజకవర్గంలో రాజకీయ పరిణామాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. ఎమ్మెల్యే దానం నాగేందర్ ఎన్నికను రద్దు చేస్తూ తీర్పు వెలువడిన నేపథ్యంలో వివిధ పార్టీల నేతలు తదుపరి పరిణామాలపై దృష్టి సారించారు. ఈ క్రమంలో ఖైరతాబాద్ సీనియర్ నేత, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కార్యదర్శి పల్లపు గోవర్ధన్ నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం రాజకీయ వర్గాలలో చర్చకు దారితీసింది. బంజారాహిల్స్ లోని బంజారా ఫంక్షన్ హాల్ లో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి నియోజకవర్గానికి చెందిన 158 బస్తీల నుంచి సుమారు 2 వేల మంది ప్రజలతో పాటు వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పల్లపు గోవర్ధన్ మాట్లాడుతూ.. “35 ఏళు మోసి.. మోసి.. మోసి.. అలసి సొలసి ఈరోజు మా పల్లకి మేం మోసుకుంటామని డిసైడ్ అయ్యిర్రు. అది ఖైరతాబాద్ నుంచే స్టార్ట్ అవుతది. ఇక్కడ సుమారు 158 బస్తీల నుంచి వచ్చిన వాళ్లు.. మా వాళ్లందరూ ఉన్నారు. ఆ రుణం తీర్చుకోవడానికి ఏ పనైనా చేస్తా” అని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఖైరతాబాద్ నియోజకవర్గ సమస్యల పరిష్కారంతో పాటు హైందవ శక్తులను ఏకతాటిపైకి తీసుకురావడానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. పేదల అభ్యున్నతే లక్ష్యంగా పని చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బి.ప్రకాష్ గౌడ్, బాల్ రాజ్, సందులు కిష్టయ్య ముదిరాజ్, పిట్ల వెంకటేష్, పిట్ల యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

## పేరుపల్లిలో పారిశుధ్యానికి పెద్దపీట

సైడ్ డ్రెయిన్ల వద్ద బ్లీచింగ్..

ప్రజలకు అవగాహన కల్పించిన సర్పంచ్ బానోత్ పద్మావతి వీరభద్రం



**కారేపల్లి , అక్టోబర్ 5 (లోకల్ గైడ్ న్యూస్):** సింగరేణి మండలం పేరుపల్లి గ్రామపంచాయతీలో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. గ్రామ సర్పంచ్ బానోత్ పద్మావతి వీరభద్రం ఆధ్వర్యంలో సోమవారం శానిటేషన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామపంచాయతీ పరిధిలోని సైడ్ డ్రెయిన్ల వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లించి పారిశుధ్య చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ బానోత్ పద్మావతి వీరభద్రం మాట్లాడుతూ ప్రజలు తమ ఇళ్లతో పాటు ఇంటి పరిసరాలను కూడా పరిశు భ్రంగా ఉంచుకోవాలని సూచించారు. డ్రెయిన్లలో చెత్తాచెదారం వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. పారిశుధ్య పరిరక్షణలో ప్రజలు గ్రామపంచాయతీకి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, మల్టీపర్పస్ సిబ్బంది పాల్గొని పారిశుధ్య పనులు చేపట్టారు.

## ఏకలవ్య పాఠశాలను రాష్ట్రస్థాయిలో నంబర్ వన్‌గా నిలపాలి

పాఠశాల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 5, లోకల్ గైడ్ :** కామారెడ్డి జిల్లా గాంధారి మండలం ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలను రాష్ట్రస్థాయిలో నంబర్ వన్‌గా నిలిపేందుకు సమష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో నిర్వహించిన ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల జిల్లా స్థాయి పాలక మండలి సమావేశంలో పాఠశాల ప్రగతిపై కలెక్టర్ సమీక్షించారు. పాఠశాలలోని సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయి పాలక మండలి సభ్యులు వారానికి ఒకరు చొప్పున పాఠశాలను సందర్శించి, అక్కడి పరిస్థితులపై నివేదిక సమర్పించాలని సూచించారు. పాఠశాలలో చేపడుతున్న ఇంజినీరింగ్ పనులను ఈ నెలలోనే పూర్తి చేస్తామని డీఈఈ సంపత్ కుమార్ కలెక్టర్‌కు వివరించారు. తదుపరి పాలక మండలి సమావేశాన్ని జనవరిలో నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి చందర్ నాయక్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి పి. చంద్రశేఖర్, ప్రాంతీయ సమన్వయ అధికారి గంగారాం నాయక్, జిల్లా సంక్షేమ అధికారి సౌజన్య, ప్రధానాచార్యులు శ్యామలదేవి, అమర్ సింగ్, మాధవరావు, రవీంద్ర కుమార్, సంతోష్ శుక్లా తదితరులు పాల్గొన్నారు.

# ధారూర్‌లో గంజాయి అడ్డాలు మారిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు!

- మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందనే ప్రభుత్వం జాప్యం చేస్తోంది
- పూర్తయిన ఇళ్లను వెంటనే అర్హులై పేదలకు కేటాయించాలి

కాంగ్రెస్ నాయకులకు పేదవాళ్లో కనిపించడం లేదా హెచ్చరించారు

వికారాబాద్ జిల్లా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్





**వికారాబాద్ (లోకల్ గైడ్): :** వికారాబాద్ నియోజకవర్గ పరిధిలోని ధారూర్ మండల కేంద్రంలో నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను తక్షణమే అర్హులైన పేదలందరికీ కేటాయించాలని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మెతుకు ఆనంద్ డిమాండ్ చేశారు. ధారూర్‌లోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయాన్ని ఆయన నాయకులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఈ ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన 90 శాతం పనులు పూర్తయ్యాయని గుర్తుచేశారు. కేవలం మిగిలిన 10 శాతం పనులను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయడంలో ప్రస్తుత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే ఉద్దేశంతోనే ఇళ్ల కేటాయింపులో కావాలని జాప్యం చేస్తున్నారని విమర్శించారు.పాలకులు, అధికారుల అలసత్వం కారణంగా ఏళ్లుగా ఈ ఇళ్లు నిరుపయోగంగా పడి ఉన్నాయని, ఫలితంగా ఇవి మందుబాబులకు, గంజాయి బ్యాచ్‌లకు అడ్డాలుగా మారుతున్నాయని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించాలని డిమాండ్ చేశారు.

# గుండె ఆరోగ్యం కోసం వేళకు తినండి..

ఉదయం 8 లోపు బ్రేక్ ఫాస్ట్, రాత్రి 8 లోపు డిన్నర్ తో

హార్ట్ ఎటాక్ రిస్క్ తగ్గుతుంది..డాక్టర్ సుకుమార్

ఆలస్యంగా తింటే గుండె జబ్బుల ముప్పు..ప్రజలు పాటించాల్సిన

-జాగ్రత్తలు వివరించిన..డాక్టర్ సుకుమార్




**శేరిలింగంపల్లి, అక్టోబర్ 05 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ):** ఆరోగ్యమే మహాభాగ్యం అని పెద్దలు అంటారు. కరోనా తర్వాత అందరికీ ఆరోగ్యం విలువ బాగా అర్థమైంది. ఆరోగ్యంగా ఉండాలంటే తీసుకునే ఆహారమే ప్రధానం. అయితే ఆహారంలో పోషకాల నాణ్యతతో పాటు, తినే సమయం కూడా చాలా ముఖ్యమని తాజా అధ్యయనం తేల్చింది. బార్సిలోనా ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ హెల్త్ శాస్త్రవేత్తలు ఫ్రాన్స్‌లో 1,03,389 మందిపై అధ్యయనం నిర్వహించారు. రోజులో మొదటి భోజనం ఆలస్యం చేసే ప్రతి అదనపు గంట హృదయ సంబంధ వ్యాధుల ప్రమాదాన్ని 6 శాతం పెంచుతుందని, రాత్రి 9.00 గంటల తర్వాత తినేవారికి గుండె జబ్బుల ప్రమాదం 28 శాతం ఎక్కువగా ఉంటుందని ఈ అధ్యయనంలో తేలింది. ఈ అధ్యయనం నేపథ్యంలో ప్రముఖ డాక్టర్ సుకుమార్ ప్రజలకు పలు జాగ్రత్తలు సూచించారు. ఉదయం బ్రేక్ ఫాస్ట్ ను ఉదయం 8.00 గంటల లోపు, రాత్రి డిన్నర్ ను రాత్రి 8.00 గంటల లోపు తినడం వల్ల గుండె ఆరోగ్యం సేఫ్ గా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. “డాక్టర్ సుకుమార్ సూచించిన జాగ్రత్తలు” ‘బ్రేక్ ఫాస్ట్ మానొద్దు’ చాలామంది ఉదయం బ్రేక్ ఫాస్ట్ మానేసి నేరుగా లంచ్ చేస్తారు. అలా చేయడం గుండెకు చాలా ప్రమాదం. ఉదయం లేచిన గంటలోపు అల్పాహారం తీసుకోవాలి. “రాత్రి త్వరగా తినండి” రాత్రి 8.00 గంటల లోపు భోజనం పూర్తి చేయాలి. ఆలస్యంగా తినడం వల్ల జీర్ణక్రియపై ఒత్తిడి పడి కొలెస్ట్రాల్, బీపీ పెరుగుతాయి. “నైట్ షిఫ్ట్ వారికి” షిఫ్ట్ ప్రారంభానికి 2-3 గంటల ముందు ప్రొటీన్, ఫైబర్ ఉన్న సమతుల్య ఆహారం తీసుకోవాలి. షిఫ్ట్ మధ్యలో జంక్ ఫుడ్ కు దూరంగా ఉండాలి. “నీరు, కెఫిన్” పుష్కలంగా నీరు తాగాలి. కాఫీ, టీలు ఎక్కువగా తాగవద్దు. షిఫ్ట్ ముగియడానికి 4.00 నుంచి 8.00 గంటల ముందే కెఫిన్ కు దూరంగా ఉండాలి, లేకపోతే నిద్ర పాడై గుండెపై ప్రభావం పడుతుంది. “సమయపాలన” ప్రతిరోజూ ఒకే సమయానికి తినడం అలవాటు చేసుకోవాలి. మొదటి భోజనం, చివరి భోజనం మధ్య కనీసం 12 గంటల గ్యాప్ ఉండేలా చూసుకోవడం మంచిది. “భోజనం తర్వాత వెంటనే నిద్రపోరాదు” భోజనం చేసిన వెంటనే నిద్రపోరాదు. భోజనం చేసిన తర్వాత కనీసం రెండు గంటల తర్వాతే నిద్రపోవాలి. భోజనం అయిన వెంటనే కనీసం 15 నిమిషాలు వాకింగ్ చేయడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడి గుండెపై ఒత్తిడి తగ్గుతుందని డాక్టర్ సుకుమార్ సూచించారు. సకాలంలో తినడం, మంచి ఆహారం తీసుకోవడం, రోజూ వ్యాయామం చేయడం వల్ల గుండె జబ్బులను నివారించవచ్చని ఆయన తెలిపారు.

## సిద్దిపేట కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ అమలు

ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలకు ముందస్తు అనుమతి తప్పనిసరి.. డీజే సౌండ్‌పై నిషేధం



**సిద్దిపేట, అక్టోబర్ 5 (లోకల్ గైడ్ న్యూస్):** సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్‌ను అమలు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ ఎస్. రష్మీ పెరుమాళ్, ఐపీఎస్ తెలిపారు. సోమవారం ఉదయం 6 గంటల నుంచి అక్టోబర్ 20 ఉదయం 6 గంటల వరకు ఈ నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు.కమిషనరేట్ పరిధిలో ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని తెలిపారు. ఆయా కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటే ముందుగా సంబంధిత ఏసీపీ అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలని సూచించారు. బంద్‌ల పేరుతో సంస్థలు, కార్యాలయాలను బలవంతంగా మూసివేయాలని ఒత్తిడి చేయడం, బెదిరింపులకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.డీజే సౌండ్‌పై నిషేధం: శబ్ద కాలుష్యాన్ని నియంత్రించేందుకు కమిషనరేట్ పరిధిలో భారీ శబ్దాలతో కూడిన డీజే సౌండ్ వినియోగంపై కూడా నిషేధాజ్ఞలు విధించారు. చిన్నారులు, వృద్ధులు, రోగులు, విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. మైక్‌సెట్ వినియోగం తప్పనిసరి అయిన సందర్భాల్లో సంబంధిత డివిజన్ ఏసీపీ అనుమతి తీసుకోవాలని సూచించారు.నిబంధనలు ఉల్లంఘించి డీజే సౌండ్ వినియోగించినా, అనుమతి లేకుండా నిషేధిత కార్యక్రమాలు నిర్వహించినా సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు.

## భూ భారతి రీ-సర్వేను పారదర్శకంగా, ఖచ్చితత్వంతో నిర్వహించాలి

కేశవాపూర్‌లో రీ-సర్వే ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్ కె. హైమావతి



**సిద్దిపేట, అక్టోబర్ 5 (లోకల్ గైడ్ న్యూస్):** అక్కన్నపేట మండలం కేశవాపూర్ గ్రామంలో కొనసాగుతున్న భూ భారతి రీ-సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ కె. హైమావతి సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో భూ భారతి రీ-సర్వే చేపట్టిందని తెలిపారు. ముందుగా రెవెన్యూ, సర్వే అధికారులు గ్రామ సరిహద్దులను గుర్తించి సర్వే పూర్తి చేయాలని, ప్రభుత్వ భూములను గుర్తించి వాటికి స్పష్టమైన హద్దులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.రీ-సర్వే ప్రక్రియను పారదర్శకంగా, ఖచ్చితత్వంతో, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని అధికారులకు సూచించారు. సర్వే సమయంలో భూమి విస్తీర్ణం, సర్వే నంబర్లు, హద్దులు, పట్టా వివరాలను సంబంధిత రెవెన్యూ రికార్డులతో సరిపోల్చి నమోదు చేయాలని తెలిపారు. సర్వేకు సంబంధించిన ప్రతి వివరాన్ని రెవెన్యూ రికార్డుల్లో పొందుపరచాలని తహసీల్దార్‌ను ఆదేశించారు.రీ-సర్వేను వేగంగా, అత్యంత పారదర్శకంగా పూర్తి చేసేందుకు రూ.6 నుంచి రూ.7 లక్షల వ్యయంతో అధునాతన రోవర్ యంత్రాలను కొనుగోలు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. వీటి ద్వారా సర్వే ప్రక్రియ మరింత వేగంగా పూర్తవుతుందని పేర్కొన్నారు.అనంతరం రీ-సర్వే ప్రక్రియపై రైతులతో కలెక్టర్ మాట్లాడారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించేలా ప్రభుత్వం చేపడుతున్న రీ-సర్వేకు రైతులు, భూ హక్కుదారులు అధికారులకు అన్ని విధాలా సహకరించాలని కోరారు.కలెక్టర్ వెంట ఆర్డీఓ రామ్మూర్తి, తహసీల్దార్, సర్వే అధికారులు, గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో 109 ఫిర్యాదులు స్వీకరించిన

జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్





**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 5 లోకల్ గైడ్ :** కామారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. వివిధ సమస్యలకు సంబంధించి మొత్తం 109 ఫిర్యాదులు, వినతులు అందాయి.ప్రజలు సమర్పించిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులకు పంపించి, నిబంధనల ప్రకారం సమగ్రంగా పరిశీలించి అర్హత మేరకు సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేకుండా నిర్ణీత గడువులో చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా పరిశీలించి, పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతోపనిచేయాలని సూచించారు.ప్రజావాణికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, వారి సమస్యలను సానుకూలంగా విని నిబంధనల పరిధిలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్ వై గిరి, డిప్యూటీ శిక్షణ కలెక్టర్ రవితేజ, డీఆర్ఓ పాండు, సీఈఓ చందర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజావాణికి జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలి

# జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

గైర్హాజరైన అధికారులకు షోకాజ్ నోటీసుల జారీకి ఆదేశం

ముందస్తు అనుమతి తప్పనిసరి

ప్రజావాణిలో 103 ఫిర్యాదుల స్వీకరణ





**వికారాబాద్ (లోకల్ గైడ్ ప్రతినిధి):** వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించే ‘ప్రజావాణి’ కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఆదేశించారు. ముందస్తు అనుమతి లేకుండా గైర్హాజరైన అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశం చారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులు, వినతులపై అధికారులు తక్షణమే స్పందించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిచ్చే ప్రజావాణికి అధికారులు నిర్ణీత సమయానికి హాజరై ప్రజల సమస్యలను స్వయంగా స్వీకరించాలని స్పష్టం చేశారు. ఏవైనా అత్యవసర కారణాల వల్ల గైర్హాజరు కావాల్సి వస్తే, ముందస్తు అనుమతి తీసుకోవడంతో పాటు తమ శాఖకు సంబంధించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు.ఈ సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 103 ఫిర్యాదులు వచ్చినట్లు కలెక్టర్ వెల్లడించారు. స్వీకరించిన ప్రతి అర్జీని సంబంధిత అధికారులు సమగ్రంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. అంతేకాకుండా, ఫిర్యాదుల పరిష్కార పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.అలాగే, ప్రతి సోమవారం మండల స్థాయిలో జరిగే ప్రజావాణి ఫిర్యాదులపై మండల స్పెషల్ అధికారులు పూర్తి బాధ్యత వహించాలని, స్వీకరించిన ఫిర్యాదుల జాబితాను క్రమం తప్పకుండా సమర్పించాలని ఆదేశించారు. దీంతో పాటు అధికారులతో సహా సిబ్బంది అందరూ “మీ ప్రమాణం” యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటాచారి, జడ్పీ సీఈఓ సుధీర్, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్‌తో పాటు పలువురు జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy

లోకల్ గైడ్ ద్విభాషా దినపత్రిక




## దశాబ్దాల కలకు దశాబ్ది..
## సిద్దిపేట జిల్లా పదేళ్ల పండుగను ఘనంగా నిర్వహిద్దాం

జిల్లా ఏర్పాటు తర్వాత సిద్దిపేట రూపురేఖలు మారాయి: మాజీ మంత్రి హరీశ్‌రావు

**సిద్ధిపేట, అక్టోబర్ 5 (లోకల్ గైడ్ న్యూస్):** సిద్ధిపేట జిల్లా ఏర్పాటై పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా "దశాబ్దాల కలకు.. దశాబ్ది" పేరుతో జిల్లా పండుగను ఘనంగా నిర్వహించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపునిచ్చారు. సోమవారం సిద్ధిపేట క్యాంపు కార్యాలయంలో పట్టణ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.సిద్ధిపేట జిల్లా ఏర్పాటు ఎన్నో దశాబ్దాల కల అని, 2016 అక్టోబర్ 11న సిద్దిపేట జిల్లా ఆవిర్భావం జరిగిందని హరీశ్‌రావు తెలిపారు. 2026 అక్టోబర్ 11తో జిల్లాకు పదేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో "సిద్ధిపేట జిల్లా పండుగ ఉత్సవంలా చేద్దాం" అని అన్నారు. జిల్లా ఏర్పాటుకు ముందు, అనంతరం జరిగిన అభివృద్ధిని భావితరాలకు తెలియజేసేందుకే పదేళ్ల పండుగ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.జిల్లా ఏర్పాటు తర్వాత కలెక్టరేట్, పోలీస్ కమిషనరేట్ కార్యాలయం, మెడికల్ కాలేజీ, సుడా తదితర అనేక ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటయ్యాయని తెలిపారు. దీంతో సిద్ధిపేట ప్రజలకు వ్యయప్రయాసలు తగ్గి, ప్రభుత్వ కార్యాలయాలు, అధికారులు ప్రజల ముంగిట్లోకి వచ్చారని అన్నారు. కానిస్టేబుల్ శిక్షణ, ఉపాధ్యాయుల కౌన్సెలింగ్, పదో తరగతి పరీక్షల వాల్యుయేషన్ తదితర విషయాల్లో గతంలో ఎదురైన ఇబ్బందులు తొలగిపోయాయని చెప్పారు.సిద్ధిపేట అభివృద్ధిలో ఆదర్శంగా నిలిచిందని, గోదావరి జలాలు సిద్ధిపేటకు చేరడం, రైలు సౌకర్యం రావడం, వివిధ విద్యాసంస్థలు ఏర్పాటు కావడం వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని హరీశ్‌రావు పేర్కొన్నారు.సిద్ధిపేటలో మంజూరైన వెటర్నరీ కళాశాలను ఇతర ప్రాంతానికి తరలించారని ఆరోపించిన ఆయన, తిరిగి సిద్ధిపేటకు వెటర్నరీ కళాశాలను తీసుకొస్తామని అన్నారు. భవిష్యత్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, సిద్ధిపేట అభివృద్ధిని మరింత వేగంగా కొనసాగిస్తామని పేర్కొన్నారు.జిల్లా పదేళ్ల పండుగలో భాగంగా పట్టణంలోని అన్ని వార్డుల్లో మహిళలు తమ ఇళ్ల ముందు ముగ్గులు వేసి వేడుకల్లో భాగస్వాములు కావాలని కోరారు. బతుకమ్మ పండుగ సందర్భంగా కోమటి చెరువు వద్ద ఫుడ్ ఫెస్టివల్, లేజర్ షో నిర్వహించనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 11న జరిగే బహిరంగ సభకు పట్టణం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు, కార్యకర్తలు తరలిరావాలని హరీశ్‌రావు పిలుపునిచ్చారు.

## RTI ACT.2005 జిల్లా మానిటరింగ్ సభ్యులను నియమించాలని DRO వినతి పత్రం



**నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి లోకల్ గైడ్ :** సమాచారకు వికాస సమితి ఆధ్వర్యంలో డిఆర్ఓ దశరథ గారికి వ్యవస్థాపక అధ్యక్షులు యర్రమద కృష్ణారెడ్డి జిల్లా అధ్యక్షులు బైరు సైదులు గౌడ్ సమాచార హక్కు చట్టం జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యులను నియమించాలని అక్టోబర్ 12 సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చిన రోజు సందర్భంగా వారోత్సవాలు నిర్వహించాలని కోరడం జరిగింది కార్యక్రమంలో ఉపాధ్యక్షులు సతీష్ కుమార్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిత్ర శ్రీనివాస్ డివిజన్ అధ్యక్షులు కలీం రామకృష్ణ తిప్పర్తి మండల అధ్యక్షులు కంటేకంపు గణేష్ జయంత్ శ్రీను తదితరులు పాల్గొన్నారు

## గిరిజనుల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా ఎస్టీ కమిషన్ చర్యలు అభినందనీయం: బింగి స్వామి



**లోకల్ గైడ్ హైదరాబాద్ అక్టోబర్ 5 :** తెలంగాణ జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బింగి స్వామి ఎస్టీ జాతీయ కమిషన్ సభ్యుడు జాతోతు హుస్సేన్ నాయక్‌ను హైదరాబాద్‌లోని దిల్‌కుష్ గెస్ట్‌హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారికి జరుగుతున్న అన్యాయాలు, వాటి పరిష్కారానికి ఎస్టీ జాతీయ కమిషన్ తీసుకుంటున్న చర్యలపై చర్చించారు.గిరిజనుల హక్కుల పరిరక్షణకు ఎస్టీ జాతీయ కమిషన్ చేస్తున్న కృషిని బింగి స్వామి అభినందించారు. గిరిజనుల సమస్యలను పరిష్కరించడంలో కమిషన్ స్పందిస్తున్న తీరు అభినందనీయమని పేర్కొన్నారు. గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు పూర్తిస్థాయిలో అమలయ్యేలా మరింత చొరవ చూపాలని కోరారు.రాష్ట్రంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, బాధితులకు సకాలంలో న్యాయం అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని బింగి స్వామి అన్నారు. గిరిజనుల హక్కులు, సంక్షేమం, సామాజిక న్యాయం కోసం కమిషన్ చేస్తున్న కృషికి తమ పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు మిట్టపల్లి సాగర్, ఉద్యమకారుడు బుడిగే స్వామి తదితరులు పాల్గొన్నారు.

## హెచ్ సీయూ బస్సు నిలయంలో ఆర్టీసీ కార్మిక సంఘం ఎన్నికల ప్రచారం

-గౌరవ అధ్యక్షుడిగా రాగం నాగేందర్ యాదవ్ ఏకగ్రీవ ఎన్నిక

అక్టోబర్ 9న జరిగే ఎన్నికల్లో బాణం గుర్తుకే ఓటు వేసి గెలిపించాలి..

కార్పొరేటర్ రాగం నాగేందర్ పిలుపు




**శేరిలింగంపల్లి, అక్టోబర్ 05 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ):** హెచ్ సియు బస్సు నిలయంలో తెలంగాణ ఆర్టీసీ కార్మిక సంఘం ఎన్నికల ప్రచార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో హెచ్ సీయూ నిలయ సంఘ సభ్యులు శేరిలింగంపల్లి ప్రజా ప్రతినిధి రాగం నాగేందర్ యాదవ్ ను ఏకగ్రీవంగా గౌరవ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ నగర పాలక అధ్యక్షుడు బొంతు రామ్మోహన్, శేరిలింగంపల్లి మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ హాజరయ్యారు. వీరితో పాటు టీఎంయూ ప్రధాన కార్యదర్శి ఈ. అశ్వత్థామ రెడ్డి, టీడబ్ల్యూయూ ఆర్టీసీ అధ్యక్షుడు మొగుల్ల రాజిరెడ్డి, టీఎంయూ అధ్యక్షుడు శంకర్, డిపో చైర్మన్ బాలయ్య, డిపో కార్యదర్శి వై.ఎస్. బసప్ప, డిపో అధ్యక్షుడు టి. మనోహర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ..కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న తెలంగాణ ఆర్టీసీ కార్మిక సంఘాన్ని గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. 2026 అక్టోబర్ 9న జరగనున్న సంఘ ఎన్నికల్లో బాణం గుర్తుకు ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేసి అన్ని విధాలుగా ఆదుకుంటుందని తెలిపారు. అనంతరం కార్మికులందరూ బాణం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొండల్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, కుమార్, బీమన్ శ్రీను, కార్మిక సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు నాగిరెడ్డి, ముఖ్య సలహాదారులు మహేష్ గౌడ్, ప్రసాద్, కోశాధికారి రవి కుమార్, కమిటీ సభ్యులు రవి, మల్లేశం, ఎం.శ్రీశైలం, నర్సింలు, శ్రీశైలం, అనిల్, భీమయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం అశోక్ సార్ దే.

గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రధాన పార్టీలకు ముచ్చమటలు పట్టించిన అశోక్ సార్.

మరోసారి బరిలో అశోక్ సార్.



**నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. లోకల్ గైడ్. :** గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఫలితాలు తారుమారు చేసిన పాలకూరి అశోక్ సార్ ఈసారి ఎన్నికల్లో విజయం నాదేనని ధీమా వ్యక్తం చేశారు.సోమవారం నల్లగొండ పట్టణంలోని ఎస్ పి ఆర్ గార్డెన్స్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఖమ్మం, వరంగల్, నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలుస్తున్నట్టు ప్రకటించారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో 30 వేల మొదటి ప్రాధాన్యత ఓటు 90 వేల రెండో ప్రాధాన్యత ఓటు సాధించి బిఆర్ఎస్ ఓడిపోవడానికి తానే కారణమయ్యానని, ప్రధాన పార్టీలకు ముచ్చమటలు పట్టించానని అన్నారు. 90% పైగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీలను కాదని కాంగ్రెస్ పార్టీ రెండు ఎమ్మెల్సీ స్థానాలను రెడ్డి సామాజిక వర్గానికి కేటాయించి తెలంగాణ పిసిసి రెడ్డి కాంగ్రెస్ గా మారిందని అన్నారు. బిఆర్ఎస్ సైతం ఓసీలకే టికెట్లు కేటాయించడానికి ప్రయత్నం చేస్తుందని అదే జరిగితే ఆ రెండు పార్టీలను, బీసీలు 100 శాతం బొంద పెట్టడం ఖాయమని అన్నారు. ఓట్లు మావి సీట్లు మీవా అని ప్రశ్నించారు. రెండు పార్టీలు హైబ్రిడ్ మొక్కలను తెర మీదకి తెస్తున్నాయని, జన సంబంధం లేని వారు, తెలంగాణ అస్తిత్వం తెలియని వారు, డబ్బుల సంచులతో పోటీ చేయాలని చూస్తున్నారని అన్నారు.కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ లో 42 శాతం స్థానాలు బీసీలకు కేటాయిస్తామని హామీ ఇచ్చి అసెంబ్లీలో కోర్టుల్లో నాటకలాడి బీసీలను నిండా ముంచిందని, ఇప్పుడు బీసీలకు సీట్లు కేటాయించడానికి అవకాశం ఉన్న ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు.10% కూడా లేని ఓసీలు 70 శాతం అసెంబ్లీని కబ్జా పెట్టారని అన్నారు. గత 15 ఏండ్లుగా నిరుద్యోగుల కోసం, తెలంగాణ సమాజం కోసం పనిచేసానని అటు బిఆర్ ఎస్ ఇటు కాంగ్రెస్ రెండు పార్టీలు 18 కేసులు పెట్టి ఎన్ని ఇబ్బందులకు గురి చేసిన నిరుద్యోగుల పక్షమే తప్ప ఏ ప్రభుత్వానికి అంట కాగలేదని, ప్రాణాలు ఫణంగా పెట్టి మూడు సార్లు ఆమరణ నిరాహార దీక్షలు చేసానని, లక్షల మందికి తన ఆన్‌లైన్ పాఠాల ద్వారా తక్కువ ఫీజుతో, ఉచితంగా పాఠాలు భోదించానని అన్నారు. నిరుద్యోగుల పక్షాన నడి రోడ్డుపై నిలబడి పోలీసుల దిగ్బంధాలు ఛేధించుకుంటూ, నిత్యం కోర్టు మెట్లు ఎక్కుతు నిలబడి గొంతు ఎత్తానని నిరుద్యోగులు, బిసిలు, ఎస్సి, ఎస్టీ, మైనార్టీలు అండగా నిలబడతారని అన్నారు.ఏడాదిలోగా రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని కేవలం 13 వేల ఉద్యోగాలు ఇచ్చి 70 వేల ఉద్యోగాలు ఇచ్చామని అబద్ధాలు చెబుతుందని, నిరుద్యోగులను నిండా ముంచిన పార్టీ కాంగ్రెస్ అని విమర్శించారు. రెండు గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఉద్యోగులు కాంగ్రెస్ పార్టీని పాతంలోకి తొక్కుతారని విమర్శించారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నాన్ లోకల్ కబ్జాలో ఉందని, పరిశ్రమలు, ఐటీ సెక్టార్, పెట్టుబడులు,ఉద్యోగాలు 80 శాతం ఇప్పటికే ఆంధ్రుల గుప్పెట్లో ఉన్నాయని వాపోయారు. శివసేన స్ఫూర్తితో నాన్ లోకల్ గో బ్యాక్ నినాదంతో ఉద్యమం చేపట్టబోతున్నట్లు ప్రకటించారు. తెలంగాణ బిడ్డలకు ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల కల్పన తన ఎన్నికల నినాదంని ప్రకటించారు. గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3 ఉద్యోగాల ప్రకటన ఇచ్చిన తర్వాతే ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. పవర్ సెక్టార్ లో 5300 ఉద్యోగాలతో ఆర్థిక శాఖ ఆమోదం పొందిన ఇంతవరకు నోటిఫికేషన్ ఇవ్వలేదని అన్నారు. 25 వేల ఉద్యోగాలతో మెగా డిఎస్సిని ఉద్యోగ క్యాలెండర్లో ప్రకటించినా ఇప్పటివరకు దిక్కు లేదన్నారు.సర్కారు బడిని బాగు చేస్తామని రేవంత్ రెడ్డి ఊకదంపుడు ఉపన్యాసాలు తప్ప ఏమీ లేదన్నారు. 33 జిల్లాలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు ఏర్పాటు చేసి నిరుద్యోగులను ఉద్యోగులుగా మార్చాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు పిఆర్సి లేదు, 6 డి ఏ లు పెండింగ్లో పెట్టారని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు పెంచక ఏజెన్సీల పేరుతో ప్రభుత్వంలోని పెద్దలు రక్తం తాగుతున్నారని విమర్శించారు.పేరుకే తెలంగాణ రాష్ట్రం వచ్చిందని, తెలంగాణ అస్తిత్వంను ఆంధ్రుల గుప్పెట్లో పెట్టారని భౌగోళిక తెలంగాణ తప్ప సామాజిక తెలంగాణ సాధ్యం కాలేదని, తెలంగాణ ఉన్నత కులాల చేతిలో బందీ అయ్యిందని, ఎస్సీ ఎస్టీ, బిసి వర్గాల్లో చైతన్యం ఓటు రూపంలో వచ్చినప్పుడే సాధ్యమవుతుందని అన్నారు. బీసీలందరూ ఐక్యమైనప్పుడే మనకు న్యాయం జరుగుతుంది. ఈ ఊడిగం ఇంకా ఎన్నాళ్లు అని ప్రశ్నించారు. మేమెంతో మాకంత నినాదంతో చేతులు బిగించాల్సిన అవసరం ఉందన్నారు. బడ్జెట్లో విద్యకు 18 శాతం నిధులు కేటాయించాలని విద్యా, వైద్యం పూర్తిగా ఉచితంగా అందినప్పుడే సామాజిక తెలంగాణ సాధ్యమైనట్లుగా భావించాలని అన్నారు. ఈ సమావేశంలో కె.వి గౌడ్, ప్రణీత్, నవీన్ రెడ్డి, కిరణ్, రవి, కొండల్, మహేష్, సురేష్, సంధ్య, ఇందు తదితరులు పాల్గొన్నారు.

## శాంతిఖని గనిలో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి...



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్) :** బెల్లంపల్లి శాంతిఖని గనిలో సింగరేణి యాజమాన్యం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎఐటియుసి నాయకులు డిమాండ్ చేశారు.ఎఐటియూసి ఆధ్వర్యంలో కార్మికుల సమక్షంలో గని కార్మికుల సమస్యలపై గని మేనేజర్ సంజయ్ కుమార్ సిన్హా కు పిట్ సెక్రటరీ రత్నం ప్రవీణ్ అధ్యక్షతన సోమవారం వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేశ్,మైన్ ఇంచార్జి మంతెన రమేష్ లు మాట్లాడుతు కోల్ ఇండియాలోని కార్మికులందరికీ పిఎల్ఆర్ బోనస్ సాధించడంలో పెద్దన్న పాత్ర పోషించిన ఘనత ఏఐటీయూసీ సంఘానికే దక్కుతుందని అన్నారు.అదేవిధంగా పిఎల్ఆర్ బోనస్ సాధించడంలో కీలక పాత్ర పోషించిన కీర్తిశేషులు టిబి విటల్ రావు చిరస్మరణీయుడు అని అన్నారు.ఆయన రష్యా పర్యటన సందర్భంగా అక్కడి కార్మికులకు అందుతున్న బోనస్ విధానాన్ని పరిశీలించి,భారతదేశంలోని కార్మికులకు కూడా బోనస్ అందేవిధంగా పార్లమెంటులో చట్టం తీసుకురావడానికి కృషి చేశారని తెలిపారు.బొగ్గు గని కార్మికులకు సుమారు1965 సంవత్సరం నుంచి బోనస్ చట్టం అమలులోకి వచ్చిందని,ప్రారంభంలో 300నుండి మొదలైన బోనస్ ప్రస్తుతం 2025,26సంవత్సరానికి1లక్ష10వేల 250వరకు కార్మికులకు అందుతున్న విషయాన్ని కార్మికులు గుర్తించాలని అన్నారు.అదేవిధంగా సంస్థకు వచ్చే లాభాలను కార్మికులతో పంచుకోవాలనే డిమాండ్‌ను కూడా ఏఐటీయూసీ నిరంతరం ముందుకు తీసుకువచ్చిందని అన్నారు.సంస్థకు నష్టాలు వస్తే కార్మికుల వేతనాల్లో కోత విధిస్తామని ప్రభుత్వం చెప్పడం సరైన విధానం కాదని,సంస్థకు లాభాలు వస్తే ఆ లాభాల్లో కార్మికులకు కూడా వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారని గుర్తు చేశారు.అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సింగరేణి సంస్థకు లాభాలు వస్తే10శాతం లాభాలను కార్మికులకు వాటాగా ఇస్తామని ప్రకటించి,ఇచ్చిన మాటకు కట్టుబడి కార్మికులకు లాభాల వాటా అందించిన విషయం సింగరేణి కార్మికులందరికీ తెలిసిందేనన్నారు.కార్మికులకు ఆర్థిక ప్రయోజనాలు,బోనస్‌లు,లాభాల వాటా సాధించి పెట్టడంలో ఏఐటీయూసీ పోషించిన పాత్రను ఓర్వలేని కొన్ని సంఘాలు ఏఐటీయూసీపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు.కార్మిక ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న సంఘాల వైఖరిని కార్మికులు ప్రశ్నించాలని పిలుపునిచ్చారు.ఈ సంవత్సరం సింగరేణి సంస్థకు వచ్చిన వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించి,అందులో 40శాతం వాటాను కార్మికులకు అందజేయాలని,కార్మికులకు అవసరమైన రక్షణ పరికరాలు,పనిముట్లు,భద్రతా సామగ్రిని వెంటనే అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు.తెలంగాణ జెన్కో సంస్థ నుండి సింగరేణికి రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలి తెలంగాణ జెన్కో నుండి రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తు ఈనెల 9న హైదరాబాద్‌లోని జెన్కో హెడ్ ఆఫీస్ ఎదుట సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ముట్టడి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమానికి సింగరేణి కార్మికులు అత్యధిక సంఖ్యలో హాజరై సంస్థకు రావాల్సిన బకాయిలను సాధించడంతో పాటు సింగరేణి సంస్థను మరింత లాభాల బాటలో నడిపించేందుకు తమ వంతు పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.కార్మికుల సమస్యల పరిష్కారం,సంస్థ ఆర్థిక పరిరక్షణ,కార్మికుల హక్కుల సాధన కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రత్నం ఇల్లయ్య,మహంకాళి సంతోష్,సారయ్య,రాజయ్య,రామకృష్ణ,రాజ్ కుమార్,వెంకటేష్,బుచయ్య,శ్రీకాంత్,రామచందర్,ఎస్ కె బాబా,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ చీరల పంపిణి

ఆడబిడ్డలను కోటీశ్వరులను చేసే దిశగా అడుగులు

మహిళామణులకు అండగా రేవంతన్న ప్రభుత్వం

ప్రజాప్రభుత్వంలో మహిళా సంక్షేమానికి పెద్దపీట

రూ. 6.94 కోట్ల బ్యాంకు లింకేజి రుణాల చెక్కు పంపిణీ

రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు శ్రీ. చింతకుంట విజయరమణ రావు






**పెద్దపల్లి జిల్లా అక్టోబర్ 05 (లోకల్ గైడ్) :** సుల్తానాబాద్ పట్టణ కేంద్రంలోని యశోద నరహరి ఫంక్షన్ హాల్లో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా స్థానిక నాయకులతో కలిసి సుల్తానాబాద్ పట్టణ మహిళామణులకు ఇందిరమ్మ చీరలను పంపిణి చేసి



అనంతరం సుల్తానాబాద్ మహిళా సంఘాల వారికి బ్యాంకు లింకేజి రుణాల కింద రూ.6.94 కోట్ల చెక్కును అందజేసిన రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ కోటిమంది మహిళలను కోటీశ్వరులు చేసే దిశగా రేవంత్ సర్కార్ అడుగులు వేస్తోందన్నారు. గత ప్రభుత్వాల హయాంలో మహిళల అభివృద్ధి శూన్యం అని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుండి మహిళలను కోటీశ్వరులను చేయాలనే గట్టి సంకల్పంతో ముందుకు వెళ్తాందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో జరిగిన అభివృద్ధి పనులను ప్రజలు గమనిస్తున్నారని గుర్తు చేశారు. జిల్లా కేంద్రంలో మహిళా సోదరీమణుల సౌకర్యార్థం రూ. 5 కోట్లతో ఇందిరా మహిళా శక్తి భవనం నిర్మాణం జరిగిందని, భవనం ప్రారంభానికి సిద్ధంగా ఉందని తెలిపారు. మహిళా సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం ఎల్లప్పుడూ సహకరిస్తుందని పేర్కొన్నారు. మహిళామణులను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా మొన్న సుల్తానాబాద్ మండలం భూపతిపూర్ గ్రామంలో స్వశక్తి మహిళా సంఘాల మహిళతో నడపబడే జిల్లా చైతన్య పెట్రోల్ పంపును ప్రారంభించుకోవడం జరిగిందని గుర్తు చేశారు. అలాగే పెద్దపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న మహిళా సంఘాలకు పెట్రోల్ బంకులు, ఇందిరమ్మ బస్సులు, ఇందిరా మహిళా క్యాంటీన్ ల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. మహిళల ఆత్మగౌరవాన్ని మరింత పెంచే దిశగా నాణ్యమైన ఇందిరమ్మ చీరలను పంపిణీ చేస్తున్నామని ప్రభుత్వ విప్ తెలిపారు. సుల్తానాబాద్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నానని ఈ సందర్భంగా అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్,మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, వైస్ చైర్మన్ అంతటి పుష్పలత, మున్సిపల్ కమిషనర్ రమేష్,మార్కెట్ చైర్మన్ మినపల ప్రకాష్ రావు , సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, కౌన్సిలర్లు గాజుల రాజమల్లు, ఉట్ల వరప్రది, చింతల రాజు, బాకం సాయి, గా దాసు మంజుల రవీందర్, అబ్బయ్య గౌడ్, తిరుపతి,, పలు గ్రామాల సర్పంచ్ లు, ఉపసర్పంచ్ లు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు మహిళా సంఘాలు మహిళా సోదరిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి.. బాధితులకు భరోసా

18 మంది ఫిర్యాదుదారుల సమస్యలను నేరుగా విన్న జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు, ఐపీఎస్

ఫిర్యాదులపై తక్షణ చర్యలు.. నిష్పక్షపాత విచారణతో బాధితులకు న్యాయం చేయాలని అధికారులకు ఆదేశాలు



**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్) అక్టోబర్ 05 :** ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించి, బాధితులకు న్యాయం అందించాలనే లక్ష్యంతో ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం ప్రజలకు నమ్మకమైన వేదికగా మారుతోంది. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు, ఐపీఎస్ గారు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 18 మంది ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.ప్రతి ఫిర్యాదును శ్రద్ధగా పరిశీలించిన ఎస్పీ గారు, సంబంధిత పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలతో ఫోన్‌లో మాట్లాడి, ఫిర్యాదులపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల నమ్మకమే పోలీస్ శాఖకు బలమని పేర్కొంటూ, సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం లేదా జాప్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు.స్థానిక పోలీస్ స్టేషన్లలో సమస్యలు పరిష్కారం కాకపోతే ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని, ఎలాంటి మధ్యవర్తిత్వం లేకుండా నేరుగా జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ గారు ప్రజలకు సూచించారు.ఈ సోమవారం ప్రజావాణిలో భూ వివాదాలు -- 05, వ్యక్తిగత గొడవలు -- 02, భర్త వేధింపులు -- 02, కుటుంబ తగాదాలు -- 03, చీటింగ్ -- 03, ఇతర సమస్యలు -- 03 ఫిర్యాదులు వచ్చాయి.ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వాటి పురోగతిని జిల్లా పోలీసు కార్యాలయం నుంచి నిరంతరం పర్యవేక్షిస్తున్నామని ఎస్పీ గారు తెలిపారు. ప్రతి ఫిర్యాదుదారుడికి న్యాయం జరిగేలా పోలీస్ శాఖ కట్టుబడి పనిచేస్తుందని హామీ ఇచ్చారు.

LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్
ద్విభాషా దినపత్రిక


## పట్టపగలే చోరీ.. బంగారం, నగదు అపహరణ

ఇంట్లో ఎవరూ లేని సమయంలో చొరబడిన దొంగ.. బైక్ వదిలి పరార్





**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్) అక్టోబర్ 05 :** జోగులాంబ గద్వాల జిల్లా, ధరూర్ మండలం,పెద్ద చింతరేవుల గ్రామంలో పట్టపగలే చోరీ చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన తంబాళి నాగరాజు ఇంట్లోకి గుర్తుతెలియని దొంగ చొరబడి బంగారు ఆభరణాలు, నగదును అపహరించినట్లు సమాచారం. స్థానికుల సమాచారం మేరకు.. ఇంట్లోకి ప్రవేశించిన దొంగ సుమారు రెండు తులాల బంగారు ఆభరణాలతో పాటు రూ.90 వేల నగదును ఎత్తుకెళ్లినట్లు తెలుస్తోంది. చోరీ జరుగుతున్న సమయంలో స్థానికులు అక్కడికి రావడాన్ని గమనించిన దొంగ భయంతో అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం. పారిపోయే క్రమంలో దొంగ తన వెంట తెచ్చుకున్న బైక్‌ను ఇంటి ముందే వదిలేసి వెళ్లినట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించినట్లు సమాచారం. ఇంటి పరిసరాలను పరిశీలించిన పోలీసులు చోరీకి సంబంధించిన ఆధారాలను సేకరిస్తూ దర్యాప్తు చేపట్టినట్లు తెలుస్తోంది. దొంగ వదిలి వెళ్లిన బైక్ ఆధారంగా నిందితుడిని గుర్తించే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. చోరీకి సంబంధించి పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

## అణగారిన వర్గాల అభ్యున్నతి కృషి చేసిన మహనీయుడు కాకా

మంచిర్యాల డిసిపి ఎ భాస్కర్.



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్) :** కార్మికులు,పేదలు,అణగారిన వర్గాల అభ్యున్నతికి విశేషంగా కృషి చేసిన కార్మిక పక్షపాతి,సామాజిక సేవకుడు గడ్డం వెంకటస్వామి (కాకా)అని డిసిపి ఎ భాస్కర్ అన్నారు.సోమవారం కాకా జయంతిని పురస్కరించుకొని జిల్లా కార్యాలయంలో షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకలకు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్,జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్,జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్,జిల్లా అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమ అధికారి నీరటి రాజేశ్వరి,జిల్లా కార్మిక శాఖ అధికారి క్రాంతి,వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి హాజరై చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి,పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా డిసిపి మాట్లాడుతు కాకా కార్మిక పక్షపాతిగా,దేశ ప్రగతికి కార్మికులే పునాది అనే బలమైన విశ్వాసంతో పనిచేసిన గొప్ప వ్యక్తి అని తెలిపారు.కార్మికులకు కేవలం వేతనాలు మాత్రమే కాకుండా డిగ్నిటీ ఆఫ్ లేబర్ గౌరవం లభించాలనే భావనతో జీవితాంతం కృషి చేశారని తెలిపారు.సమాజంలోని అసమానతలను రూపుమాపేందుకు విశేష కృషి చేశారని,ప్రతి మనిషి మనుగడకు ఆహారం,దుస్తులు,నివాసం అత్యంత ముఖ్యమైనవని గుర్తించి,పేదలు,గుడిసెల్లో నివసించే ప్రజల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు.జాతీయ గుడిసెల సంఘం ద్వారా గుడిసెలలో జీవిస్తున్న పేద ప్రజలకు నివాస సౌకర్యం కల్పించేందుకు కృషి చేశారని,దాదాపు 30కాలనీలలో ఇళ్ల ఏర్పాటుకు చేసిన కృషి పేద ప్రజల జీవితాలలో గణనీయమైన మార్పును తీసుకువచ్చిందని తెలిపారు.కుల,మత భేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ అండగా నిలిచి,సామాజిక న్యాయం కోసం పోరాడారని,డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అడుగుజాడలలో నడుస్తు ఆయన ఆశయ సాధనే లక్ష్యంగా పని చేశారని తెలిపారు.ప్రతి ఒక్కరికీ విద్య అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు, పేదలు,అణగారిన వర్గాల అభ్యున్నతికి విశేషంగా కృషి చేశారని తెలిపారు.దేశంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్,కాకా వెంకటస్వామి పేర్లు సార్వజనీన సంక్షేమం కోసం చేసిన సేవలకు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని తెలిపారు.కాకా వారసులు ప్రస్తుత కాలంలో పెద్ద సంఖ్యలో కార్మికులు ఉపాధి పొందుతున్న గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం కొత్త చట్టం తీసుకురావడంలో కృషి చేశారని తెలిపారు.కార్మికులు,పేదలు,అణగారిన వర్గాల సంక్షేమానికి సంబంధించిన కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం ద్వారా కాకా ఆశయాలను కొనసాగిస్తున్నారని తెలిపారు.

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికే టీజేఎంయూ పోరాటం

8న జరిగే అశ్వారావుపేట నియోజకవర్గ ప్రథమ మహాసభను విజయవంతం చేయండి

ఏర్పాట్లను పరిశీలించిన యూనియన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు ఇనపనూరి ప్రభాకర్



**లోకల్ గైడ్ : అశ్వారావుపేట** : జర్నలిస్టుల న్యాయమైన హక్కుల సాధనకు, వారి సంక్షేమానికి తెలంగాణ జర్నలిస్ట్ మీడియా యూనియన్ ( టజేఎంయు) నిరంతరం అండగా నిలుస్తుందని ఆ సంస్థ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు ఇనపనూరి ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈనెల 8వ తేదీన అశ్వారావుపేట పట్టణంలోని కెమిలాయిడ్స్ గెస్ట్ హౌస్‌లో జరగనున్న టీజేఎంయూ అశ్వారావుపేట నియోజకవర్గ ప్రథమ మహాసభ ఏర్పాట్లను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం స్థానిక యూనియన్ ప్రతినిధులతో ప్రత్యేక సన్నాహక సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ?ఈ సందర్భంగా ఇనపనూరి ప్రభాకర్ మాట్లాడుతూ, దేశంలోనూ, రాష్ట్రంలోనూ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సంఘటిత శక్తే ఏకైక మార్గమన్నారు. రాష్ట్రంలో బలమైన సంఘాలుగా చెప్పుకుంటున్న పలు యూనియన్లు స్వార్ధ ప్రయోజనాలు, వ్యక్తిగత కార్యకలాపాలకే ప్రాధాన్యతనిస్తూ జర్నలిస్టుల సమస్యలను విస్మరించాయని విమర్శించారు. ఫలితంగా నేటికీ పాత్రికేయుల సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం సొంతింటి కలను కూడా నెరవేర్చుకోలేక జర్నలిస్టులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ?నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ఇండియా (ఎన్ యు జె ఐ) అనుబంధంగా పనిచేస్తున్న తెలంగాణ జర్నలిస్ట్ మీడియా యూనియన్ పాత్రికేయుల గొంతుకగా నిలిచి రాజీలేని పోరాటాలు చేస్తుందని ఆయన తెలిపారు. నియోజకవర్గంలో యూనియన్‌ను బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, 8వ తేదీన ప్రథమ మహాసభకు అశ్వారావుపేట నియోజకవర్గంలోని పాత్రికేయులందరూ భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ?ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సామల ప్రవీణ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉదయ రాఘవేంద్ర, ఖమ్మం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రణీత్ కుమార్, అశ్వారావుపేట నాయకులు నూనె హనుమంతరావు, పెనుగొండ సత్యనారాయణ, నార్లపాటి సుబ్బారావు, రాము తదితరులు పాల్గొన్నారు.

## కరువు జిల్లాగా ప్రకటించి ఎకరాకు 25వేల పరిహారం ఇవ్వాలి

సిపిఎం డిమాండ్




**నారాయణపేట అక్టోబర్ 5 :** నారాయణపేట జిల్లాలో ఎల్ నినో ప్రభావంతో జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని తీవ్రంగా నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 25వేల పంట నష్టపరిహారం అందించా లని సీపీఎం జిల్లా కార్యద ర్శి జి వెంకట్రామిరెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఉద్మల్గిద్దా గోపాల్ , బండ మీది బలరాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు.సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా వాతావ రణ మార్పులకు కారణ మైన ఎల్ నినో ప్రభావం వల్ల ఈ ఏడాది మన ప్రాం తంలో తీవ్ర వర్షభావ పరి స్థితులు నెలకొన్నాయ న్నారు. సకాలంలో వర్షాలు కురవకపోవడం, తీవ్రమైన కరవు పరిస్థితుల కారణం గా రైతాంగం సాగు చేసిన పంటలు పూర్తిగా ఎండిపో యి పెట్టుబడులు కూడా దక్కని దయనీయ స్థితిలో ఉన్నారు.రైతులు ఎంతో ఆశతో అప్పులు తెచ్చి మరీ విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి సాగు చేపట్టారు. కానీ ప్రకృతి వైపరీత్యం వల్ల పంటలు చేతికి రాకుండా పోయా యన్నారు. ఇప్పటికే అప్పు ల ఊబిలో కూరుకుపోయి న అన్నదాతలు, ఈ పంట నష్టం వల్ల తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతు న్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే రైతుల ఆత్మహత్యలు పెరిగే ప్రమాదం ఉందనీ ఆందో ళన వ్యక్తం చేశారు.తక్షణ సర్వే చేసి ఎల్ నినో ప్రభావంతో ఎండిపోయిన, నష్టపోయిన పంటల వివరాలను సేకరించేందుకు తక్షణమే రెవెన్యూ, వ్యవ సాయ శాఖల అధికారు లతో ఉమ్మడి సర్వే నిర్వహించాలన్నారు.ఎకరాకు రూ. 25వేల పరిహారం చెల్లించాలనీ కోరారు.అలాగే ఈ ఏడాది రైతులకు ఇచ్చిన పంట రుణాలను పూర్తిగా మాఫీ చేయాలి లేదా వడ్డీ లేని రుణాలుగా రీషెడ్యూల్ చేయాలనీ డిమాండ్ చేశారు. రాబోయే రబీ (యాసంగి) సీజన్ కోసం రైతులకు వంద శాతం సబ్సిడీపై నాణ్యమైన విత్తనాలు, ఎరువులను పంపిణీ చేయాలనీ కోరారు.ప్రభుత్వం కేవలం ప్రకటనల కే పరిమితం కాకుండా, యుద్ధప్రాతిపదికన స్పందించి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నష్ట పోయిన రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతా మని హెచ్చరించారు.

## సుల్తానాబాద్ పట్టణ ఆర్యవైశ్య సంఘం

అధ్యక్షులు గా కొమురవెల్లి భాస్కర్



**పెద్దపల్లి జిల్లా అక్టోబర్ 05 (లోకల్ గైడ్) :** సుల్తానాబాద్ పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా మూడోసారి ఏకగ్రీవంగా కొమురవెల్లి భాస్కర్ ఎన్నికయ్యారు, వైశ్య భవన్ లో ఎన్నికలు నిర్వహించుకోవడం జరిగింది.అధ్యక్షులు గా కొమురవెల్లి రామ్మూర్తి , సెక్రటరీ గా పుల్లూరి రమేష్ , క్యాషియర్ గా కొమురవెల్లి (కేబి) శ్రీనివాస్ , శ్రీ వాసవి మాత దేవాలయం చైర్మన్ గా చకిలం మారుతి, సెక్రటరీగా నార్ల శ్రీనివాస్, పట్టణ ఆర్యవైశ్య సంఘం మహిళా అధ్యక్షురాలి గా పల్ల అపర్ణల ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఎన్నికల అధికారిగా జిల్లా కార్యదర్శి అల్లంకి లింగమూర్తి వ్యవహరించారు.ఈ నూతన కమిటీ ల నియామకం పట్ల ఆర్యవైశ్య సంఘం నాయకులు, సభ్యులు సంతోషం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.

## బాడీ బిల్డర్ పోటీలలో జోగులాంబ గద్వాల

### జిల్లా అయిజ మండల నివాసి ప్రభాకర్ టైటిల్ విన్నర్ సాధించారు




**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్) అక్టోబర్ 05** : మెన్ (పురుషుల) విభాగం ఫిజిక్ టైటిల్ విన్నర్ ఐజ పట్టణానికి చెందిన ఆర్ ఎస్ జిమ్ నిర్వాహకులు సర్టిఫైడ్ ట్రైనర్ ప్రభాకర్ కు ఫిజిక్స్ నందు టైటిల్ విన్నర్ సాధించారు ఆదివారం బెంగుళూరులో వాలార్ క్లాసిక్ 2026టు బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించారు. పురుషుల విభాగం ఫిజిక్స్ నందు టైటిల్ విన్నర్ సాధించారు బెంగళూరులోని బి.ఆర్.ఎస్ ఆడిటోరియం నందు జరిగిన ఈ పోటీలలో వివిధ రాష్ట్రాలకు చెందిన బాడీ బిల్డర్లు పాల్గొన్నారు . ఇందులో ప్రభాకర్ టైటిల్ విన్నర్ సాధించారు పథకాలను వాలర్ క్లాసిక్ ఫౌండర్ ఒలంపియా వరల్డ్ మెన్సు ఫిజిక్స్ టైటిల్ విన్నర్ హర్భజన్ , ప్రొఫెషనల్ ట్రైనర్ యాదవ్ చేతుల మీదుగా అందుకోవడం జరిగింది మొదటిసారిగా అయిజ కు రావడం గర్వకారణం గా ఉంది అంటున్న అయిజ వాసులు

## జాతీయ బీసీ సంక్షేమ సంఘ

### ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

సమాజ శ్రేయస్సుకు గురువులే మార్గదర్శకులు - దిండి సీఐ బిసన్న



**లోకల్ గైడ్ న్యూస్ ,దేవరకొండ అక్టోబర్ 5:** దేవరకొండ పట్టణంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.సామాజికవేత్త, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దిండి సీఐ బీసన్న హాజరయ్యారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలువురు ఉపాధ్యాయులను సీఐ బీసన్న చేతుల మీదుగా ప్రశంసా పత్రం, మెమెంటో, శాలువాతో ఘనంగా సత్కరించారు.అనంతరం సీఐ బీసన్న మాట్లాడుతూ ఉపాధ్యాయుల ద్వారానే వ్యక్తి అత్యున్నత స్థానానికి ఎదుగుతారని, సమాజంలోని రుగ్మతలను తొలగించి విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత గురువులదేనని అన్నారు.ఈ కార్యక్రమంలో వీఖ= డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రవి కుమార్, ఎంఈఓలు మాత్రు నాయక్, నాగేశ్వరరావు నాయక్, రామలింగయ్య, ధన్యరాజు, ఏకుల రాజారావు, గోపియా నాయక్, గరిడి విజయభాస్కర్, చెరుకు నాగరాజు గౌడ్, అప్ప వీరయ్య, గడ్డం బిక్షమయ్య, రెడ్డి కోటేశ్వరరావు, ఎండి రంజాన్ బేక్, మెరుగు శ్రీనివాస్, ఆడారపు గణేష్, ఎండి అబ్దుల్ కలాం, కొండపల్లి శ్రీను, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు

-తెలిపిన కాంగ్రెస్ యూత్ నాయకులు మిరియాల ప్రీతం

-గురువుల సేవలు వెలకట్టలేనివి కాంగ్రెస్ సీనియర్ నాయకులు..మిర్యాల రాఘవరావు




**శేరిలింగంపల్లి, అక్టోబర్ 05 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ):** చందానగర్ లో ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు మిరియాల ప్రీతం, సీనియర్ నాయకులు మిర్యాల రాఘవరావు ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులను సన్మానించి శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మిరియాల ప్రీతం మాట్లా డుతూ.. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, మాతృదేవో భవ, పితృదేవో భవ, ఆచార్య దేవో భవ అన్నట్లు తల్లిదండ్రుల తర్వాత గురువుకే అత్యున్నత స్థానం ఉందన్నారు. విద్యార్థులను భావి పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు చేస్తున్న కృషి మరువలేనిదని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ విద్యా రంగానికి, ఉపాధ్యాయుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని, రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. "ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవ చరిత్ర"ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏటా అక్టోబర్ 5న ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటారు. యునెస్కో, ఐఎల్ఓ సంయుక్తంగా 1966లో ఉపాధ్యాయుల హక్కులు, బాధ్యతలపై చేసిన సిఫార్సులకు గుర్తుగా 1994 నుండి అక్టోబర్ 5ను ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించారు. ప్రస్తుతం 100 కి పైగా దేశాలలో ఘనంగా జరుపుకుంటున్నారు. భారత్ లో సెప్టెంబర్ 5న జరుపుకుంటారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి తిమింగలం ఏసీబీ వలలో..! రూ. లక్ష లంచం తీసుకుంటూ దొరికిపోయిన రంగారెడ్డి డీఎంహెచ్ఓ స్వర్ణ కుమారి

– ఆసుపత్రి అనుమతుల మంజూరు కోసం లంచం డిమాండ్ చేసిన రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి స్వర్ణ కుమారి అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.



**లోకల్ గైడ్, హైదరాబాద్ జిల్లా** :ఘటన వివరాల్లోకి వెళితే..రంగారెడ్డి జిల్లా పరిధిలో ఒక నూతన ఆసుపత్రిని ప్రారంభించేందుకు అవసరమైన అనుమతులు మంజూరు చేయడం కోసం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి (డీఎంహెచ్ఓ) స్వర్ణ కుమారి రూ. లక్ష లంచం డిమాండ్ చేశారు. బాధితుడు ఈ విషయమై అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించడంతో వారు పక్కా వ్యూహంతో రంగంలోకి దిగారు. బాధితుడి నుంచి లంచం సొమ్ము స్వీకరిస్తుండగా ఏసీబీ బృందం దాడి చేసి ఆమెను అదుపులోకి తీసుకుంది. కార్యాలయంలో సుదీర్ఘ తనిఖీలు..!శివరాంపల్లిలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సుదీర్ఘంగా తనిఖీలు చేపట్టారు. ఈ దాడుల్లో స్వర్ణ కుమారితో పాటు లంచం వ్యవహారంలో కీలక పాత్ర పోషించిన ఆరోగ్య తనిఖీ అధికారి (హెల్త్ ఇన్‌స్పెక్టర్) శ్రీనివాస్‌ను కూడా అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం డీఎంహెచ్ఓ స్వర్ణ కుమారి, ఆరోగ్య తనిఖీ అధికారి శ్రీనివాస్, వాహన చోధకుడిని (డ్రైవర్) ఏసీబీ అధికారులు ముమ్మరంగా విచారిస్తున్నారు. ఆసుపత్రుల అనుమతుల పేరుతో గతంలో కూడా వీరు ఇలాంటి అక్రమాలకు పాల్పడ్డారా అనే కోణంలో విచారణ కొనసాగుతోంది.

## ఆర్టీసీ గుర్తింపు ఎన్నికల్లో టిఎన్టియుసి...




**బెల్లంపల్లి (లోకల్ గైడ్) :** తెలంగాణ రాష్ట్రంలో ఆర్టీసీ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో టిఎన్టియుసి కార్మిక పరిషత్ ఎన్నికల బరిలో నిలబడుతుందని టిఎన్టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి మణిరాం సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు.బెల్లంపల్లి ఆర్టీసీ బస్టాండ్ లో ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఆర్టీసీ సంస్థ బలోపేతంగా ఉండాలంటే,పూర్వ వైభవం రావాలంటే కార్మికులు ఉద్యోగులు ఆర్టీసీ కార్మిక పరిషత్ ప్యానల్ నే గెలిపించాలని పిలుపునిచ్చారు.ఉద్యోగాల కల్పన నూతన డిపోల ఏర్పాటు మహిళా సిబ్బందికి రక్షణ వసతులు కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయుట కొరకు ప్రభుత్వంతో మాట్లాడి ఒప్పించడం జరుగుతుందని తెలిపారు.ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేవరకు పోరాటం కొనసాగిస్తామని,వన్ మెన్ డ్రైవర్లకు ఉద్యోగ భద్రత టికెట్ తీసుకునే బాధ్యత ప్రయాణికుల ది రిమూవ్ వారి వ్యవస్థ పూర్తిగా తీసివేసి ఉద్యోగ భద్రత,ఎంవి యాక్ట్ సెక్షన్ 178పబ్లిక్1988 ప్రకారం టికెట్ తీసుకొని బాధ్యత ప్రయాణికులకు చేసి,ఉద్యోగులకు సంపూర్ణమైన ఉద్యోగ భద్రత,విలీన ప్రక్రియ చేసే ఏకైక యూనియన్ కార్మిక పరిషత్ అని తెలిపారు.ఈ కార్యక్రమంలో టిఎన్టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి మణిరామ్ సింగ్,నాయకులు మల్లయ్య,ఓ జీవరత్నం,ఆవుల సుధాకర్,గజ్జ దుర్గయ్య,ఎన్ పుల్లయ్య,డి అంజయ్య,సిహెచ్ కిష్టయ్య,ఆర్ గంగాధర్ గౌడ్,ఎస్ కె అజ్జర్ పాష,బి సత్యనారాయణగారు తదితరులు పాల్గొన్నారు.

## వాతావరణంలో కీలక పాత్ర పోషిస్తున్న ఎల్ నినో, లా నినా ప్రభావాలు

-పసిఫిక్ సముద్ర ఉష్ణోగ్రతల మార్పుతో భారత రుతుపవనాలపై ప్రభావం

-రైతులకు అప్రమత్తత అవసరం




**శేరిలింగంపల్లి, అక్టోబర్ 05 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ):** ప్రపంచ వాతావరణ మార్పులలో కీలక పాత్ర పోషిస్తున్న ఎల్ నినో, లా నినా దృగ్విషయాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని వాతావరణ నిపుణులు సూచిస్తున్నారు. ఎల్ నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలోని మధ్య, తూర్పు భూమధ్యరేఖా ప్రాంతాలలో సముద్ర ఉపరితల నీటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా వేడెక్కే వాతావరణ దృగ్విషయం. ఎల్ నినో ప్రభావం వల్ల ప్రపంచంలోని కొన్ని ప్రాంతాలలో ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరుగుతాయి. భారతదేశంలో నైరుతి రుతుపవనాలపై తీవ్ర ప్రభావం చూపి వర్షపాతం తగ్గే అవకాశం ఉంటుంది. వర్షాలు తగ్గితే వ్యవసాయంపై ప్రత్యక్ష ప్రభావం పడి పంట దిగుబడులు తగ్గుతాయి. అలాగే సముద్ర ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల సముద్ర జీవవ్యవస్థలపై కూడా ప్రతికూల ప్రభావం ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా వాతావరణ నమూనాలలో పెద్ద ఎత్తున మార్పులు సంభవిస్తాయి. సులభంగా గుర్తుంచుకోవాలంటే ఎల్ నినో అంటే పసిఫిక్ సముద్రపు నీరు వేడెక్కడం వల్ల వాతావరణంలో మార్పులు వచ్చి భారత రుతుపవనాలపై ప్రభావం చూపడం. ఇక లా నినా అనేది దీనికి పూర్తి భిన్నమైనది. పసిఫిక్ మహాసముద్రంలోని మధ్య, తూర్పు భూమధ్యరేఖా ప్రాంతాలలో సముద్ర ఉపరితల నీటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే చల్లబడే దృగ్విషయాన్ని లా నినా అంటారు. లా నినా సమయంలో పసిఫిక్ సముద్ర జలాలు చల్లబడతాయి. దీని వల్ల భారతదేశంలో సాధారణంగా నైరుతి రుతుపవనాలు బలపడటానికి, వర్షపాతం పెరగడానికి అనుకూల పరిస్థితులు ఏర్పడతాయి. వ్యవసాయానికి అనుకూలమైన వర్షాలు లభించే అవకాశం ఉంటుంది. అయితే ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు, వర్షపాతం నమూనాలు మారవచ్చు. సారాంశంలో ఎల్ నినో అంటే పసిఫిక్ నీరు వేడిగా మారి భారతదేశంలో వర్షాలు తగ్గే అవకాశం, లా నినా అంటే పసిఫిక్ నీరు చల్లగా మారి భారతదేశంలో వర్షాలు పెరిగే అవకాశం అని గుర్తుంచుకోవాలి.

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy

లోకల్ గైడ్ ద్విభాషా దినపత్రిక




## హెడ్ కానిస్టేబుల్ పాండుకు ఏఎస్సైగా పదోన్నతి.

– అభినందించి ఘనంగా సన్మానించిన ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు.



**లోకల్ గైడ్/బంట్వారం:** : పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న పి. పాండుకు ఏఎస్సైగా పదోన్నతి లభించిన సందర్భంగా ఎస్సై విమల ఆధ్వర్యంలో పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయనను అభినందించి ఘనంగా సన్మానించారు. పోలీసు శాఖలో విధి నిర్వహణలో పాండు అందించిన సేవలను వారు ప్రశంసించారు. ఈ సందర్భంగా మర్పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పి. యాదగిరి, ఎస్. నర్సిములు, సాల్బత్తాపూర్ సర్పంచ్ బాలయ్య, బంట్వారం మండల మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు జి. నర్సిమారెడ్డి, బంట్వారం మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు అంజయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సి. రమేష్, ఎన్. నర్సిములు, బస్వాపూర్‌కు చెందిన రత్నయ్య, బస్వాపూర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ఏలియా, ఎం. వెంకట్ తదితరులు పాండును శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఏఎస్సైగా పదోన్నతి పొందిన పాండు భవిష్యత్తులోనూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. పదోన్నతి పొందిన సందర్భంగా పాండుకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా కాక వెంకటస్వామి జయంతి వేడుకలు..

కాక వెంకటస్వామి విగ్రహానికి పూలమాల వేసిన ప్రభుత్వ విప్ విజయరమణ రావు..





**పెద్దపల్లి జిల్లా అక్టోబర్ 05 (లోకల్ గైడ్) :** స్వర్గీయ మాజీ కేంద్రమంత్రి వర్యులు, పెద్దపల్లి పార్లమెంట్ ముద్దుబిడ్డ కాకా గడ్డం వెంకటస్వామి 97వ జయంతిని పురస్కరించుకొని సుల్తానాబాద్ పట్టణ కేంద్రంలోని వారి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు శ్రీ. చింతకుంట విజయరమణ రావు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, వైస్ చైర్మన్ అంతటి పుష్పలత, మున్సిపల్ కమిషనర్ రమేష్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ మినపల ప్రకాష్ రావు, సింగిల్ విండో చైర్మన్లు శ్రీగిరి శ్రీనివాస్, జానీ, పట్టణ కౌన్సిలర్లు రాయమల్లు, గరిగే శోభా శ్రీనివాస్, తిరుపతి, అమ్మిరి శెట్టి రాకేష్, డైరెక్టర్లు, పట్టణ అధ్యక్షులు, మండల అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నాయక్ దామోదర్ రావు , పన్నాల రామన్న, అప్పల తిరుమల, రఫిక్, రాహుల్, కాక అభిమానులు, పలు గ్రామాల సర్పంచులు చిలుక సతీష్, ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నంలో ' ఎస్.కె మార్ట్' వస్త్రాలయం ప్రారంభం



**ఇబ్రహీంపట్నం అక్టోబర్ 5( లోకల్ గైడ్ ) :** ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ' ఎస్.కె మార్ట్' వస్త్రాలయని స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ప్రగతిపథంలో నడిపించడమే తమ లక్ష్యమన్నారు. పట్టణంలో వాణిజ్య రంగాలు విస్తరించడం వల్ల స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరిగి ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. మౌలిక వసతుల కల్పనతో పాటు వ్యాపారాల విస్తరణకు పూర్తి ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. అనంతరం వినియోగదారులకు నాణ్యమైన వస్త్రాలు, సేవలు అందిస్తూ సంస్థ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తూ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, స్థానిక వ్యాపారులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

విద్యార్థుల్లో పుస్తక పఠన అలవాటును పెంపొందించాలి:

లయన్ డాక్టర్ జి. మహేంద్ర కుమార్ రెడ్డి





**లోకల్ గైడ్ ఆమనగల్లు, అక్టోబర్ 5:** ఆధునిక సాంకేతికత రావడంతో విద్యార్థుల్లో పుస్తక పఠన అలవాటు తగ్గిపోతోందని, తిరిగి విద్యార్థుల్లో పుస్తకాలు చదివే అలవాటును పెంపొందించాల్సిన అవసరం ఉందని లయన్ డాక్టర్ జి. మహేంద్ర కుమార్ రెడ్డి అన్నారు. లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ క్లబ్ కమ్యూనిటీ గ్రాంట్స్‌లో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో గ్రంథాలయాలకు సహకరించే ప్రాజెక్టులో భాగంగా సోమవారం కడ్తాల్ మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల గ్రంథాలయానికి సుమారు 300 పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన డాక్టర్ మహేంద్ర కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. సెల్‌ఫోన్ వినియోగం పెరగడం, ప్రతి అంశం సెల్‌ఫోన్‌లోనే అందుబాటులోకి రావడంతో పుస్తకాలపై ఆధారపడే గుణం తగ్గిందన్నారు. అయితే ఉన్నత పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో పుస్తక పఠనంపై ఆసక్తిని పెంచే అవకాశం ఉందని తెలిపారు. పిల్లలు మరిచిపోతున్న తెలుగు భాషతో పాటు పుస్తక పఠనాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు చెప్పారు. ప్రతి గ్రంథాలయం ఒక విజ్ఞాన సర్వస్వమని, ప్రతి ఉన్నత పాఠశాలలో చక్కటి గ్రంథాలయం ఉండాలన్నదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. మొక్కలను నాటి సంరక్షించాలి కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణపై ప్రతి విద్యార్థికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, మొక్కలు నాటడంతో బాధ్యత పూర్తికాదని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించినప్పుడే కార్యక్రమానికి సార్థకత లభిస్తుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా గవర్నర్ జి. చెన్న కిషన్ రెడ్డి, మాజీ క్యాబినెట్ కార్యదర్శి తాళ్ల అంజయ్య, జోన్ చైర్మన్ భీమ్ రెడ్డి రాంరెడ్డి, క్లబ్ మాజీ అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జంగయ్య, ఉపాధ్యాయులు, క్లబ్ సభ్యులు చెన్న కిషన్ రెడ్డి, అమరేందర్ రెడ్డి, కుమార్, బిచ్యా నాయక్, రాజు, క్లబ్ ప్రజా సంబంధాల అధికారి పాషా తదితరులు పాల్గొన్నారు.

## ఎలిమినేడులో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**ఇబ్రహీంపట్నం అక్టోబర్ 5 ( లోకల్ గైడ్ ) :** వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఇబ్రహీంపట్నం మండలం ఎలిమినేడు గ్రామంలో సోమవారం లబ్ధిదారులకు అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి సహకారంతో మంజూరైన ఈ చెక్కులను కాంగ్రెస్ నాయకులు బాధితుల ఇళ్లకు వెళ్లి నేరుగా పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన మ్యాకం మధుకు రూ.60,000, మంకాల రవీందర్ రెడ్డికి రూ.60,000, ఒలాస్ నరసింహకు రూ.19,500 విలువైన చెక్కులను డీసీసీ జనరల్ సెక్రటరీ మంకాల శేఖర్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు పిట్టల యాదగిరి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మంకాల శేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. నిరుపేదల ఆరోగ్య భద్రతకు సీఎం సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందని, అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ఎమ్మెల్యే సహకారంతో కృషి చేస్తామని పేర్కొన్నారు....ఈ కార్యక్రమంలో నాయకులు పట్నం శివశంకర్, ఎక్కే మహేందర్, ఆర్కే బలరాం, స్వామి, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ విధుల్లో పారదర్శకత, క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యత

**అవినీతికి తావులేకుండా విధులు నిర్వహించాలి.**

**జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ .**





**నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.లోకల్ గైడ్ :** జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది బాధ్యతాయుతంగా, నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ ఆదేశించారు. పోలీస్ శాఖపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని మరింత బలోపేతం చేసే విధంగా ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని సూచించారు. సోమవారం జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ పోలీస్ అధికారులు, ఎస్‌హెచ్‌ఓలు, ఇతర అధికారులు మరియు సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతల పరిస్థితి, నేర నియంత్రణ, రాత్రి గస్తీ, వాహనాల తనిఖీలు, చెక్‌పోస్టులు, ఎన్‌ఫోర్స్‌మెంట్, ర్యాలీలు, ప్రజా భద్రత, విలేజ్ పోలీసింగ్, సిబ్బంది సంక్షేమం తదితర అంశాలపై సమీక్షించి పలు కీలక సూచనలు చేశారు. పోలీస్ విధుల్లో ఎలాంటి రాజకీయ, వ్యక్తిగత లేదా ఇతర ప్రభావాలకు తావులేకుండా పూర్తిగా నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వ్యవహరించాలని ఎస్పీ ఆదేశించారు. ఏ ఒక్క వర్గానికో, వ్యక్తికో అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే భావన ప్రజల్లో కలగకుండా చట్టప్రకారం అందరికీ సమానంగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ శాఖలో అవినీతికి ఏమాత్రం తావు ఉండకూడదని ఎస్పీ స్పష్టం చేశారు. ముఖ్యంగా వాహనాల తనిఖీలు, చెక్‌పోస్టులు, రాత్రి పెట్రోలింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, కేసుల దర్యాప్తు తదితర విధుల సమయంలో సిబ్బంది డబ్బులు తీసుకున్నారనే ఆరోపణలు లేదా సమాచారం వచ్చినా తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు. పోలీస్ శాఖపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని దెబ్బతీసే విధంగా ఎవరూ వ్యవహరించరాదని స్పష్టం చేశారు. జిల్లాలో పగలు, రాత్రి నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ అక్రమ కార్యకలాపాలు, అసాంఘిక కార్యక్రమాలు, నేరాలకు పాల్పడే వ్యక్తులపై నిరంతరం నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో నైట్ పెట్రోలింగ్ సిబ్బంది, నైట్ డ్యూటీ అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు, కార్యకలాపాలను గుర్తించి అవసరమైన చోట వెంటనే చట్టపరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని విలేజ్ పోలీస్ ఆఫీసర్ల ద్వారా గ్రామస్థాయి నుంచి సరైన సమాచారాన్ని ముందస్తుగా సేకరించాలని ఎస్పీ సూచించారు. నేరాలు, అక్రమ కార్యకలాపాలు, అసాంఘిక శక్తుల కదలికలు, శాంతిభద్రతలకు సంబంధించిన సమస్యలను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి ఎస్‌హెచ్‌ఓ తమ పరిధిలోని గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి విలేజ్ పోలీస్ ఆఫీసర్లతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. రాత్రి విధుల్లో ఉన్న సిబ్బంది తమ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అనుమానాస్పద పరిస్థితులు, వ్యక్తులు, వాహనాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ అవసరమైన సమాచారాన్ని ఉన్నతాధికారుల దృష్టికి వెంటనే తీసుకురావాలని ఆదేశించారు. విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు తగిన క్రమశిక్షణ, ప్రవర్తనా నియమాలు, యూనిఫామ్ , డ్రెస్ కోడ్‌ను తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం, అలసత్వం, క్రమశిక్షణా రాహిత్యాన్ని ఏమాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండే, బాధ్యతాయుతమైన, అవినీతి రహితమైన, పారదర్శకమైన పోలీసింగ్ అందించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ సూచించారు. పోలీస్ శాఖ ప్రతిష్ఠ, ప్రజల విశ్వాసం ప్రతి ఒక్కరి పనితీరుపైనే ఆధారపడి ఉంటుందని, అందువల్ల ప్రతి అధికారి, సిబ్బంది తమ విధులను నిజాయితీ, నిబద్ధత, క్రమశిక్షణతో నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాలోని పోలీస్ అధికారులు, ఎస్‌హెచ్‌ఓలు, ఇతర అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆరోగ్య కార్డులు, ఇళ్ల స్థలాలు వెంటనే ఇవ్వాలి..

## సీఎంకు జర్నలిస్టుల పోస్టుకార్డుల వెల్లువ

**జర్నలిస్టుల హక్కుల సాధనకు కదం తొక్కిన టీయూడబ్ల్యూజే (హెచ్-143)**

**జర్నలిస్టుల సంక్షేమానికి తక్షణమే భరోసా కల్పించాలి**

**ఇబ్రహీంపట్నంలో సీఎంకు పోస్టుకార్డుల ఉద్యమం చేపట్టిన టీయూడబ్ల్యూజే (హెచ్-143)హెల్త్ కార్డులు, ఇళ్ల స్థలాలు, గౌరవ వేతనాలు ఇవ్వాలని డిమాండ్**



**ఇబ్రహీంపట్నం, అక్టోబరు 5( లోకల్ గైడ్ ) :** ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా నిలుస్తూ నిరంతరం ప్రజా సమస్యలపై గళమెత్తే జర్నలిస్టుల సంక్షేమాన్ని రాష్ట్ర ప్రభుత్వం విస్మరించడం తగదని టీయూడబ్ల్యూజే (హెచ్-143) నాయకులు స్పష్టం చేశారు. జర్నలిస్టుల ఆరోగ్య భద్రత, సంక్షేమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద భారీ 'పోస్టుకార్డు ఉద్యమం' నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి తమ న్యాయమైన డిమాండ్లతో కూడిన పోస్టుకార్డులను పంపించి నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసనను ఉద్దేశించి తెంజు ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షులు లివరికుప్పల అశోక్ లిమాట్లాడుతూ.. ఎండనక, వాననక రాత్రింబవళ్లు ప్రజల్లో ఉంటూ వార్తలు అందించే జర్నలిస్టులకు ఇప్పటివరకు పూర్తిస్థాయి ఆరోగ్య భద్రత లేకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జర్నలిస్టుల కుటుంబాలకు కార్పొరేట్ వైద్యం అందేలా ఉద్యోగులతో సమానంగా హెల్త్ కార్డులు ఇవ్వాలని, అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని, అలాగే గౌరవ వేతనాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకే ఈ పోరుబాట పట్టామని, ప్రభుత్వం స్పందించేంతవరకు పోరాటం ఆగదని ఆయన స్పష్టం చేశారు. అనంతరం యూనియన్ జిల్లా నాయకులు హరికృష్ణ రెడ్డి మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న 2వ విడత అక్రిడేషన్ కార్డులను ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే జారీ చేయాలన్నారు. జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వం తాత్సారం వీడి సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.....ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే యూనియన్ ప్రధాన కార్యదర్శి మొలుగు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు హనుమంతు సుదర్శన్, ఆంజనేయులు, కోశాధికారి నరేందర్ రెడ్డి, నాయకులు సురమోని బాబు, తెంజు ప్రధాన కార్యదర్శి ఆముదాల సందీప్, ఆర్. కృష్ణ యాదవ్, జిల్లా నాయకులు చెరుకూరి మహేందర్, చెరుకూరి రాజు, ఎట్టి లక్ష్మయ్య, మహేందర్ గౌడ్, చెరుకూరి మల్లేష్, చెనమోని గోపాల్ ముదిరాజ్, ముచ్చర్ల నాగేష్, అల్లంపల్లి సురేష్, సురేష్ యాదవ్, గుండెలేని రాఘవేందర్, మహేష్ చారి, రామ్ చందర్, శ్రీకాంత్ రెడ్డి, మేకల సురేష్, దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఇక డ్రోన్‌తో మందుల పిచికారీ!

సింగల్ విండోలో స్వల్ప అద్దెకు డ్రోన్ సేవలు.. రైతులు సద్వినియోగం చేసుకోవాలి: చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా



**లోకల్ గైడ్ ఆమనగల్లు, అక్టోబర్ 5:** రైతులకు వ్యవసాయ పనుల్లో మరింత సౌలభ్యం కల్పించేందుకు ఆమనగల్లు ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో డ్రోన్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆమనగల్లు, కడ్తాల్ మండలాలతో పాటు పరిసర గ్రామాల రైతులు స్వల్ప అద్దెతో ఈ డ్రోన్ సేవలను వినియోగించుకోవచ్చని ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా తెలిపారు. సోమవారం సింగల్ విండో కార్యాలయ ఆవరణలో పాలకవర్గ సభ్యులతో కలిసి నూతన డ్రోన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా మాట్లాడుతూ.. వ్యవసాయ పనులకు కూలీలు లభించక రైతులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వారి శ్రమ, సమయాన్ని ఆదా చేసేందుకు సింగల్ విండో ద్వారా డ్రోన్ సేవలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డ్రోన్ ద్వారా గంటకు సుమారు 2 నుంచి 3 ఎకరాల వరకు పంటలకు మందులు, ఎరువుల పిచికారీ చేయవచ్చని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతు సంక్షేమమే సింగల్ విండో లక్ష్యం

సింగల్ విండో ద్వారా రైతులకు అవసరమైన ఎరువులను అందిస్తున్నామని, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు అండగా నిలుస్తున్నామని గంప వెంకటేష్ గుప్తా తెలిపారు. అలాగే డీసీసీబీ బ్యాంకుల ద్వారా రైతులకు తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తున్నామని చెప్పారు. రైతుల అవసరాలకు అనుగుణంగా మరిన్ని సేవలను అందించేందుకు సింగల్ విండో నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో వైస్ చైర్మన్ దోనాదుల సత్యం, డైరెక్టర్లు ఎనుమల జంగమ్మ, దావ శ్రీపాల్, చేగురి వెంకటేష్, బెయిలి వెంకటయ్య, జోగు వీరయ్య, కౌన్సిలర్ ఎనుముల రమేష్, సీఈవో పద్మాకర్ రెడ్డి, సిబ్బంది దేవేందర్, అల్లాజీ, మహేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు బూర్గుల విద్యార్థి రేవంత్

**జిల్లాస్థాయిలో అద్భుతంగా రాణించి రాష్ట్రస్థాయికి ఎంపిక**

**అభినందించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవికుమార్ బూర్గుల సర్పంచ్ రాజగోపాల్ రెడ్డి**



**( లోకల్ గైడ్ షాద్ నగర్ ) :** రంగారెడ్డి జిల్లా ఫరూక్నగర్ మండల పరిధిలోని జడ్పీహెచ్ఎస్ పీఎం శ్రీ బూరుగుల పాఠశాలకు చెందిన విద్యార్థి రేవంత్ ఎస్జీఎఫ్ఐ అండర్-14 యోగా విభాగంలో రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ ఉమ్మడి జిల్లాల స్థాయి సెలెక్షన్లు పాల్గొని అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. ఆదివారం ఎల్.బి. నగర్‌లో అత్యంత ఉత్సాహంగా నిర్వహించబడ్డాయి. ఈ పోటీల్లో పీఎం శ్రీ జెడ్పీహెచ్ఎస్ బూర్గుల పాఠశాలకు చెందిన 6వ తరగతి విద్యార్థి రేవంత్ అద్భుతమైన ప్రదర్శన కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు.?ఈనెల 11 నుండి 13వ తేదీ వరకు సిద్ధిపేట జిల్లాలో రాష్ట్ర స్థాయి యోగా పోటీలు నిర్వహించబడనున్నాయి. ఈ నేపథ్యంలో రేవంత్ రాష్ట్ర స్థాయిలోనూ సత్తా చాటాలని అందరూ ఆకాంక్షిస్తున్నారు. ఉమ్మడి జిల్లా యోగా పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి అర్హత సాధించిన విద్యార్థి రేవంత్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు్రా. రవికుమార్, ఉపాధ్యాయ బృందం, గ్రామ సర్పంచ్ రాజగోపాల్ రెడ్డి మరియు గ్రామ పెద్దలు ఘనంగా అభినందించారు. సిద్ధిపేటలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ రేవంత్ విజయం సాధించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తెవాలని దీవించారు.

## అర్హులందరికీ ప్రభుత్వ ఫలాలు..

## ఇబ్రహీంపట్నంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

పేదల సంక్షేమానికి 'స్మార్ట్' భరోసా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



**ఇబ్రహీంపట్నం అక్టోబర్ 5 (లోకల్ గైడ్ ) :** ప్రజా ప్రభుత్వంలో మాటల కంటే చేతలకే ప్రాధాన్యతనిస్తూ, పేదల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి స్పష్టం చేశారు. ఇబ్రహీంపట్నం కేంద్రంలోని శాస్త్రా గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, అర్హులైన లబ్ధిదారులకు నూతన 'స్మార్ట్ రేషన్ కార్డుల'ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అర్హులైన ఒక్క పేద కుటుంబానికి కూడా కొత్త రేషన్ కార్డు ఇవ్వకుండా నిరాశకు గురిచేశారని విమర్శించారు. నేడు ప్రజా పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తూ స్మార్ట్ కార్డులను అందజేస్తున్నామని తెలిపారు. ఈ స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సబ్సిడీ రేషన్ సరుకులు మరింత పారదర్శకంగా, వేగంగా మరియు సులభంగా ప్రజలకు చేరువవుతాయని వివరించారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే తమ ప్రభుత్వ లక్ష్యమని, ప్రజా అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ సంక్షేమ ఫలాలు నేరుగా అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో సంక్షేమం మరియు అభివృద్ధిని రెండు కళ్లుగా భావిస్తూ నియోజకవర్గాన్ని సమగ్రంగా తీర్చిదిద్దుతామని ఆయన పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పౌరసరఫరాల శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఘనంగా కాకా వెంకటస్వామి జయంతి వేడుకలు...



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్) :** బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు బండి ప్రభాకర్ ఆధ్వర్యంలో కాకా వెంకటస్వామి 97వ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎఎంసి చౌరస్తాలోని కాక విగ్రహానికి, అదేవిధంగా పట్టణంలోని కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రజల కోసం బతికిన నాయకుడికి మరణం లేదని, ప్రజల గుండెల్లో కాకా ఎప్పటికీ చిరంజీవిగా నిలిచిపోయారని అన్నారు. సాధారణ కార్మికుడి స్థాయి నుండి జాతీయ నాయకుడిగా కాకా తన రాజకీయ జీవితాన్ని సాదాసీదా కార్యకర్తగా ప్రారంభించారని, భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేసిన అనుభవంతో పేదలు, కార్మికులు ఎదుర్కొనే సమస్యలను దగ్గరగా తెలుసుకున్నారని, ఆ అనుభవమే జీవితాంతం కార్మికుల పక్షాన నిలబడటానికి బలమైందని అన్నారు. గుడిసెల వెంకటస్వామిగా పేరుగాంచిన ఆయన హైదరాబాద్, సికింద్రాబాద్ ప్రాంతాల్లో ఇళ్లులేని పేదల కోసం అనేక ఉద్యమాలు చేశారని, 1949లో హట్ డ్వెల్లర్స్, గుడిసెవాసుల కోసం జాతీయ స్థాయి సంఘాన్ని ఏర్పాటు చేసి, పేదలకు వారు నివసిస్తున్న స్థలాలపై హక్కులు కల్పించాలని పోరాడారని, కాకా కృషితో 80వేల మందికి పైగా పేదలకు ఇళ్ల సదుపాయం కల్పించడంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. కార్మికుల హక్కుల కోసం జీవితాంతం పోరాటం కాకా ప్రముఖ ట్రేడ్ యూనియన్ నాయకుడిగా ఎదిగి కార్మికుల హక్కుల కోసం పనిచేశారని, కనీస వేతనాలు, పిఎఫ్, గ్రాట్యుటీ, పెన్షన్, వైద్య సదుపాయాలు వంటి కార్మిక సంక్షేమ అంశాల కోసం ఆయన పోరాడారని పేర్కొన్నారు. బెల్లంపల్లి, మంచిర్యాల, కొత్తగూడెం లాంటి తెలంగాణ కోల్‌బెల్ట్ ప్రాంతాల సింగరేణి కార్మికుల సమస్యలపై కాకా ప్రత్యేక శ్రద్ధ చూపారని, సింగరేణి సంస్థను కాపాడటంతో పాటు కార్మికుల సంక్షేమం కోసం ఆయన చేసిన కృషి తెలంగాణ కార్మిక చరిత్రలో ప్రత్యేకంగా గుర్తించబడుతుందని, తెలంగాణ ప్రభుత్వం కూడా సింగరేణి సంస్థను కాపాడటంలో ఆయన పాత్రను ప్రస్తావించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు చింతల వసంత, జంగం కల్పన, నాయకులు చిలుముల శంకర్, దేవసాని ఆనంద్, కంకటి శ్రీనివాస్, మల్లారం చినరాజం, మునిమంద రమేష్, సబ్బని రాజనర్సు, ఎలుక ఆకాష్, పోలు శ్రీనివాస్, గాలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy

లోకల్ గైడ్ ద్విభాషా దినపత్రిక




## 30 మంది ఉపాధ్యాయులకు టీచర్స్ అప్రిసియేషన్ అవార్డులు



**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 05 (లోకల్ గైడ్ ప్రతినిధి) :** ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ , భారతి ఎయిర్‌టెల్ ఫౌండేషన్ సంయుక్తంగా 'టీచర్స్ అప్రిసియేషన్ అవార్డ్స్--2026' కార్యక్రమాన్ని నిర్వహించింది. ది టీచర్ యాప్ ద్వారా నిరంతర వృత్తిపరమైన అభివృద్ధి (సిపిడి), వినూత్న బోధనా పద్ధతులు, సాంకేతికత, కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత విద్యా వనరుల వినియోగంలో ప్రతిభ కనబరిచిన 30 మంది ఉపాధ్యాయులను సత్కరించారు.గత నాలుగు నెలల్లో సుమారు 4,000 మంది ఉపాధ్యాయులు కార్యక్రమంలో పాల్గొనగా, ఎంగేజ్మెంట్ కోర్సు కంప్లీట్ ఏ ఐ. రిసోర్స్ యూసేజ్ విభాగాల్లో టాప్-10 చొప్పున ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులు అందజేశారు. కార్యక్రమానికి ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కె. లింగయ్య, సీట్ డైరెక్టర్ జి. రమేష్, హైదరాబాద్ పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు ఎం. సోమిరెడ్డి హాజరై అవార్డు గ్రహీతలను అభినందించారు.ఈ సందర్భంగా టిఆర్ఎస్ ఎంఏ అధ్యక్షుడు ఎస్. మధుసూదన్, ప్రధాన కార్యదర్శి ఎన్. రమేష్ రావు, కోశాధికారి పి. రాఘవేంద్ర రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల వృత్తిపరమైన అభివృద్ధి నిరంతర ప్రక్రియగా కొనసాగాలని పేర్కొన్నారు. సాంకేతికత, ఏఐ ఆధారిత విద్యా వనరులను వినియోగించడం ద్వారా విద్యా నాణ్యతను మరింత మెరుగుపరచాలని సూచించారు. భారతి ఎయిర్‌టెల్ ఫౌండేషన్ తెలంగాణ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ ప్రణీత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## యశోదలో మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలో రోబోటిక్ టెక్నాలజీ

కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్స ఆర్థోస్కోపి ట్రామా నిపుణులు డాక్టర్ అభిషేక్ బర్లి...వెల్లడి



**హనుమకొండ జిల్లా ప్రతినిధి, అక్టోబర్(లోకల్ గైడ్ న్యూస్) :** హనుమకొండ, మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలో రోబోటిక్ టెక్నాలజీతో కొత్త ముందడుగు సర్జన్ నైపుణ్యానికి ఆధునిక రోబోటిక్ సాంకేతికతను జోడించి ప్రతి రోగికి వ్యక్తిగతికరించిన మోకాలి మార్పిడి శస్త్ర చికిత్స మార్పిడి చేయడం జరుగుతుందని ప్రముఖ కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్స ఆర్థోస్కోపి ట్రామా నిపుణులు డాక్టర్ అభిషేక్ బర్లి అన్నారు. సోమవారం హనుమకొండ నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆధునిక జాయింట్ రీప్లేస్మెంట్ సర్జరీలో ఒక ముఖ్యమైన ముందడుగుగా నిలుస్తుందనీ,సర్జన్ అనుభవం క్లినికల్ కంప్యూటర్ ప్లానింగ్ రొబెటిక్ టెక్నాలజీ ఉపయోగించడం ద్వారా ప్రతి రోగి మొకాలికి అనుగుణంగా శస్త్ర చికిత్సను మరింత వేగంగా ఆధునీకరించవచ్చు అన్నారు. యశోద హాస్పిటల్ సోమాజిగూడ రోబోటిక్ కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలో 15 సంవత్సరాలు పైగా అనుభవం కలిగి ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ టీచర్లు ఆయాల సేవలు వెలకట్టలేనివి...



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్) :** నరేంద్ర మోదీ 25 సంవత్సరాల సుపరిపాలన,అంకిత భావం సందర్భంగా సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బెల్లంపల్లి పట్టణ అధ్యక్షులు దార కళ్యాణి ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లు,ఆయాలను సోమవారం ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అమురాజుల శ్రీదేవి,బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమ జిల్లా కన్వీనర్ పట్టి వెంకట కృష్ణ లు హాజరై అంగన్వాడీ టీచర్లు ఆయాలను శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ప్రధాన మంత్రి ప్రజా సేవకు ప్రతీకగా జరుగుతున్న సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 25నుండి అక్టోబర్ 7వరకు దేశవ్యాప్తంగా అంగన్వాడీ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.సమాజంలో పసిపిల్లలకు పౌష్టికాహారాన్ని అందిస్తు గర్భిణీలు,బాలింతల ఆరోగ్యాన్ని కాపాడడంలో అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని,ఒక దేశ భవిష్యత్తు ఆ దేశ బాలల ఆరోగ్యంపై ఆధారపడి ఉంటుందని, అలాంటి బాలలకు సరైన పోషకాహారం,ప్రాథమిక విద్యను అందించి వారిని భావి పౌరులుగా తీర్చిదిద్దడంలో అంగన్వాడీ కార్యకర్తలు,ఆయాలు అంకితభావంతో పనిచేస్తున్నారని వారి సేవలు కొనియాడారు.ఇంటి వద్ద తల్లిదండ్రులు ఎలా చూసుకుంటారో కేంద్రానికి వచ్చిన ప్రతి చిన్నారినీ అంతకంటే ఎక్కువగా ప్రేమతో ఆప్యాయతతో చూసుకునే అంగన్వాడీ టీచర్లు ఆయాల సేవలు వెలకట్టలేనివి అని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాచర్ల సంతోష్ కుమార్,ఎర్రోజు శ్రీనివాస్,దూది ప్రకాష్,జీదుల రాములు,తోటపల్లి ఓం సాయి,ఇప్ప స్వామి తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో సింగరేణి భవన్ ముట్టడి

-రెండు నెలల్లో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన యాజమాన్యం

-కల్వకుంట్ల కవిత నేతృత్వంలో ఆందోళన విరమణ




**హైదరాబాద్, అక్టోబర్ 05 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ):** సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ రక్షణ సేన పార్టీ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ లోని సింగరేణి భవన్ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఈ ఆందోళనకు టిఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నేతృత్వం వహించారు. సింగరేణి కార్మికులకు రావాల్సిన బకాయిలు, కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రత, పెండింగ్ లో ఉన్న డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున కార్మికులు, పార్టీ కార్యకర్తలు సింగరేణి భవన్ ఎదుట ఆందోళన చేపట్టారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. ఈ ముట్టడితో సింగరేణి భవన్ వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొనడంతో యాజమాన్యం దిగివచ్చింది. ఆందోళనకారులతో చర్చలు జరిపిన యాజమాన్యం, కార్మికుల సమస్యలన్నింటినీ రెండు నెలల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది. యాజమాన్యం హామీతో ఆందోళనను విరమించారు. ఈ సందర్భంగా తెలంగాణ రక్షణ సేన గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ మాట్లాడుతూ.. సింగరేణి కార్మికుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. రెండు నెలల్లో హామీలు నెరవేర్చకపోతే మరోసారి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్మికులకు న్యాయం జరిగే వరకు తెలంగాణ రక్షణ సేన పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

## ప్రజా ఫిర్యాదులపై సత్వర స్పందన..

## బాధితులకు న్యాయం చేయాలని అధికారులకు ఎస్పీ ఆదేశం



**నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. లోకల్ గైడ్.** : పోలీస్ గ్రీవెన్స్ లో పిర్యాదులును పరిశీలించిన జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ .సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ జిల్లాలో వివిద పోలీస్ స్టేషన్ పరిదిలో నుంచి వచ్చిన దాదాపు 53 మంది బాధితులసమస్యలను, ఫిర్యాదులను సవివరంగా విని సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా బాధితులు భూ వివాదాలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక లావాదేవీలు, మోసాలు, ఆస్తి సంబంధిత వివాదాలు తదితర అంశాలపై తమ ఫిర్యాదులను ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి ఫిర్యాదును పరిశీలించిన ఎస్పీ శరత్ చంద్ర పవార్ సంబంధిత పోలీస్ అధికారులు మరియు సిబ్బందితో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై ఆదేశాలు జారీ చేశారు.బాధితుల ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో సమగ్రంగా విచారణ చేపట్టి, వాస్తవాలను నిర్ధారించిన అనంతరం చట్టపరమైన నిబంధనల ప్రకారం సత్వర చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయకుండా, ప్రతి కేసు పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖపై నమ్మకంతో వస్తున్నందున, వారి ఫిర్యాదులను గౌరవంగా స్వీకరించి, నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ అధికారులకు సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యలను పరిష్కరించడం పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని తెలిపారు.గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా జిల్లా ఎస్పీని కలిసి తమ సమస్యలను వివరించే అవకాశం కల్పిస్తున్నామని, ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతతో పరిశీలించి చట్ట పరిధిలో సత్వర పరిష్కారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు.

## ఘనంగా గడ్డం వెంకటస్వామి 97వ జయంతి వేడుకలు...




**మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్) :** దివంగత మాజీ కేంద్ర మంత్రి,ప్రజల మనిషి గడ్డం వెంకటస్వామి కాకా 97వ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కళాశాల వద్ద ఆయన విగ్రహానికి బెల్లంపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం వినోద్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కాకా ప్రజాసేవ,కార్మికులు,పేదలు,బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ఆయన చేసిన సేవలను ఎమ్మెల్యే స్మరించుకున్నారు.ప్రజల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన కాకా ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.ఆయన ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరు ఆయన అడుగుజాడల్లో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి మున్సిపల్ చైర్మన్ దావ స్వాతి,పలువురు కౌన్సిలర్లు,నాయకులు,ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## తానూ నాయక్ నంగారా ఉత్సవాలకు పిలుపు

అక్టోబర్ 10, 11న హైదరాబాద్‌లో గిరిజన సంస్కృతి ఉత్సవాలు






**కారేపల్లి , అక్టోబర్ 5 (లోకల్ గైడ్ న్యూస్):** తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో అక్టోబర్ 10, 11 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న తానూ నాయక్ నంగారా ఉత్సవాలను విజయవంతం చేయాలని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డా. రామచంద్రు నాయక్ పిలుపునిచ్చారు. సోమవారం బంజారాహిల్స్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర నాయకులతో కలిసి ఆయన ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డా. రామచంద్రు నాయక్ మాట్లాడుతూ.. తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర నాలుగో మహాసభల సందర్భంగా తానూ నాయక్ పేరుతో నంగారా ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అక్టోబర్ 10న ఉదయం 11.30 గంటలకు పలక్‌నామా ప్రాంతంలోని రవీందర్ నాయక్ నగర్‌లోని లింబ్రా హోటల్ నుంచి కళా ప్రదర్శన ప్రారంభమవుతుందని చెప్పారు.రాష్ట్రవ్యాప్తంగా గిరిజన కళాకారులు పాల్గొని ఆటపాటలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఉత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. తెలంగాణ వ్యాప్తంగా గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో పోరాడి అమరుడైన గిరిజన యోధుడు తానూ నాయక్ పేరుతో ఉత్సవాలు నిర్వహించడం సంతోషకరమని అన్నారు. మారుతున్న జీవన విధానాల కారణంగా గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు క్రమంగా కనుమరుగవుతున్న నేపథ్యంలో వాటిని పరిరక్షించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ ఈ కార్యక్రమంలో తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం. ధర్మ నాయక్, ప్రధాన కార్యదర్శి ఆర్. శ్రీరాం నాయక్, భూక్యా వీరభద్రం, ఎం. బాలు నాయక్, వాంక్డోత్ వీరన్న, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన వ్యాపార కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని, దాస్యం అభినవ్ భాస్కర్

వస్త్ర షోరూమ్ నిర్వాహకులు మహమ్మద్ గౌస్....వెల్లడి

నాణ్యమైన వస్త్రాలను ప్రజలకు అందుబాటు ధరల్లో అందిస్తాం



**హనుమకొండ జిల్లా ప్రతినిధి, అక్టోబర్(లోకల్ గైడ్ న్యూస్) :** హనుమకొండ, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధితో పాటు వ్యాపార రంగం అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే నాయిని ఆకాంక్షించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని నయీమ్ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్జిఎం కాకతీయ ఫ్యాబ్రిక్, యునైటెడ్ హక్ వస్త్ర షోరూమ్‌లను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పండుగ వేళ నూతనంగా ప్రారంభించిన వ్యాపార సంస్థలు దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ప్రజలకు నాణ్యమైన వస్త్రాలను అందుబాటు ధరల్లో అందిస్తూ వినియోగదారుల ఆదరణ పొందాలని షోరూమ్ నిర్వాహకులకు సూచించారు. నూతన వ్యాపారాల ద్వారా స్థానికంగా ఆర్థిక కార్యకలాపాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. తమ ఆహ్వానాన్ని మన్నించి షోరూమ్‌ల ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కి యునైటెడ్ హక్ వస్త్ర షోరూమ్ నిర్వాహకులు మహమ్మద్ గౌస్,కుటుంబ సభ్యులు,మిత్రులు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఘనంగా సన్మానించారు. అదేవిధంగా యునైటెడ్ హక్ వస్త్ర షోరూమ్ ను నిర్వాహకులు మహమ్మద్ గౌస్ ఆహ్వానం మేరకు తాజా మాజీ కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్ హాజరై నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కాక జయంతి.



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్) :** సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కాక గడ్డం వెంకటస్వామి జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య జిల్లా కేంద్రం రైల్వే స్టేషన్ లోని కాకా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతు 1998వ సంవత్సరంలో బొగ్గు గని కార్మికుల పదవి విరమణ తరువాత 3వ బెనిఫిట్ గా కోల్ మైన్స్ పెన్షన్ ఒప్పందంలో కాకా కీలక పాత్ర పోషించారని అన్నారు.ఆయన మరణించిన తరువాత గత 28సంవత్సరాల కాలం నుండి కోల్ మైన్స్ పెన్షన్ పెంపుదలకు ఏ నాయకుడు,జాతీయ కార్మిక సంఘాలు కృషి చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు.1998లో చేసుకున్న ఒప్పదం మేరకు ప్రతి 3సంవత్సరాలకు ఒకసారి మార్కెట్ లో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కోల్ మైన్స్ పెన్షన్ పెంచాలని ఒప్పందం ఉన్నా గత 28సంవత్సరాల నుండి ఒక శాతం కూడా పెన్షన్ పెంచకపోవడం మూలన లక్షలాది మంది బొగ్గు పెన్షన్ దారులు ఆర్థిక ఇబ్బందులకు గురి అవుతున్నారని పేర్కొన్నారు.కాకా స్ఫూర్తితో ఆయన కుమారుడు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్,పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీ కృష్ణ సింగరేణి కోల్ ఇండియా వ్యాప్తంగా 5లక్షల 80వేల మంది బొగ్గు విశ్రాంత ఉద్యోగులకు కరువు భత్యంతో కూడిన 50శాతం పెన్షన్ పెంచే విధంగా,కనీస పెన్షన్ 15వేలు,హెల్త్ కార్డుపై 25లక్షల వరకు వైద్య సౌకర్యాలు అందించే విధంగా కృషి చేయగలరని విజ్ఞప్తి చేసారు.ఈ కార్యక్రమంలో పుదారి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రులు తమ ఓట్లను నమోదు చేసుకోవాలి



**గండిపేట, అక్టోబర్ 05 (లోకల్ గైడ్):** హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి జరగబోయే శాసన మండలి ఎన్నికల సందర్భంగా ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా తన ఓటును నమోదు చేసుకోవాలని సోమవారం ఆర్య వైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొడ్డు శ్రీధర్ ఓ ప్రకటనలో సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.....ప్రతి ఓటు ఎంతో విలువైనదని, ప్రజాస్వామ్య విలువలను కాపాడటంలో ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. పట్టభద్రుల ఓటు నమోదు కోసం (ఆవోపా) ఆధ్వర్యంలో ప్రత్యేక సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఓటు నమోదు చేసుకోవాలనుకునే పట్టభద్రులు తమ ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ కార్డు, డిగ్రీ సర్టిఫికేట్ ప్రతులను జతచేసి సహాయ కేంద్రాన్ని సంప్రదించాలని బొడ్డు శ్రీధర్ కోరారు.మరిన్ని వివరాల కోసం 9552567224, 9121980792, 9890041486 నంబర్లను సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## మధుసూదన్‌రెడ్డిపై అసత్య ప్రచారం..

పోలీసులకు ఫిర్యాదు

సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



**లోకల్ గైడ్ ఆమనగల్లు, అక్టోబర్ 5:** నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎల్లుగొండ మధుసూదన్‌రెడ్డిపై సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ఆమనగల్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఆమనగల్లు మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు ఆధ్వర్యంలో పోలీసులకు ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీకి చెందిన సోషల్ మీడియా కార్యకర్తలు కోట్ల సాయిబాబా, సిద్ధగోని రమేష్‌గౌడ్, సాయికుమార్ తదితరులు మధుసూదన్‌రెడ్డిపై అసత్య ప్రచారంతో కూడిన వీడియోలను సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. రాజకీయ మనుగడ కోసం నిరాధారమైన వార్తలను సృష్టించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు.ఎంపీ డా. మల్లు రవికి అత్యంత సన్నిహితుడైన మధుసూదన్‌రెడ్డిపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై విచారణ జరిపి, నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.ఈ కార్యక్రమంలో కాలే మల్లయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వాస్పుల శ్రీకాంత్, ఎన్ఎస్‌యూఐ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.డి. ఫరీద్, పులికంటి మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

## విషజ్వరాల విజృంభణ.. పల్లెలు విలవిల

ప్రతి గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి..

పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టాలి: కొండబోయిన నాగేశ్వరరావు



**కారేపల్లి, అక్టోబర్ 5 (లోకల్ గైడ్ న్యూస్):** డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు విజృంభించడంతో పల్లెల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు అన్నారు. విషజ్వరాల నివారణకు ప్రభుత్వం ప్రతి గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు ఉచిత వైద్య సేవలు, మందులు అందించాలని డిమాండ్ చేశారు. సోమవారం షేక్ బందే అలీ అధ్యక్షతన కారేపల్లిలో జరిగిన సీపీఎం గ్రామ శాఖ సమావేశంలో నాగేశ్వరరావు మాట్లాడారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరగకపోవడంతో దోమల బెడద పెరిగి డెంగ్యూ, మలేరియా తదితర జ్వరాలు అధికమవుతున్నాయని తెలిపారు. అనేక గ్రామాల్లో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు, ముగ్గురు జ్వరాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్యం సకాలంలో అందుబాటులో లేక ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాలు, మండల కేంద్రానికి దూరంగా ఉన్న గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు మొబైల్ వైద్య వాహనాల ద్వారా ప్రతి గ్రామంలో వైద్య శిబిరాలు నిర్వహించాలని కోరారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు పల్లె దవాఖానాల్లో వైద్యులు, అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో మురుగు కాలువలను శుభ్రం చేయడం, నీటి నిల్వలను తొలగించడం, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, దోమల నివారణ మందు పిచికారీ చేయడంతో పాటు నిరంతర పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు తలారి దేవప్రకాష్, శాఖ కార్యదర్శి అన్నవరపు కృష్ణ, కొండబోయిన ఉమావతి, ముండ్ల ఏకాంబరం, ముక్క సీతారాములు, ఎస్.కె. మహమ్మద్ పాషా, పాసిని నాగేశ్వరరావు, ఇల్లంగి పిచ్చయ్య, కరికపల్లి రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

RNI NO. APBIL/2013/50718

LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy

లోకల్ గైడ్

ద్విభాషా దినపత్రిక

ఎడిటర్: చింతకుంట్ల రాంరెడ్డి



## నారాయణ పాఠశాల విద్యార్థి ఈ. వరుణ్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



**ఖమ్మం, అక్టోబర్,5: లోకల్ గైడ్:** ఖమ్మం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికల్లో నారాయణ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఈ. వరుణ్ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడు . జిల్లా స్థాయి ఎంపికల్లో తన క్రీడా ప్రతిభను చాటుకున్న వరుణ్ రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం జరిగింది . అదేవిధంగా ఖమ్మం అర్బన్ (సౌత్) అథ్లెటిక్స్ పోటీలలో వంద మీటర్ల పరుగు పందెంలో పి .శశాంక్ మొదటి బహుమతి గెలుచుకోవడం జరిగింది . వీరిని ఖమ్మం నారాయణ విద్య సంస్థల ఏ.జి.ఎం ఎస్.రాంకీ , ఆర్. ఐ క్రాంతి కుమార్ , హై స్కూల్ కోఆర్డినేటర్ ప్రవీణ్ కుమార్ అభినందించారు . ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తూ పాఠశాలకు మంచి పేరు తీసుకురావడం అభినందనీయమని తెలిపారు . రాష్ట్ర స్థాయిలో కూడా వరుణ్ ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు . ఈ కార్యక్రమంలో పీఈటీలు చందు , పావని మరియు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు .

## నర్సంపేట వైద్య కళాశాలలో ఓరియంటేషన్ ప్రోగ్రాం



**నర్సంపేట, అక్టోబర్ 05 (లోకల్ గైడ్):** నర్సంపేట ప్రభుత్వ వైద్య కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి నూతనంగా ప్రవేశం పొందిన ఎంబీబీఎస్ తొలి సంవత్సర విద్యార్థులకు సోమవారం ఓరియంటేషన్ ప్రోగ్రాం కళాశాల ప్రిన్సిపాల్, అదనపు డీఎంఈ డాక్టర్ ఎస్. సంధ్య అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు.అనంతరం ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, వైద్య వృత్తి పవిత్రమైనదని, తెల్లకోటు ధరించిన నాటి నుంచే విద్యార్థుల జీవితంలో నూతన అధ్యాయం మొదలవుతుందన్నారు. 'విద్య, వినియోగం, వికాసం' నినాదంతో నాణ్యమైన విద్య అందిస్తున్నామని, విద్యార్థులు విజ్ఞానాన్ని క్లినికల్ అనుభవాలతో జోడించి మానవీయ విలువలతో సేవ చేయాలని సూచించారు.నర్సంపేట మెడికల్ కళాశాల ఏర్పాటుకు 20 ఎకరాల భూమిని దానం చేసిన దివంగత డాక్టర్ దొడ్డ మోహన్ రావు సేవలను స్మరించుకున్నారు.క్యాంపస్‌లో ర్యాగింగ్ పూర్తిగా నిషేధమని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ దామోదరి బాయి, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎస్. శ్రీదేవి, డాక్టర్ ఎల్. లక్ష్మీనారాయణ, వివిధ విభాగాల హెచ్ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నర్సంపేట ఆర్టీసీ సర్వీసులు పునరుద్ధరించాలి



**నర్సంపేట, అక్టోబర్ 05(లోకల్ గైడ్):** నర్సంపేట డిపో నుంచి బస్సు సర్వీసులు తగ్గించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఏఐడీడబ్ల్యూఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగల రాగసుధ అన్నారు.సోమవారం డిపో మేనేజర్‌కు వినతిపత్రం ఇచ్చారు. నిజామాబాద్, ఆదిలాబాద్, శ్రీశైలం, భద్రాచలం రూట్లలో 15-17 సర్వీసులు తగ్గాయని, 10-20 బస్సులను ఇతర డిపోలకు తరలించారని, 18 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని తొలగించారని ఆరోపించారు.తగ్గించిన సర్వీసులను వెంటనే పునరుద్ధరించి, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

## వికారాబాద్ మార్కెట్ యార్డ్ అభివృద్ధికి ?2.62 కోట్లు మంజూరు

- తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు

వికారాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ చాపలశ్రీనివాస్ ముదిరాజ్



**లోకల్ గైడ్ వికారాబాద్ జిల్లా బ్యూరో :** వికారాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు, తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ గారి ప్రత్యేక చొరవతో వికారాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డ్ మరియు రైతు బజార్ ప్రాంగణంలో పలు అభివృద్ధి పనుల నిమిత్తం రూ. 262.25 లక్షల నిధులకు పరిపాలనా అనుమతి లభించింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ మరియు సహకార శాఖ అధికారిక ఉత్తర్వుల (మెమో సంఖ్య: 2472/వీఖు-శ్రీ.శ్రీ/గూ1/2026-2) పత్రాలను జారీ చేసింది.వికారాబాద్ రైతాంగానికి, మార్కెట్ యార్డ్ పురోగతికి పెద్దపీట వేస్తూ భారీగా నిధులు మంజూరు చేయించినందుకు గాను శాసనసభాపతి శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ గారికి వికారాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం మరియు ప్రాంతీయ రైతాంగం తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## కలెక్టర్ చొరవతో రెండు పాఠశాలల్లో బెంచీల కొరతకు పరిష్కారం



**నర్సంపేట/నల్లబెల్లి, సెప్టెంబర్ 19 (లోకల్ గైడ్):** నల్లబెల్లి మండలంలోని బోల్లోనిపల్లి ప్రాథమిక పాఠశాల, శనిగరం జడ్పీహెచ్ఎస్ పాఠశాలల్లో విద్యార్థులు బెంచీలు లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద దృష్టికి తీసుకెళ్లగా ఆమె వెంటనే స్పందించారు.విద్యార్థులకు తక్షణమే బెంచీలు ఏర్పాటు చేయాలని ఆర్డీఓ, ఎంఆర్వో, ఎంపీడీఓ, ఎంఈఓలను ఆదేశించారు. దీంతో అధికారులు రెండు పాఠశాలలకు తగినన్ని బెంచీలు సమకూర్చి అందించి కొరత తీర్చారు.సమస్య పరిష్కారం కావడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ కలెక్టర్ కు, చొరవ చూపిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

# అభివృద్ధి, పేదల సంక్షేమమే తెలంగాణ ప్రభుత్వ ధ్యేయం...

రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్,

సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల

అర్హులైన ప్రతి నిరుపేదకూ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాలి

విద్యా, వైద్య రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యత

నగరంలోని 48 వ డివిజన్ లో 1.80 కోట్ల రూపాయల

వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణ

పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి



**ఖమ్మం, అక్టోబర్- 5: లోకల్ గైడ్:** రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం, సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తోందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం నగరపాలక సంస్థ పరిధిలోని ఎఫ్ సిఐ బైపాస్ రోడ్డు దానవాయిగూడెం ఫిల్టర్ బెడ్ నుండి ఎంబి గార్డెన్స్ వరకు రూ. 180.00 లక్షల మునిసిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, అర్హులైన నిరుపేదలకు కళ్యాణలక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్, తెల్ల రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత గ్యాస్ సిలిండర్లు వంటి ప్రభుత్వ పథకాలు ఖచ్చితంగా అందాలని అన్నారు. ఇళ్లు కేటాయించేటప్పుడు గుడిసెలలో నివసించే నిరుపేదలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. డివిజన్‌లో ప్రజలకు అవసరమైన డ్రెయిన్లు, పార్కులు, రోడ్లు, మంచినీటి వసతి, విద్యుత్ లైన్ల వంటి మౌళిక వసతుల పనులను వెంటనే మంజూరు చేయించి వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. పేదరికం నుండి శాశ్వత విముక్తి పొందేందుకు చదువు ఒక్కటే మార్గమని మంత్రి అన్నారు. ఖమ్మంలో ముఖ్యమంత్రి సహకారంతో మోడల్ స్కూళ్లు, ఇంటిగ్రేటెడ్ స్కూళ్లతో పాటు కొత్తగా తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఒక్కో విద్యార్థిపై ప్రభుత్వం రూ.1.25 లక్షలు వెచ్చించి ఉచితంగా ఇంగ్లీష్ మీడియం విద్య, వసతి, పుస్తకాలు, దుస్తులు అందిస్తోందని అన్నారు. నగరంలో కబ్జాలు, దౌర్జన్యాలు, పోలీస్ కేసుల ఇబ్బందులు లేకుండా ప్రజలందరూ సుఖసంతోషాలు, ప్రశాంతతతో జీవించాలన్నదే తమ ఆకాంక్ష అని మంత్రి స్పష్టం చేశారు. రాబోయే దసరా పండుగ సందర్భంగా మహిళలకు ముఖ్యమంత్రి కానుకగా చిలకపచ్చ చీరల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అభివృద్ధికి ప్రజలందరూ బాధ్యతాయుతంగా తమ వంతు కృషి చేయాలని మంత్రి అన్నారు.ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ రంజిత్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, ఖమ్మం అర్బన్ మండల తహసీల్దార్ జయచందర్, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



# పత్తి ఎంఎస్ పి కొనుగోళ్లను పకడ్బందీగా నిర్వహించాలి....

జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

రైతులకు మద్దతు ధర అందేలా అన్ని శాఖలు

సమన్వయంతో పనిచేయాలి

129 రైతు వేదికల్లో మాయిశ్చర్ మీటర్లు

అందుబాటులో ఉంచాలి

నోటిఫై చేసిన 8 జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోళ్లకు అన్ని

ఏర్పాట్లు పూర్తి చేయాలి



**ఖమ్మం, అక్టోబర్-05: లోకల్ గైడ్:** 2026-27 సీజన్‌లో పత్తి కనీస మద్దతు ధర కు కొనుగోళ్లను సమర్థవంతంగా పర్యవేక్షిస్తూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సంబంధిత శాఖల అధికారులతో పత్తి కనీస మద్దతు ధర కొనుగోళ్ల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా పత్తి సాగు విస్తీర్ణం, అంచనా దిగుబడి, కొనుగోలు కేంద్రాలు, రైతుల నమోదు, నాణ్యత ప్రమాణాలు, తేమ శాతం, వెయిమెంట్, చెల్లింపులు, భద్రత తదితర అంశాలపై సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2026-27 సీజన్‌కు పత్తి కనీస మద్దతు ధర (మీఎస్పా)ను క్వింటాల్‌కు రూ. 8,667గా నిర్ణయించిందన్నారు. 2025-26 సీజన్‌లో క్వింటాల్‌కు రూ. 8,110 ఉండగా, ప్రస్తుతం రూ. 557 పెంచినట్లు తెలిపారు. మీడియం స్టేపుల్ పత్తికి క్వింటాల్‌కు రూ. 8,267, లాంగ్ స్టేపుల్ పత్తికి క్వింటాల్‌కు రూ. 8,667 మద్దతు ధరగా నిర్ణయించబడిందని తెలిపారు.2026-27 సీజన్‌లో ఖమ్మం జిల్లాలో 2,35,637 ఎకరాల్లో పత్తి సాగు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. గత ఏడాది 2,25,613 ఎకరాల్లో పత్తి సాగు కాగా, ఈ ఏడాది 10,024 ఎకరాల మేర సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు.



రైతుల వివరాలను కపాస్ కిసాన్ యాప్‌కు అనుసంధానం చేయాలి:

పత్తి కొనుగోళ్లలో వ్యవసాయ శాఖ కీలక పాత్ర పోషించాలని కలెక్టర్ సూచించారు. నిజమైన పత్తి రైతులను గుర్తించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. కౌలు రైతులను తాత్కాలికంగా డేటాబేస్‌లో నమోదు చేసే విధానాన్ని అమలు చేయాలని తెలిపారు.పత్తి సాగు చేస్తున్న రైతుల వివరాలను ఎన్ఐసి ద్వారా కపాస్ కిసాన్ యాప్‌కు బదిలీ చేసే ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. అగ్రి స్టాక్‌ను కపాస్ కిసాన్ యాప్‌తో అనుసంధానం చేసి రైతుల వివరాలు, సేవల పంపిణీని మరింత సులభతరం చేసేందుకు వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలు, సిసిఐ సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

అంతర్ జిల్లా మ్యాపింగ్‌ను ముందుగానే పూర్తి చేయాలి:

పత్తి కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అంతర్ జిల్లా మ్యాపింగ్ ప్రతిపాదనలను ముందుగానే ఖరారు చేసి సిసిఐ పరిశీలనకు పంపాలని కలెక్టర్ సూచించారు. కొనుగోళ్లు ప్రారంభమయ్యే నాటికి అవసరమైన అన్ని ప్రక్రియలను పూర్తి చేయాలని ఆదేశించారు.రైతులు తమ పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకురాక ముందే తేమ శాతాన్ని పరిశీలించుకునేలా జిల్లాలోని 129 రైతు వేదికల్లో మాయిశ్చర్ మీటర్లు అందుబాటులో ఉంచాలని మార్కెటింగ్ శాఖను కలెక్టర్ ఆదేశించారు. తేమ శాతం అధికంగా ఉండటం వల్ల పత్తి తిరస్కరణకు గురికాకుండా రైతులకు ముందుగానే అవగాహన కల్పించాలని సూచించారు.

టోల్‌ఫ్రీ, వాట్సాప్ నంబర్లపై విస్తృత ప్రచారం:

పత్తి కొనుగోళ్లకు సంబంధించి రైతుల సమస్యలను పరిష్కరించేందుకు 1800 599 5779 టోల్‌ఫ్రీ నంబర్, 88972 81111 వాట్సాప్ నంబర్‌ను కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి రైతుల సమస్యలను ప్రతిరోజూ ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు.ప్రతి మంగళవారం నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమం ద్వారా పత్తి కొనుగోళ్లకు సంబంధించిన ఎఫ్ఏక్యూ ప్రమాణాలు, స్లాట్ బుకింగ్ విధానం, టోల్‌ఫ్రీ నంబర్, కొనుగోలు కేంద్రాల వివరాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. బ్రోచర్లు, వాల్ పోస్టర్లు, కర పత్రాలు, బ్యానర్లు, టీవీ చానళ్లతో పాటు బల్క్ మెసేజ్‌ల ద్వారా కూడా రైతులకు విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు.

కొనుగోలు స్లాట్ల వివరాలను ముందుగానే తెలియజేయాలి:

సిసిఐ అధికారులు పత్తి కొనుగోలు స్లాట్ల ప్రారంభ వివరాలను జిల్లా కలెక్టర్, జిల్లా మార్కెటింగ్ అధికారి, మార్కెట్ కమిటీ కార్యదర్శులకు ముందుగానే అందించాలని కలెక్టర్ సూచించారు. తద్వారా రైతులకు ముందస్తుగా సమాచారం అందించి కొనుగోలు ప్రక్రియను క్రమబద్ధీకరించాలని తెలిపారు.కొనుగోళ్లు ప్రారంభమైన వెంటనే అన్ని నోటిఫైడ్ జిన్నింగ్ మిల్లులను కార్యకలాపాల్లోకి తీసుకురావాలని సూచించారు. రైతులు సమీపంలోని జిన్నింగ్ మిల్లుకు పత్తిని తరలించుకునే అవకాశం కల్పించడం ద్వారా రవాణా ఖర్చు తగ్గుతుందని తెలిపారు. అన్ని మిల్లులను ఒకేసారి ప్రారంభించడం ద్వారా కొన్ని మిల్లుల్లో మాత్రమే ముడి పత్తి నిల్వలు పేరుకుపోకుండా నివారించవచ్చని పేర్కొన్నారు.

8 జిన్నింగ్ మిల్లులను కొనుగోలు కేంద్రాలుగా నోటిఫై:

2026-27 సీజన్‌లో ఖమ్మం జిల్లాలో పత్తి కొనుగోళ్ల కోసం 8 జిన్నింగ్ మిల్లులను కొనుగోలు కేంద్రాలుగా నోటిఫై చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఖమ్మం, మద్దులపల్లి, మధిర, వైరా ప్రాంతాల్లోని నోటిఫైడ్ జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు.

అగ్నిమాపక భద్రతా పరికరాల తనిఖీలు పూర్తి చేయాలి:

కొనుగోలు కేంద్రాలుగా ప్రతిపాదించిన జిన్నింగ్ మిల్లుల్లో అగ్నిమాపక భద్రతా పరికరాల తనిఖీలను అత్యవసరంగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లా అగ్నిమాపక అధికారి అన్ని ప్రతిపాదిత జిన్నింగ్ మిల్లులను తనిఖీ చేసి, అవసరమైన భద్రతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.జిన్నింగ్ మిల్లుల్లోని అన్ని వేయింగ్ బ్రిడ్జిలను కొనుగోళ్ల ప్రారంభానికి ముందే తనిఖీ చేసి, క్యాలిబ్రేషన్‌ను నిర్ధారించాలని జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. కొనుగోలు సీజన్ మొత్తం వేయింగ్ బ్రిడ్జిలను తరచుగా తనిఖీ చేస్తూ ఖచ్చితమైన తూకం జరిగేలా చూడాలని సూచించారు. మాయిశ్చర్ మీటర్ రీడింగులు, ఎఫ్ఏక్యూ ప్రమాణాల రీడింగులు, వెయిమెంట్ డేటాను సిస్టమ్ సాఫ్ట్‌వేర్‌తో డిజిటల్‌గా అనుసంధానం చేసే చర్యలు చేపట్టాలని ఆదేశించారు.జిన్నింగ్ మిల్లులు, మార్కెట్ యార్డుల్లో అవసరమైన సమయంలో పోలీసు భద్రత కల్పించాలని కలెక్టర్ సూచించారు. పత్తి బేళ్ల రవాణాలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పోలీసు, రవాణా శాఖలు సమన్వయంతో పనిచేసి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.అన్ని పత్తి కొనుగోలు కేంద్రాలు, నోటిఫైడ్ జిన్నింగ్ మిల్లుల్లో నిర్దేశిత ప్రమాణాల ప్రకారం సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి, అవి నిరంతరం పనిచేసేలా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించరు.కనీస మద్దతు ధర ప్రయోజనం పొందేందుకు ఆధార్ ధృవీకరణ తప్పనిసరి:

కనీస మద్దతు ధర ప్రయోజనాలను పొందేందుకు రైతులు ఆధార్ ఆధారిత ధృవీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. పత్తి కొనుగోలు, చెల్లింపుల ప్రక్రియను ఆధార్ ధృవీకరించిన బ్యాంకు ఖాతాలతో అనుసందానం చేయనున్నందు న రైతులు తమ ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలు సక్రమంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి సంతోష్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, సిసిఐ, అగ్నిమాపక, లీగల్ మెట్రాలజీ, పోలీస్, రవాణా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అవినీతికి పాల్పడిన అధికారులను వెంటనే సర్వీస్ నుండి తొలగించాలి

విలాసవంతమైన ఇల్లు వాహనాలు సంపాదించాలని ఆశ

సామాన్య ప్రజల దగ్గర ఫైల్ కదలాలంటే డబ్బులు కట్టవలసిందే




**వికారాబాద్ లోకల్ గైడ్ జిల్లా బ్యూరో ప్రతినిధి :** ఏసీబీ వరుస వలలో ప్రభుత్వ ఉద్యోగుల్లో పెరిగిపోతున్న దురాశకు కారణాలేంటితెలంగాణలో రెవెన్యూ,ఆర్డిఓ తాసిల్దార్ వైద్య ఆరోగ్య శాఖలో మున్సిపల్, పోలీస్,టౌన్ ప్లానింగ్, రిజిస్టర్ ఆఫీస్ విద్యుత్ పంచాయతీరాజ్ వంటి శాఖల్లో అధికారులను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వరుసగా పట్టుకుంటుండడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం నుంచి నిర్దేశిత జీతాలు, ఉద్యోగ భద్రత ఉన్నప్పటికీ కొంతమంది అధికారుల్లో ఈ స్థాయిలో అవినీతి పెరిగిపోవడానికి ప్రధాన కారణాలు పారదర్శకత లేకపోవడం డ చట్టపరమైన లొసుగులుప్రజాసేవలో పారదర్శకత లోపించడం, సామాన్యుల దరఖాస్తుల పరిష్కారానికి స్పష్టమైన కాలపరిమితి పాటించకపోవడం వల్ల అధికారులకు లంచాలు డిమాండ్ చేసే అవకాశం దక్కుతోంది. చట్టాల్లోని లొసుగులను ఆసరాగా చేసుకుని పనులను కావాలనే ఆలస్యం చేస్తూ, ప్రజలను ఇబ్బంది పెట్టి డబ్బులు రాబడుతున్నారు.శిక్ష పడుతుందనే భయం తగ్గడంఏసీబీకి చిక్కినప్పటికీ కేసుల విచారణ పూర్తికావడం, కోర్టుల్లో శిక్షలు పడటానికి సుదీర్ఘ సమయం పడుతుండటంతో అధికారుల్లో భయం నశిస్తోంది. సస్పెండ్ అయినా కొద్దిరోజుల తర్వాత తిరిగి సర్వీసులోకి రావచ్చుననే ధీమా కూడా దీనికి కారణమవుతోంది.విలాసవంతమైన జీవనశైలి పై మోజుసమాజంలో హోదాను జీతంతో కాకుండా కూడబెట్టిన ఆస్తులతో కొలిచే ధోరణి పెరిగింది. అనతికాలంలోనే భారీగా ఆస్తులు, విలాసవంతమైన ఇళ్లు, వాహనాలు సంపాదించాలనే దురాశ అధికారులను అక్రమ మార్గాల వైపు నడిపిస్తోంది.వ్యవస్థాగత ఒత్తిళ్లుఆకర్షణీయమైన పోస్టింగ్‌లు, పదోన్నతుల కోసం మధ్యవర్తులకు లేదా ఎగువ స్థాయికి పెద్ద మొత్తంలో చెల్లించాల్సి రావడం వల్ల, ఆ సొమ్మును ప్రజల నుంచి లంచాల రూపంలో రాబట్టేందుకు కొందరు అధికారులు యత్నిస్తున్నారు.ప్రజల తొందరపాటు డ అవగాహన లోపంపనులు త్వరగా పూర్తికావాలనే తొందరలో లేదా చట్టపరమైన సమస్యలను అధిగమించడానికి కొందరు బాధితులే స్వయంగా లంచం ఇవ్వడానికి సిద్ధపడటం కూడా అధికారులకు ఆయుధంగా మారుతోంది.అవినీతి నిర్మూలనకు మార్గాలుఈ-గవర్నెన్స్ పెంపొందించడం:ప్రజలు నేరుగా అధికారులను కలిసే అవసరం లేకుండా ఆన్‌లైన్ సేవలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడం. నిర్ణీత గడువులోగా పనులు పూర్తయ్యేలా సేవా హక్కు చట్టాన్ని కఠినంగా అమలు చేయడం.కఠిన శిక్షలు డ ఆస్తుల జప్తు: అవినీతికి పాల్పడిన వారిని వెంటనే సర్వీసు నుంచి తొలగించడంతో పాటు వారి అక్రమాస్తులను వేగంగా జప్తు చేయడం.బాధితులు ఏసీబీని ఆశ్రయించడం: ఏ ప్రభుత్వ అధికారి అయినా లంచం డిమాండ్ చేస్తే ప్రజలు భయపడకుండా ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064 లేదా వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని అధికారులు కోరుతున్నారు.

Edited, Printed, Published & Owned by CH.RAM REDDYPublished from CRR publications, D.No.1-144/1, Near Apple Hospital Mothinagar, Balanagar Mandal, Ranga Reddy Dist.Telangana State and printed atGayatri Printers, near Apple Hospital Mothinagar, Balanagar Mandal, Rangareddy Dist,Telangana state.RNI NO:APBIL/2013/50718 Editor CH.RAM REDDYEMAIL: Localguide9999@gmail.com eb:www.local-guidenews.com,contact:8977761499\\\